ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 18.04.2026 | సంపుటి :12 సంచిక : 269 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV


# మోదీ సర్కారుకు భారీ షాక్

## లోక్‌సభలో వీగిపోయిన మహిళా, డీలిమిటేషన్ బిల్లులు

**131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం**

**అనుకూలంగా 298.. వ్యతిరేకంగా 230 ఓట్లు**




- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- మెజారిటీ అవసరమైన 326 ఓట్లను సాధించలేకపోయిన ఎన్డీఏ
- మిగతా రెండు బిల్లులు వెనక్కి తీసుకున్నట్లు
- ప్రకటించిన కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండియా కూటమి





న్యూఢిల్లీ(జనంసాక్షి):మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేక పోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం

మిగతా 2లో..

### దేశ చరిత్రలో మైలురాయి

- రాహుల్ గాంధీ నేతృత్వంలో ప్రతిపక్షాల ఐక్యత
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఇది జాతీయ విపత్తును నివారించిన రోజు
- రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై సీఎం రేవంత్

2లో..

### ఇది ముమ్మాటికీ మహిళాబిల్లు కాదు

- 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి
- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికారత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య: రాహుల్
- ఈ పద్ధతిలో మహిళా బిల్లును పెట్టడాన్ని వ్యతిరేకించాం: ప్రియాంక
- ఈ విజయం కేవలం ట్రైలర్ మాత్రమే : సీఎం స్టాలిన్

9లో..

కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా

### నిరసన ప్రదర్శనలు

- పార్లమెంటులో ఎన్డీఏ నేతల సమావేశంలో నిర్ణయం
- లోక్‌సభలో అత్యంత విచిత్రమైన దృశ్యం ఆవిష్కృతం : అమిత్ షా
- విపక్షాల తీరుపై పార్లమెంట్ ప్రాంగణంలో మహిళా ఎంపీల ఆందోళన

భారత రాజ్యాంగాన్ని సవరించే బిల్లును పరిగణనలోకి తీసుకోవాలన్నది ఇక్కడ ప్రశ్న. సవరణలకు లోబడి, ఓట్ల విభజన ఈ విధంగా ఉంది. అనుకూలం (అవును) - 298, వ్యతిరేకం (కాదు) - 230 రాజ్యాంగంలోని ఆర్టికల్ 368 నిబంధనల ప్రకారం, సభలోని మొత్తం సభ్యుల సంఖ్యలో మెజారిటీ, సభకు హాజరై ఓటు వేసిన సభ్యులలో కనీసం మూడింట రెండొంతుల మెజారిటీ ఈ తీర్మానానికి రానందున ఇది ఆమోదం పొందలేదు. కాబట్టి, ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై తదుపరి చర్యలు కొనసాగించడం సాధ్యం కాదు. అందువల్ల, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు 2026, డీలిమిటేషన్ (పునర్విభజన) బిల్లు 2026 కి సంబంధించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా,

4.30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్

# సేకరించండి

- 5 శాతం నూకతో బాయిల్డ్ రైస్ సరఫరాకు సిద్ధం
- పాత బకాయిలు రూ.1,468.96 కోట్లు విడుదల చేయండి
- పోషకాహార బియ్యం పంపిణీని పునఃప్రారంభించండి
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ వినతి



ఢిల్లీ(జనంసాక్షి):యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్ ఎంటీ) బాయిల్డ్ రైస్ సేకరించాలని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ధాన్యం యాసంగి పంట బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలమని వారు కేంద్ర మంత్రికి తెలియజేశారు. గత ఆరు యాసంగి సీజన్లలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి జోషిని ఆయన నివాసంలో సీఎం, రాష్ట్ర మంత్రి శుక్రవారం ఉదయం కలిశారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్‌కు భారీ డిమాండ్ ఉన్నందున సరఫరా పెంచాలని ఇటీవల కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం అధికారులు సూచించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తెలంగాణలో ఈ యాసంగి సీజన్‌లో 90 ఎల్‌ఎంటీ ధాన్యం ఉత్పత్తి అవుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. తెలంగాణలో పండే యాసంగి ధాన్యం బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుకూలంగా ఉంటుందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఈ నేపథ్యంలో యాసంగి

మిగతా 2లో..

# హమ్మయ్య.. హర్మూజ్ తెరుచుకుంది

**జలసంధి గుండా ప్రకటన నౌకల రాకపోకలకు ఇరాన్ లైన్‌క్లియర్**
**పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం**

### ఇరాన్ నిర్ణయంతో దిగొచ్చిన చమురు ధరలు

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచినట్లు ఇరాన్ ప్రకటించింది. అన్ని వాణిజ్య నౌకల రాకపోకలకు అనుమతించనున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వెల్లడించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఇరాన్ నుంచి ఈ ప్రకటన వెలువడింది. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్మూజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగనున్నాయని తెలిపారు. ఇరాన్‌కు ధన్యవాదాలు చెప్పారు.

**పడిపోయిన ముడిచమురు ధరలు**

ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్లు పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.ఇరాన్ ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్ దూసుకెళ్తోంది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ సూచీ 1 శాతం పెరగ్గా.. ఎస్అండ్‌పీ 500 సూచీ 0.7 శాతం పుంజుకొంది. నాస్‌డాక్ కాంపోజిట్ ఒక శాతం మేర లాభపడింది. భారత్ స్టాక్ మార్కెట్‌ను ప్రతిఫలించే గిఫ్ట్ నిఫ్టీ (ఫ్యూచర్స్) సైతం దాదాపు 300 పాయింట్లు మేర లాభంతో 24,700 పాయింట్ల ఎగువన ట్రేడవుతోంది.






### ఇరాన్‌తో యుద్ధంలో త్వరలోనే విజయం సాధిస్తాం

**ఇప్పటివరకు 9 యుద్ధాలు ఆపాను : ట్రంప్**

న్యూయార్క్(జనంసాక్షి):ఇరాన్‌తో యుద్ధం విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో రెండు నెలలే యుద్ధం చేశామని అన్నారు. అమెరికా చేసిన ఇతర యుద్ధాలు 18 ఏళ్లు, నాలుగేళ్లు కొనసాగాయని తెలిపారు. తాజా యుద్ధంలో తాము

మిగతా 2లో..

# కాళేశ్వరంపై ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశ్యం లేదు

- ఎన్డీఎస్ఏ చైర్మన్ జైన్‌తో చర్చించాం
- వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి
- 20న సీఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు.శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చే లోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం

మిగతా 2లో..



### కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ

- ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలి
- మే 30 లోగా పరిశీలనలు పూర్తిచేయాలని ఆదేశం

2లో..

### తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

లోయలో పడ్డ వ్యాన్.. పదిమంది మృతి

రాహుల్ ద్వంద్వ పౌరసత్వం..

### కేసు నమోదు చేయండి

అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు

ఇండోనేసియాలో హెలికాప్టర్

### కుప్పకూలి..

8 మంది మృతి

రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా

### మరోసారి హరివంశ్

వివరాలు 2వ పేజీలో..

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

- కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం
- లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం
- మంత్రి పొన్నం లేఖపై డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టీకరణ
- తేజస్వీ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీరియస్
- ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్
- పార్లమెంట్ ఎదుట ఎంపీల నిరసన



హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ ఎవ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్తాన్

మిగతా 2లో..

# మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

- పాకిస్తాన్‌కు భారత్ హెచ్చరిక
- భారత్, పాక్ పోటాపోటీగా
- ఆయుధ పరీక్షలు.. నోటమ్‌లు జారీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లు పై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన ప్రక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు.పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు.

**భారత్, పాక్ పోటాపోటీగా ఆయుధ పరీక్షలు: నోటమ్‌లు జారీ**

క్షిపణుల ప్రయోగాలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్-పాకిస్థాన్‌లు ఒకేసారి నోటమ్‌లు జారీ చేశాయి. ఈ క్రమంలో అరేబియా సముద్రంలో పోటాపోటీగా ఇరుదేశాలు క్షిపణుల విన్యాసాలు జరపనున్నట్టు తెలుస్తోంది.

మిగతా 2లో..

### సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

- విద్యుత్ శాఖ ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి
- సీఎండితో చర్చలకు ఆదేశించిన డిప్యూటీ సీఎం

హైదరాబాద్(జనంసాక్షి): ట్రాన్స్కో సీఎండితో మా సమస్యల పై చర్చించేందుకు డిప్యూటీ సీఎం ఆదేశించిన నేపథ్యంలో వెంటనే సమ్మె విరమించాలని నిర్ణయించినట్టు ఆర్టిజన్ల జేఏసీ చైర్మన్ సతీష్ రెడ్డి ప్రకటించారు. శుక్రవారం ఉదయం హైదరాబాదులోని ప్రజా భవన్ లో ఆర్టిజన్ల జేఏసీ నాయకులు డిప్యూటీ సీఎంతో సమావేశమయ్యారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులతో చర్చలకు అనుమతించిన డిప్యూటీ సీఎంకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆర్టిజన్ల జేఏసీ కన్వీనర్ సాయిలు ప్రకటించారు. ఉద్యోగులు ప్రజలను మెప్పించే పనులు చేయాలి, సమ్మెపై బ్యాన్ ఉన్నదని తెలిసి, వేసవిలో విద్యుత్తు డిమాండ్ పీక్ స్థాయిలో ఉంటుంది ఈ సమయంలో అకస్మాత్తుగా సమ్మెకు వెళ్లడం సరైనది కాదని డిప్యూటీ సీఎం తెలిపారు. చర్చల ద్వారానే సమస్యల పరిష్కారం జరుగుతుందని

మిగతా 2లో..

## ఇరాన్‌తోతో యుద్ధంలో త్వరలోనే విజయం సాధిస్తాం

త్వరలోనే విజయం సాధించనున్నట్లు వెల్లడించారు. ఇరాన్‌పై సైనిక చర్యకు దిగకపోయుంటే.. చెడు పరిణామాలు చోటుచేసుకొనేవన్నారు. ఇక, ఇరాన్‌లో త్వరలో కీలక పరిణామాలు చోటుచేసుకోవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. చమురు ధరల గురించి ప్రస్తావిస్తూ.. రానున్న వారం రోజుల్లో ఏం జరుగుతుందో చూద్దాం అని అన్నారు. అమెరికా- ఇరాన్ మధ్య కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించాలా, వద్దా అనే దానిపై ఇంకా స్పష్టత లేదన్నారు. టెహ్రాన్ తమతో ఒప్పందం చేసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం తాము ఆ విషయం పైనే దృష్టిసారించామని, చర్చల్లో పురోగతి సాధిస్తే.. కాల్పుల విరమణను పొడిగించాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ వారాంతంలో తదుపరి చర్చలు జరగవచ్చని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ట్రంప్ పునరుద్ఘాటించారు. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను తమకు ఇచ్చేందుకు అది అంగీకరించిందన్నారు. ఇది గొప్ప విషయంగా అభివర్ణించారు. దీంతో త్వరలో జరగనున్న చర్చలు సానుకూలంగా ఉండవచ్చని ఆశాభావం వ్యక్తంచేశారు. లెబనాన్- ఇజ్రాయెల్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ట్రంప్ స్వయంగా ఈ కాల్పుల విరమణను ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా తాను ఇప్పటివరకు 9 యుద్ధాలు ఆపానంటూ మరోసారి పాత పాట పాడారు. ఇది తనకు దక్కిన గౌరవమని పేర్కొన్న ఆయన.. తాను ఆపే యుద్ధాల్లో ఇది పదోది కాబోతోందంటూ 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టిన విషయం తెలిసిందే.

## రాజ్యసభ డిప్యూటి ఛైర్మన్‌గా మరోసారి హరివంశ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా హరివంశ్ నారాయణ్ సింగ్ ఎన్నికయ్యారు. ప్రతిపక్ష అభ్యర్థులు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఆయన ఉపసభాపతి బాధ్యతలు చేపట్టడం ఇది మూడోసారి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ డిప్యూటీ ఛైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుభవం రాజ్యసభకు ఎంతో అవసరమని అన్నారు. ఆయన అందరినీ కలుపుకుని వెళ్లాలని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. హరివంశ్ నేతృత్వంలో సభ మరింత శక్తిమంతం అవుతుందని అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా నూతన ఉపసభాపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ప్రతిపక్షానికి కూడా తగిన ప్రాధాన్యం ఇస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఆయన అందరి వాడని అన్నారు. ఇటీవల ఆయన రాజ్యసభ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయనను రాష్ట్రపతి కోటాలో నామినేట్ చేశారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**చెన్నై(జనంసాక్షి):**తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

## సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన ఆర్టిజన్లు

డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. ఆర్టిజన్ల సమస్యలపై మానవీయ కోణంలో ప్రజా ప్రభుత్వం ఆలోచన చేస్తుందని తెలిపారు. విద్యుత్ సంఘాల నేతలు ఎప్పుడు వచ్చినా ప్రభుత్వం చర్చలు చేస్తుంది, వారి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు పోతుందని జేఏసీ నాయకులకు డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. ఆర్థిక భారం లేకుండా మానవీయ కోణంలో పరిష్కరించగలిగే సమస్యలపై ఆర్టిజన్ల జేఏసీతో ట్రాన్స్కో సిఎండి చర్చలు జరుపుతారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా తెలిపారు. చర్చల్లో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎమ్మెల్సీ అద్దంకి దయా కర్, ఆర్టిజన్ల కో చైర్మన్లు చంద్రారెడ్డి, శ్రీధర్ గౌడ్, చందర్ సింగ్ ఠాకూర్, వైస్ చైర్మన్ సంతోష్, కోశాధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పదేళ్ల పాటు ఏం చేశారు?

**అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు**

**ఇప్పుడే పాదయాత్ర ఎందుకనో?**

**కేటీఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత**

హైదరాబాద్(జనంసాక్షి):పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు.ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు.

**సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్.**
**ఆపరేషన్ సర్కిల్, సరూర్‌నగర్**

**షార్టు టెండరు నోటీస్ నం.01/2026-27**

(క్ర.సం. 1)(ఎస్‌సీ రిజర్వుడు) 11 కేవీ ఫీడర్ బైఫరిఫికేషన్ చేయుట,2),3),4),5),6),7),8) సరూర్‌నగర్ సర్కిల్‌లో వివిధ సబ్‌డివిజన్‌లలో వేర్వేరు ఆపరేషన్‌లలో యూనిఫాం సర్వీస్‌లైన్ చార్జీల కింద ఎల్‌టీ క్యాపిటల్ పనులకు కాంట్రాక్టు కుదుర్చుకొనుట. 13)(ఎక్స్‌టెన్షన్ -2) సరూర్‌నగర్ సర్కిల్ వద్ద (వడ్డెర/సాగర) ఆర్‌ఎంయూల వార్షిక మరమ్మతుల కొరకు. 9)(ఎస్‌సీ రిజర్వుడ్) ఈ ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.in ద్వారా 11కేవీ బైఫర్‌కేషన్ చేయుట. 10)హెచ్‌ఎండబ్ల్యూస్ & ఎస్‌బీ సరఫరా ఎక్స్‌టెన్షన్ చేయుట. 11) 12) (ఎక్స్‌టెన్షన్ -1) ఫర్ ఈ/ఎస్ ఇబ్రహీంపట్నం డివిజన్ వద్ద తేది: 20.04.2026 నుండి సెల్ మొదలుపెట్టుట. మిగతా వివరాలకు www.tgsouthernpower.org. వెబ్‌సైట్‌ను సందర్శించండి. మిగతా వివరాలకు ఫోన్: 8712472302

**సూపరింటెండింగ్ ఇంజినీరు(ఆర్ & బి) ఎలెక్ట్రికల్, ఆపరేషన్/సరూర్‌నగర్ సర్కిల్,హైదరాబాద్**

DIPR No.1768-PP/CL/ADVT/1/2024-25

# మోదీ సర్కారుకు భారీ షాక్

ఓటింగ్ జరిగింది. 131 వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవ సరమైన మెజారిటీ సాధించలేకపోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ ప్రక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఏ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

**రెండు బిల్లులు వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించిన కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు**

రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయినందున మిగతా 2 బిల్లులనూ వెనక్కి తీసుకుంది కేంద్రం. ఈ మేరకు రెండు బిల్లులనూ వెనక్కి తీసుకుంటున్నట్లు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. అనంతరం లోక్‌సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు.

## దేశ చరిత్రలో మైలురాయి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్,



కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు.

## తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్- పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

**తేజస్వీ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సీరియస్**

బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసారు. లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన పక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

**పార్లమెంట్ ముందు ఎంపిల నిరసన**

పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు ఆందోళనకు దిగారు. ప్లకార్డులు పట్టుకుని బైఠాయిచారు. తెలంగాణ ఏర్పాటును భారత్ - పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ భాజపా ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను తప్పుబట్టారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని అవమానించవద్దని ప్లకార్డులు ప్రదర్శించారు.

## మా అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకోవద్దు

ఏప్రిల్ 20, తెల్లవారుజామున 3:00 గంటల నుంచి ఏప్రిల్ 21 మధ్యాహ్నం 3:00 గంటల వరకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని పాకిస్థాన్ నోటమ్ జారీ చేసింది. అలాగే భారత్ కూడా ఏప్రిల్ 22న ఉదయం 9:30 నుంచి ఏప్రిల్ 25న రాత్రి 9:30 గంటల వరకు సుదీర్ఘ కాలానికి ఈ హెచ్చరికలు జారీ చేసింది. సముద్రంపై సైనిక విన్యాసాల సమయంలో నిర్దేశించిన జోన్‌లకు పౌర విమానాలు, నౌకలు దూరంగా ఉండాలని 'నోటీసెస్ టు ఎయిర్‌మెన్' (ఔుంఁ), 'మారిటైమ్ అడ్వైజరీస్' లాంటి హెచ్చరికలు జారీ చేయడం దేశాల మధ్య సాధారణంగా జరుగుతూనే ఉంటుంది. అయితే ఇరుదేశాలు ఒకేసారి ఈ నోటమ్‌లు ప్రకటించడం విశేషం.పాక్ 200 కిలోమీటర్ల మేర ఈ జోన్‌ను ప్రకటించగా, దానికి రెట్టింపుగా భారత్ 400 కిలోమీటర్ల క్షిపణుల విన్యాసం కోసం జోన్‌ను ప్రకటించింది. అయితే సరిహద్దు దేశాలు తరచూ ఇలాంటి క్షిపణుల ప్రయోగాలు నిర్వహిస్తూనే ఉంటాయి.

**రాహుల్ ద్వంద్వ పౌరసత్వం**

## కేసు నమోదు చేయండి

న్యూఢిల్లీ(జనంసాక్షి): ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

## ఇండోనేసియాలో హెలికాప్టర్ కుప్పకూలి..

జకార్త(జనంసాక్షి):హెలికాప్టర్ కుప్పకూలడంతో అందులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన ఇండోనేసియాలోనిపశ్చిమ కాళీమంతన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకొంది. దాని శకలాల గుర్తింపు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. "ఎయిర్ బస్ హెచ్-130 గురువారం మెల్వాయ్‌లో టేకాఫ్ అయిన కొంత సమయానికే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌రూంతో సంబంధాలు తెగిపోయాయి. ఓ కొండపై దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ సిగ్నల్ మిస్ అయింది. టేకాఫ్ అయిన ప్రాంతానికి మూడు కిలోమీటర్ల దూరంలో రెస్క్యూ బృందం హెలికాప్టర్‌తోక భాగాన్ని గుర్తించింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సిబ్బంది, ఆరుగురు ప్రయాణికులు అక్క డికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సిఉంది" అని అధికారులు పేర్కొన్నారు.





## 4.30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించండి

పంటకు సంబంధించిమొత్తం 30 ఎల్‌ఎంటీ బాయిల్డ్ రైస్ (5 శాతం నూకతో), 5 ఎల్‌ఎంటీ రా రైస్ (10 శాతం నూకతో) సరఫరా చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. బాయిల్డ్ రైస్ సరఫరాకు సంబంధించి ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రి చేసిన ప్రతిపాదనకు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు.× 2014-15 వర్షాకాలం పంట అదనపు లెవీ సేకరణకు సంబంధించిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దేశంలోనే వరి ధాన్యం ఉత్పత్తి, సేకరణలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే రైతులకు తాము చెల్లింపులు చేస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి తెలియజేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మీద ఉన్న ఒత్తిడిని గుర్తించి వెంటనే పాత బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపాల నివారణకు గానూ పోషకాహార బియ్యాన్ని పాఠశాలలు, వసతిగృహాలు, ఐసీడీఎస్‌ల పరిధిలో పంపిణీ చేసేవారని... ఇటీవల దానిని నిలిపివేసినందున వెంటనే దానిని పునః ప్రారంభించాలని కేంద్ర మంత్రి ప్రహ్లద్ జోషికి సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ సింగ్, కేంద్ర ఆహారం, ప్రజా పంపిణీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

### కాళేశ్వరంపై ఎలాంటి ప్రభుత్వానికి దురుద్దేశ్యం లేదు

ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలం గాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

### కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

## యువత సాకులు చెప్పొద్దు

**హెల్మెట్ వాడకున్నా నా జుట్టు ఊడిపోయింది: డీజీపీ శివధర్ రెడ్డి**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఐదో రోజు ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌లోని నాగోల్ బాబు జగ్జీవన్ రామ్ డ్రైవింగ్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో రోడ్డు భద్రతపై అవగాహన అత్యంత కీలకమని, చిన్న చిన్న పొరపాట్ల వల్లే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు భద్రత కోసం ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ కేర్ అనే '4ఇ'ల సూత్రాన్ని పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన 'గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి .25 వేల రూపాయల నగదుతో కూడిన 'రహవీర్' అవార్డును ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ గజ్వేల్‌లోని మహతి ఆడిటోరి యంలో జరిగిన సదస్సు ల్లో



డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి పాల్గొని వాహనదారులకు దిశానిర్దేశం చేశారు. మనం ఆలోచించే లోపే ప్రమాదం జరిగిపోతుందని, ఆ సమయంలో రియాక్షన్ టైమ్ కూడా ఉండదని, అందుకే నిరంతర అప్రమత్తత అవసరమని డిజిపి స్పష్టం చేశారు. హైవేలపై ఎల్లప్పుడూ ఎడమ వైపు ట్రాక్ లోనే ప్రయాణించాలని, కేవలం ఓవర్‌టేక్ సమయంలో మాత్రమే కుడి వైపునకు వెళ్లి, వెంటనే తిరిగి ఎడమ వైపునకు వచ్చేయాలని సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీలో రాష్ట్ర జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్య మిశ్రా పాల్గొని ప్రసంగించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించగలమని, ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలు స్వచ్ఛందంగా రోడ్డు నిబంధనలు పాటిస్తామని తీర్మానాలు చేయడం శుభపరిణామన్నారు. బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా రోడ్డు భద్రత లక్ష్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోనూ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాలు మిన్నంటాయి. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య హెల్మెట్ ధరించే వాహనదారులకు ఉచితంగా ఐపీఎల్ మ్యాచ్ చూపిస్తామని వినూత్న ప్రకటన చేశారు. వికారాబాద్‌లో అదనపు డీజీపీ స్వాతి లక్రా, కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా రోడ్డు భద్రతతో పాటు యాంటీ డ్రగ్ అవేర్‌నెస్‌పై అవగాహన కల్పించారు. నల్లగొండ మిర్యాలగూడలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్ 'గోల్డెన్ అవర్' ప్రాముఖ్యతను వివరించారు. ఖమ్మంలో అడిషనల్ డీసీపీల ఆధ్వర్యంలో 15 స్టేషన్ల పరిధిలో డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెంలో ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కలెక్టర్ అంకిత్ గిరిజన యువతకు హెల్మెట్లు పంపిణీ చేశారు. వనపర్తిలో ఐజీపీ గజరావు భూపాల్, సిరిసిల్లలో ఐజీపీ రమేష్ నాయుడు డ్రైవర్లకు కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణను పర్యవేక్షించారు. రామగుండంలో యమధర్మ రాజు వేషధారణతో ప్రజలను ఆలోచింపజేయగా, ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ స్వయంగా సీపీఆర్ ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో పాల్గొన్నారు. మహబూబ్ నగర్, జగిత్యాల, సంగారెడ్డి, కామారెడ్డి, గద్వాల జిల్లాల్లోనూ కలెక్టర్లు, ఎస్పీల ఆధ్వర్యంలో వినూత్న ప్రచారాలు నిర్వహించి అరైవ్ అలైవ్ కార్యక్రమం ఐదో రోజున ప్రజల్లో రోడ్డు భద్రత అవగాహనను కల్పించారు.

# తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు బీజేపీకి ఇష్టం లేదా?

- ప్రతి సందర్భంలోనూ తెలంగాణ - ఏపీ విభజనపై విషపు వ్యాఖ్యలు
- తేజస్వి సూర్య వ్యాఖ్యలపై బిజెపి తన వైఖరి స్పష్టం చేయాలి
- తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం బిజెపికి ఏమాత్రం ఇష్టం లేదని, అందుకే అవకాశం దొరికిన ప్రతి సందర్భంలోనూ తెలంగాణ - ఏపీ విభజనపై బిజెపి విషం కక్కుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ - ఏపీ రాష్ట్రాల విభజనను భారత్ - పాకిస్తాన్ విభజనతో పోల్చుతూ బిజెపి ఎంపి తేజస్వి సూర్య వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం అని, ఈ వ్యాఖ్యలు పార్లమెంటు వ్యవస్థను కించపరచడమేనని చిన్నారెడ్డి అన్నారు. బిజెపికి ప్రజాస్వామ్యంపై కానీ, పార్లమెంట్ వ్యవస్థపై కానీ గౌరవం లేదని, అందుకే బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై నిస్సిగ్గుగా విషం కక్కుతూనే ఉన్నారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని మొదలు పెట్టిన తనకు.. ప్రస్తుతం బిజెపి అవలంబిస్తున్న ధోరణితో తన రక్తం మరుగుతోందని చిన్నారెడ్డి అన్నారు. స్వరాష్ట్రం తెలంగాణ కోసం ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, మేధావులు ఉద్యమించారని, ఈ ఉద్యమాలను గౌరవించి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ప్రజాస్వామికంగా పార్లమెంటు ఆమోదంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని చిన్నారెడ్డి వివరించారు. అంతకు ముందే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ తాను 41 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలను సేకరించి సోనియా గాంధీతో 2000 సంవత్సరంలోనే భేటీ అయ్యానని, ఆ తర్వాత తెలంగాణ మలిదశ ఉద్యమం ఊపందుకుందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర విభజనను కించపరుస్తూ మాట్లాడిన సందర్భంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులు, మిగతా ఆరుగురు బిజెపి ఎంపీలు చోద్యం చూస్తూ కూర్చున్నారు తప్ప వ్యతిరేకించలేదని చిన్నారెడ్డి విమర్శించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన తేజస్వి సూర్యకు తెలంగాణ అంశానికి సంబంధం ఏమిటీ అని, తెలంగాణ ప్రస్తావన అవసరం ఎందుకు అని చిన్నారెడ్డి ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా గతంలో తెలంగాణ విభజనకు వ్యతిరేకంగా మాట్లాడారని, తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని మోడీ చెప్పారని, బిజెపి ముమ్మాటికి తెలంగాణ వ్యతిరేకి అని మరోసారి రుజువైందని చిన్నారెడ్డి అన్నారు. బిజెపి ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ప్రజలకు వెంటనే బేషరతుగా పార్లమెంట్ లోనే క్షమాపణ చెప్పాలని, తెలంగాణ రాష్ట్రం పట్ల బిజెపికి ఉన్న వైఖరిని స్పష్టం చేయాలని చిన్నారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# బిచ్కుందలో ఏసీబీ మెరుపు దాడులు

## లంచం తీసుకుంటూ ఎక్సైజ్ సీఐ అరెస్ట్

- రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన సీఐ సత్యనారాయణ
- ఇంట్లో సోదాలు, నగదు స్వాధీనం



**బిచ్కుంద, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** బాన్సువాడ కామారెడ్డి జిల్లా బిచ్కుందలో అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు గట్టిగా పంజా విసిరారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలో ఎక్సైజ్ శాఖ సీఐ సత్యనారాయణపై ఏసీబీ బృందం మెరుపు దాడులు నిర్వహించడం స్థానికంగా కలకలం రేపింది. నమ్మదగిన సమాచారం ఆధారంగా రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు, సీఐ నివాసంగా ఉపయోగిస్తున్న అద్దె ఇంటిపై ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఉదయం నుంచే ఇంటి అంతటా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తూ, ఆదాయానికి మించిన ఆస్తులు, అవినీతి లావాదేవీలకు సంబంధించిన పత్రాలు, నగదు కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సీఐ సత్యనారాయణ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కినట్లు అధికారులు వెల్లడించారు. కళ్ళు దుకాణాలపై చర్యలు తీసుకోకుండా, కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుల నుంచి ఈ మొత్తం డిమాండ్ చేసినట్లు సమాచారం. దాడుల సమయంలో అదనంగా రూ.45,760 నగదు కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఇంట్లో ఉన్న పలు కీలక పత్రాలను అధికారులు జప్తు చేసి, మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో ఎక్సైజ్ శాఖలో తీవ్ర కలకలం రేగింది. జిల్లా వ్యాప్తంగా ఇతర అధికారుల్లోనూ గుబులు మొదలైంది. అవినీతి వ్యవహారాలపై ఏసీబీ కఠిన చర్యలు కొనసాగిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది. మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని సమాచారం.

# తేజస్వి సూర్య వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

- బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దశాబ్దాల ప్రజల చిరకాల ఆకాంక్ష ప్రత్యేక రాష్ట్ర సాధన అని దానికోసం ఎంతో మహోన్నత ఉద్యమాలు జరిగాయని, ఎంతోమంది జైలు పాలయ్యారని, అలాంటి తెలంగాణ ఏర్పాటుపై తేజస్వి సూర్య వ్యాఖ్యలు గర్హనీయమని, ఆయన వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీసీ కమిషన్ సభ్యులు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ఎంతోమంది యువకులు ప్రాణ త్యాగం చేశారని ప్రజాస్వామికా పద్ధతిలో ఉద్యమాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని దేశ విభజనతో పోల్చడమంటే అతని రాజకీయ అపరి పక్వతను తెలియజేస్తుందన్నారు. చరిత్రను పూర్తిగా తెలుసుకోకుండా పార్లమెంటు సభ్యుడిగా ఉన్నందుకు ఈరోజు భారతీయ జనతా పార్టీ నాయకులు సిగ్గుతో తల దించుకోవాలని, ఈ ప్రాంత ప్రజలు ఓట్లు వేస్తే పార్లమెంట్ సభ్యులుగా ఎన్నుకోబడి తోటి సభ్యుడు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తుంటే ఒక్కరు కూడా స్పందించకపోవడం బిజెపి నాయకుల దౌర్భాగ్యానికి పరాకాష్ట అని ఆయన అన్నారు. ఇప్పటికైనా కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి బండి సంజయ్ వెంటనే అతనికి తెలంగాణ చరిత్రను తెలియజేసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పించాలని లేదంటే భారతీయ జనతా పార్టీకి తెలంగాణలో పుట్టగతులు లేకుండా చేస్తామని ఉపేంద్ర హెచ్చరించారు రాష్ట్రంలో తెలంగాణ వ్యతిరేకులు అధికారంలోకి రావడం ద్వారానే ఇలాంటి చిల్లర మల్ల రాజకీయ నాయకులు స్టేట్మెంట్లు ఇస్తున్నారని రాబోయే కాలంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రజలు తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడే వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

# దీర్ఘకాలికంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

- న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలి
- తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ




**హైదరాబాద్ (జనంసాక్షి) :** దీర్ఘకాలికంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వొడ్నాల రాజశేఖర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్ల సాధనే తమ ప్రధాన ఎజెండా అని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పై వత్తిడి తీసుకువస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మధ్యాహ్నం టీజీఈ జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ లోని భాగస్వామ్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హైదరాబాద్ ఆర్డీఓ కె.రామకృష్ణ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలనే లక్ష్యంతోనే జేఏసీ ఆధ్వర్యంలో ఈ కార్యాచరణకు పూనుకున్నామన్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా మండల, డివిజన్ కేంద్రాలలో టీజీఈ జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రాలను సమర్పించాలని నిర్ణయించడం జరుగిందని తెలిపారు. గతంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన అనేక సమస్యలలో కొన్నింటిని ప్రభుత్వం పరిష్కరించినప్పటికీ, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వం ప్రధానంగా జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులతో పాటుగా పెండింగ్ డీఏలను కూడా విడుదల చేయాలన్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సాధారణ బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు లచ్చిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హన్మంతరావు, నిర్మల, దర్శన్ గౌడ్, కుమార్, ఉపేందర్ రావు, చంద్రశేఖర్ గౌడ్, హబీబ్ మియా, కృపాకర్ రెడ్డి, మొయినుద్దీన్, సీహెచ్ లక్ష్మయ్య, రాములు, రమేష్ పాక, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని శవం

- మూడు నెలలుగా పడివుండడంతో కుళ్లిన దేహం
- స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు

**హైదరాబాద్, ఏప్రిల్17 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత విషాదకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. మూడు నెలలుగా తాళం వేసి ఉన్న ఇంట్లో శవం దొరకడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జేకే కాలనీలోని ఓ ఇంట్లో గతంలో ఒక వ్యక్తి అద్దెకు ఉండేవారు. అయితే, గత మూడు నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అద్దెదారు కనిపించకపోవడం, కనీసం ఇంటి యజమానికి అద్దె కూడా చెల్లించకపోవడంతో యజమానికి అనుమానం వచ్చింది. ఇంటి యజమాని వచ్చి తాళం విరగ్గొట్టి లోపలికి వెళ్లి చూడగా, ఇల్లు మొత్తం దుర్వాసనతో నిండిపోయింది. లోపలికి వెళ్లి వెతకగా, వంటగదిలోని కిచెన్‌లో కింద గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. సమాచారం అందుకున్న వెంటనే నేరేడ్‌మెట్ పోలీసులు క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో, అది పురుషుడిదా లేక మహిళదా అనేది కూడా ప్రాథమికంగా గుర్తించలేనంత దారుణంగా ఉంది. శవం కిచెన్ బండ కింద ఉంచడాన్ని చూస్తే, ఇది ఓ పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్య అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా చంపి అక్కడ దాచిపెట్టారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఆ ఇంట్లో నివసించిన వ్యక్తి ఎవరు..?, అతను ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు? అనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.



# ప్రథమ వర్ధంతికి హాజరైన ఉప్పల

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గంజి రాజమౌళి గుప్త సతీమణి గంజి అమృత ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని వాసవి కళ్యాణ మండపం, వాసవి సేవా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై, ఆమెకు ఘన నివాళులు అర్పించారు. ఆమె చేసిన సేవలు, ఆమె వ్యక్తిత్వం గురించి స్మరించుకుంటూ అందరూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, దివంగత గంజి అమృత చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న కుమారుడు ఉప్పల సాయి కిరణ్ కోడలు శార్వారీ, చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు నిరసన గళం




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన 'భోజన విరామ నిరసన' కార్యక్రమం విజయవంతంగా జరిగింది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు మరియు గెజిటెడ్ అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వానికి తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ భారీ నిరసన నిరసన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అగ్ర నాయకత్వం పాల్గొని ఉద్యోగులకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ఎన్జీఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం హుస్సేనీ (ముజీబ్), కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి బి. శ్యామ్ హాజరై ప్రసంగించారు. వీరితో పాటు యూటీఎఫ్ అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు మల్లెపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఖాదర్ బిన్ హసన్ (ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర క్లాస్-ఐవీ ఉద్యోగుల సంఘం), కురాడి శ్రీనివాస్ (కార్యదర్శి, టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా), నర్సింగ్ (అధ్యక్షులు, తెలంగాణ ఉద్యోగుల సంఘం, హైదరాబాద్ జిల్లా), తిరుపతి రెడ్డి (పీఆర్టీయూ అధ్యక్షులు), జి.రాజారావు (టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు), పి. రామసుబ్బారావు (ఎస్టీయూ అధ్యక్షులు), వి. సత్యనారాయణ (క్లాస్-4ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు), శ్రీ ఎన్. నరేందర్ రావు (సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు), జి. రామకృష్ణారావు (డీఏవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు), నాయకులు శ్యామ్ సుందర్, వి.అశోక్, ఎం.వి. రమణ, సురేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, ప్రసాద్ ఆశన్న . డాక్టర్ విద్యాసాగర్ ఇంజులా రెడ్డి జ్యోతి గౌస్ మంచాల రవీందర్ రవికుమార్ సురేందర్ సరస్వతి తమ సంఘాల సభ్యులతో కలిసి భారీ స్థాయిలో పాల్గొన్నారు.

టీజీజేఏసీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విక్రమ్ కుమార్, కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఈ నిరసన ద్వారా ఉద్యోగుల ఐక్యత ఏమిటో ప్రభుత్వానికి అర్థమైందని, డిమాండ్లు నెరవేర్చని పక్షంలో రాష్ట్ర నాయకత్వం ఇచ్చే పిలుపు మేరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అలాగే భోజన విరామ సమయంలో, భీమ భవన్, తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం టీజీజేఏసీ హైదరాబాద్ సిటీ చైర్మన్,కట్కూరి శ్రీకాంత్ ,కన్వీనర్ గశీదూరి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మారం జగదీశ్వర్ (టీజీజేఏసీ చైర్మన్), ఎలూరి శ్రీనివాస్ రావు (టీజీజేఏసీ సెక్రటరీ జనరల్) ఎస్ఎం హుస్సేని (ముజీబ్)(డిప్యూటీ సెక్రటరీ జనరల్) ,బి శ్యామ్ స్థిత ప్రజ్ఞ హాజరయ్యారు.

# ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై స్పందించకుంటే దశలవారీ ఉద్యమం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉద్యోగుల, పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే దశల ఉద్యమాలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ మహమ్మద్ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాకముందు వారి మేనిఫెస్టోలో ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలను వెంటనే ఇస్తామని, నూతన పి ఆర్ సి ని ప్రభుత్వం ఏర్పడ్డ నెల రోజుల్లో ప్రకటిస్తామని హామీలు ఇచ్చి ఉద్యోగులను నమ్మించారని, కానీ ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఇప్పటికీ గత ప్రభుత్వాన్ని నిందించడం తప్ప ఉద్యోగులకు చేసింది ఏమీ లేదని, గత ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తేనే వారిని కాదని ఎన్నడూ లేని విధంగా ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్స్ కొరకు క్యూ లైన్ కట్టి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి వారి కుటుంబ సభ్యులందరితో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయిస్తే ప్రభుత్వం ఏర్పడ్డ విషయాన్ని మరిచిపోతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లా కేంద్రాల్లో, రెవెన్యూ డివిజన్లలో మండల తాసిల్దార్ కేంద్రాల్లో భారీ సంఖ్యలో ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు పెన్షనర్లు నల్ల రిబ్బన్లు ధరించి భోజన విరామ సమయంలో ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా మార్చి 2024 నుండి పదవీ విరమణ పొందిన బాధలు వర్ణనాతీతం. వారికి ఇవ్వవలసిన బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం వల్ల మనోవేదనకు గురై వ్యాధిగ్రస్తులై చనిపోయినప్పటి కూడా ప్రభుత్వంలో చలనం లేదు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రటరీ పోలాస రామచంద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పెరుక నాగమోహన్, రాష్ట్ర కార్యదర్శి జీవీ మనోహర్ కుమార్ గౌడ్, జిల్లా ప్రచురణ కార్యదర్శి ఏ శ్రీధర్ రావు, రవీందర్ రాజు సీనియర్ పెన్షనర్లు లచ్చిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, వేణుగోపాల్, మధుసూదన్ రెడ్డి, మొండయ్య పాల్గొన్నారు.




# కులగణనలో ముస్లింలకు అన్యాయం

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా
- ముస్లింల ఉపకులాల లెక్కల్లో గందరగోళం
- ఎండీ, అబ్దుల్ ముస్లింలకు న్యాయం ఎక్కడ?
- కుల గణనలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రాత్రి విడుదల చేసిన కుల గణన వివరాల్లో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆరోపించారు. బీసీ ముస్లింలలోని 14 వర్గాలకు చెందిన 64 ఉపకులాల జనాభా 35,76,588 (10.08%)గా చూపించగా, ఓసీ ముస్లింల జనాభాను 8,80,424 (2.48%)గా చూపించి, రాష్ట్రంలోని మొత్తం ముస్లిం జనాభా 44,57,012 మంది (12.56 శాతం) ప్రకటించడం సరైంది కాదని ఆయన అన్నారు. ఓసీ ముస్లింలలో సయ్యద్, ముషైక్, మొఘల్, పఠాన్, ఇరానీ తదితర మొత్తం 16 ఉపకులాలు ఉన్నప్పటికీ, ఉపకులాలవారీగా లెక్కింపు చేయకుండా మొత్తం 2.48%గా చూపించడం ముస్లిలను తప్పుదారి పట్టించే చర్య అని విమర్శించారు. అలాగే 2007లో బీసీ-ఈ కేటగిరీలో ముస్లింలకు విద్య, ఉపాధి రంగాల్లో 4% రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. అయితే ఆ జీవోలో "ఎండీ" ఇంటిపేరు లేకపోవడంతో, ఆ వర్గానికి గతంలో బీసీ-ఈ సర్టిఫికెట్లు జారీ చేయలేదని తెలిపారు. అనంతరం 2012లో అప్పటి బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ సయ్యద్ ఒమర్ జలీల్, "ఎండీ", "అబ్దుల్" ఇంటిపేర్లు కలిగిన ముస్లింలకు కూడా బీసీ-ఈ సర్టిఫికెట్లు పొందేందుకు అర్హులని స్పష్టం చేయడంతో, అప్పటి నుండి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వారికి కూడా సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయని చెప్పారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన కుల గణన జాబితాలో "ఎండీ", "అబ్దుల్" ముస్లింలను ఎక్కడా ప్రస్తావించకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. వారు ఏ వర్గంలోకి వస్తారో స్పష్టతలేదని దీని కారణంగా విద్యాశాఖ నిర్వహిస్తున్న కుల గణన నమోదు ప్రక్రియలో "ఎండీ", అబ్దుల్ ఇంటిపేరు గల ముస్లింలను ఓసీ వర్గంలో నమోదు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ముస్లిం కలగణన సర్వే ను పునపరిశీలన చేసి రాష్ట్రంలోని ముస్లిం లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తప్పులు తడకలుగా చేసిన కులగణన కారణంగా పేద ముస్లింలు పలు సంక్షేమ పథకాలకు దూరమయ్యే ప్రమాదముందని అన్నారు.

# అనాథ శవానికి టిప్పు సుల్తాన్ సేవా సంఘం అంత్యక్రియలు



**హిందూపురం (జనంసాక్షి) :** హిందూపురం పట్టణం లోని సేవా మందిరం ప్రశాంతి మందిరం వృద్ధాశ్రమశీలో కర్ణాటక టుంకూరు కు చెందిన సోమశేఖర అలగప్ప మృతి చెందారు. ప్రశాంతి మందిరం నన్స్ సేవకురాలు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ కు సంప్రదించగా ఉమర్ ఫారూఖ్ ఖాన్ లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో టిప్పు సుల్తాన్ మానవతా రక్త దాన సంఘం అధ్యక్షుడు షేక్ షబ్బీర్.నాగిరెడ్డి. మొండ్ చాందు ఫయాజ్ ప్రశాంతి మందిరం స్మశాన వాటికలో హిందూ సాంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఉమర్ ఫారూఖ్ ఖాన్ మాట్లాడుతూ టిప్పు సుల్తాన్ సామాజిక సేవా సంఘఒక వేయి కి పైగా కుల మతాలకు అతీతంగా అంత్యక్రియలు నిర్వహించామని, 25 వేల తలసీమియా ప్రసవాలు రక్తహీనత శస్త్ర చికిత్సలకు అత్యవసర సమయాల్లో దాతల ద్వారా రక్తదానం చేయించి అందించామని కుల మతాలకు అతీతంగా మానవత్వ శాంతి సందేశమే తమ ధ్యేయం అని అన్నారు టిప్పు సుల్తాన్ సామాజిక సేవా సంఘం సభ్యులకు విశ్రాశీత డీఎస్పీ ఓ. చంద్రశేఖర్ రెడ్డి ప్రశాంతి మందిరం నన్స్ ధన్యవాదాలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 ఏప్రిల్ 2026

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం
# పోరాట వారసత్వం నుండి సంక్షేమ సాధన వరకు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం కేవలం రాజకీయ పరిణామం కాదు; అది దశాబ్దాలపాటు సాగిన సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాల ఫలితం. ఈ పోరాటంలో వేలాది మంది ఉద్యమకారులు తమ జీవితాలను అర్పించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత వారి పాత్ర ముగిసిందా? లేక కొత్త దశలో వారి బాధ్యతలు, ఆశలు ఇంకా కొనసాగుతున్నాయా? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పే ఒక ప్రముఖ వేదికగా "తెలంగాణ ఉద్యమకారుల ఫోరం" (Telangana Udyamakarula Forum) నిలుస్తోంది.




**ఉద్యమకారుల ఫోరం అవసరం ఎందుకు వచ్చింది?**

తెలంగాణ సాధన తర్వాత ఉద్యమకారులలో ఒక ముఖ్యమైన భావన పెరిగింది–"పోరాటం చేశాం, కానీ ఫలితం అందరికీ చేరిందా?" ఉద్యమం లో పాల్గొన్న చాలా మంది సాధారణ కుటుంబాలకు చెందినవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత వారికి ఇచ్చిన హామీలు నీళ్ళు నిధులు నియామకాలు; పాలనలో భాగం పైసలో భాగం భూమి, గృహ సాయం, పెన్షన్, ఆరోగ్య సదుపాయాలు అమలు కాలేదనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఈ నేపథ్యంలో ఉద్యమకారుల హక్కులను రక్షించేందుకు, వారి సంక్షేమాన్ని సాధించేందుకు, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి డా.చీమ శ్రీనివాస్ గారి నేతృత్వంలో హైదరాబాద్ నడిబొడ్డున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విమోచన దినోత్సవం రోజు 9 సం.ల క్రితం ఈ ఫోరం ఒక సంఘటిత వేదికగా ఏర్పడింది.

**ఫోరం ప్రధాన లక్ష్యాలు:**

ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆర్థిక సహాయం, పెన్షన్లు, ఆరోగ్య పథకాలు వంటి అంశాలపై ఫోరం నిరంతరం డిమాండ్ చేస్తోంది. ఉద్యమకారులను అధికారికంగా గుర్తించేందుకు గుర్తింపు కార్డులు, వారి సేవలకు గౌరవం కల్పించడం వంటి అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఫోరం ఏర్పడ్డనాటి నుండి నిరంతరం ఎండనక వాననక రేయనక పగలనక నిరంతరం చేసిన కృషి ఫలితంగా 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమ మానిఫెస్టోలో ఉద్యమకారుల సంక్షేమ అంశాన్ని చేర్చింది అంతే కాకుండా ప్రతి ఉద్యమకారునికి 250గజాల ఇంటి స్థలం ఇస్తామని వారి 6 గ్యారెంటీలలో ఒకటిగా కూడా చేర్పించడంలో డా.చీమ శ్రీనివాస్ గారి నేతృత్వంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విజవంతమయ్యింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కాలయాపనలతో ఆ గ్యారెంటీల సాధన, ఉద్యమకారుల నిరంతర సంక్షేమం తెలంగాణ పునర్నిర్మాణం కూడా ఫోరం యొక్క ప్రధాన లక్ష్యాలుగా మారాయి.

కార్యక్రమాలు: వీధి నుండి సభల వరకు

ఫోరం కార్యకలాపాలు కేవలం సమావేశాలకే పరిమితం కావడం లేదు. అది ఒక చైతన్య ఉద్యమంగా మారింది:

**ప్రతిఘటనలు మరియు నిరసనలు:**

తెలంగాణ రాష్ట్ర 33జిల్లాలో భారీ ర్యాలీలు, దీక్షలు నిర్వహిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చింది. రాష్ట్రంలోని అన్ని మండలాలలో నిరసన కార్యక్రమాలు బైక్–ర్యాలీలు కూడా నిర్వహించారు.

**హంగర్ స్ట్రైక్స్:**

- రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రాలలో వాగ్దానాల అమలు కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టడం ద్వారా సమస్యను ప్రజల ముందుకు తీసుకువచ్చింది.

**ప్రెస్ మీట్లు మరియు అవగాహన కార్యక్రమాలు:**

- సోషల్ మీడియా ద్వారా సమస్యలను ప్రాచుర్యం చేస్తూ, ప్రజలలో చైతన్యం కలిగించడం ఫోరం ప్రధాన వ్యూహం.

**సామాజిక అంశాలపై స్పందన:**

- ప్రాంతీయ అభివృద్ధి, జిల్లాల నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలపై కూడా ఫోరం తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది.

**పాద యాత్రలు – బస్సు యాత్రలు:**

- ఉద్యమకారులకిచ్చిన హామీల అమలు కోసం మహబూబాబాద్, మేడ్చల్, వికారాబాద్, రంగారెడ్డి, ఖమ్మం, కరీంనగర్, సూర్యాపేట వరంగల్ వంటి జిల్లాల్లో పాదయాత్రలు చేసారు. కరీంనగర్లో చండీ యాగం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పదుల సంఖ్యలలో బస్సు యాత్రలతో పర్యటించి గ్రామగ్రామాన ఉన్న ఉద్యమకారులందరినీ సంఘటితం చేశారు.

**పోస్టు కార్డు ఉద్యమం:**

తెలంగాణ రాష్ట్ర గత ముఖ్యమంత్రి, మరియు ప్రస్తుత ముఖ్యమంత్రి గారికి అనేక సార్లు కొన్ని వేల సంఖ్యలో పోస్టు కార్డుల ద్వారా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వేడుకోవడం జరిగింది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష కార్యదర్శులకు అంతే కాకుండా రాష్ట్రంలోని అన్ని సంఘాల నాయకులకు ఇతర ముఖ్య నాయకులకు తమ ఉద్యమానికి మద్దతు పలకాలని వందల సార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది.

**ఉద్యమం తర్వాత నిరాశ – ఒక వాస్తవం**

ఫోరం ఉద్భవానికి ప్రధాన కారణం ఉద్యమకారులలో పెరిగిన నిరాశ. తెలంగాణ వస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది, అభివృద్ధి వేగంగా జరుగుతుంది అనే ఆశలు కొంతవరకు నెరవేరలేదనే భావన ఉంది.

ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు; ఇది భావోద్వేగ సమస్య కూడా. "మన పోరాటం విలువ ఏమిటి?" అనే ప్రశ్న ఉద్యమకారులను కలవరపెడుతోంది. రాష్ట్రం ఏర్పడి ఇన్నేండ్లు అయినా ఇంకా ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే ఉన్నదని ఉద్యమకారులు ఆవేదన చెందుతున్నారు. ఇంకా పోరాటం చేయవలసి ఉన్నదని మళ్ళీ ఒక్కటవుతున్నారు.

**రాజకీయ వ్యవస్థపై ఒత్తిడి**

- ఫోరం ప్రత్యేకత ఏమిటంటే–ఇది ఏకపక్ష రాజకీయ వేదిక కాదు. ఇది అన్ని పార్టీలను ప్రశ్నిస్తుంది.
- ప్రస్తుత ప్రభుత్వం అయినా, గత ప్రభుత్వం అయినా–హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంది.

ఇది ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్యమైన లక్షణం. ఉద్యమం తర్వాత కూడా ప్రజల పక్షాన నిలబడే వేదికలు ఉండటం ఆరోగ్యకరమైన రాజకీయాలకు సంకేతం.

**కుట్రలు, సవాళ్లు అయితే ఫోరంపై కూడా కుట్రలకు జరుగుతున్నాయి:**

- కొందరు దీనిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు.
- అభివృద్ధి చెందిన కులాలకు చెందిన కొందరు మాత్రం స్వార్థంతో తెలంగాణ ఉద్యమకారుల ఫోరంపై కుట్రలు చేస్తున్నారు.
- ఫోరం యొక్క నిస్వార్థ నిరంతర కృషి ఫలితాన రాష్ట్రంలోని గ్రామగ్రామాన ఉన్న ఉద్యమకారులు అందరూ ఏక తాటిపైకి వస్తున్న తరుణంలో కొన్ని రాజకీయ పార్టీలు ఫోరంను విచ్చిన్నం చేసే కుట్రలు చేస్తున్నాయి. ఫోరంలోని కొంతమందిని మభ్యపెట్టి వేరు సంఘాలు పెట్టిస్తున్నాయి.
- ఉద్యమకారుల ఇంటిగ్రిటీని, సౌభ్రాతృత్వానికి భంగం కలిగిస్తున్నాయి.
- ఉద్యమకారులంతా ఐకమత్యంతో ఈ సవాళ్లను అధిగమించి వారి కుట్రలను తిప్పికొట్టకపోతే రాష్ట్రానికి, ఉద్యమకారులకు తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉంది.

**తెలంగాణ ఉద్యమకారుల భవిష్యత్ ఎలా ఉండబోతోంది:**

ఈ సంధర్భంలో ఉద్యమకారుల తక్షణ కర్తవ్యం ఏంటి? ప్రతిఘటననా? లేక నిర్మాణాత్మక భాగస్వామ్యమా? అంటే రెండూ అనే చెప్పాలి. దేన్ని ప్రతిఘటించాలి అంటే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయని ఉద్యమ లక్ష్యాలకు విరుద్ధంగా పని చేసే ప్రభుత్వం పైన ప్రతిఘటించాలి. ఉద్యమకారుల ఫోరం యొక్క ఇంటెగ్రిటీని దెబ్బ తీసే ప్రతి నాయకుణ్ణి సంఘాన్ని ప్రతిఘటించాలి. ఇంకా అచేతననంలో ఉన్న ఉద్యమకారులను చైతన్యం చేస్తూ ఫోరంలో భాగస్వామ్యం చేయాలి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ లక్ష్యాలను సాధించడం కోసం తెలంగాణ పునర్నిర్మాణం కోసం కృషిని కొనసాగించాలి.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఒక సాధారణ సంఘం కాదు; అది ఒక చరిత్ర యొక్క కొనసాగింపు. తెలంగాణ కోసం పోరాడినవారు తమ హక్కుల కోసం మళ్లీ పోరాడుతున్న వాస్తవాన్ని ఇది ప్రతిబింబిస్తుంది.

రాష్ట్రం ఏర్పడటం ఒక ముగింపు కాదు–అది ఒక కొత్త ప్రారంభం. ఆ ప్రారంభంలో ఉద్యమకారుల స్థానాన్ని గుర్తించడం, వారి సంక్షేమాన్ని నిర్ధారించడం, వారి గౌరవాన్ని కాపాడడం ప్రభుత్వాల బాధ్యత.

ఈ బాధ్యతను గుర్తు చేసే ఒక శక్తిగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కొనసాగుతోంది.



**రాంబాబు మోకాటి,**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం
రాష్ట్ర కో–ఆర్డినేటర్.
ఫోన్:7799080866

# హోర్ముజ్ ఒక చెక్ పాయింట్ కానుందా?

## పెట్రోడాలర్ పతనానికి నాంది పలకనుందా!?

"ప్రపంచ యుద్ధాలు ఎప్పుడూ మిస్సైళ్లతో కాదు, మాటలతోనే మొదలవుతాయి." ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, చైనా, రష్యా, ఇరాన్ ల మధ్య జరుగుతున్న డిప్లొమసీ మాటల వార్ ని మనం చూస్తున్నాం. కానీ ఈ మాటల వెనక ఆర్థిక, సైనిక, భౌగోళిక ప్రయోజనాల పోరు ఉంది.



**1. "స్ట్రాంగ్ వార్నింగ్" నిజమైన సైనిక కదలికగా మారిన దృశ్యం:**

అమెరికా ఈ ప్రాంతంలో తన నావికా బలగాలను పెంచుతుండగా, చైనా మౌనంగా ఉండలేదు. ఫిబ్రవరి 2026 లోనే, రష్యా–చైనా–ఇరాన్ దేశాలు హోర్ముజ్ సమీపంలో "మారిటైమ్ సెక్యూరిటీ బెల్ట్ 2026" అనే ఉమ్మడి నావికా వ్యాయామాలు నిర్వహించాయి ఈ సందర్భంలో చైనా కేవలం హెచ్చరికలతో ఆగలేదు. అమెరికాకు ప్రత్యామ్నాయంగా ఇరాన్ తో కలిసి సైనిక సహకారం పెంచుతోంది. ఇది "మేము కూడా ఇక్కడ ఉన్నాము" అని చెప్పడం లాంటిది.

**2. "చైనా ఇరాన్ కు ఆయుధాలు సప్లై చేస్తుందా?" :**

ఇది కేవలం పుకారు కాదు. ఇంటెలిజెన్స్ నివేదిక. చైనా ఇరాన్ కు ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ సరఫరా చేస్తోందని సూచిస్తుంది. ఇది కేవలం ఊహాగానం కాదు. జబీబీ వార్తా సంస్థ నివేదించిన ఖూ ఇంటెలిజెన్స్ ప్రకారం, చైనా ఇరాన్ భుజంపై నుండి కాల్చే క్షిపణులను (హీూచీూాణూ) సరఫరా చేసే అవకాశం ఉంది. అయితే, చైనా దీనిని ఖండించింది, కానీ అటువంటి నివేదికలు ఉండటమే అమెరికాలో ఆందోళనను పెంచింది. ఇది నిజమైతే, ఇది డైరెక్ట్ కాన్ఫ్రంటేషన్ కాకపోయినా, "ప్రాక్సీ వార్" కి దారి తీస్తుంది. అమెరికా ఇరాన్ తో నేరుగా తలపడుతుండగా, చైనా తన ప్రత్యర్థిని బలహీనపరిచే వ్యూహంలో భాగంగా ఆయుధాల సరఫరా చేస్తోంది.

**3. "20 శాతం ఆయిల్" - ఆర్థిక గణాంకాలు ఏం చెబుతున్నాయి?:**

ప్రపంచ క్రూడ్ ఆయిల్లో దాదాపు 20 శాతం హోర్ముజ్ గుండా వెళ్తుంది. ఇది ఖచ్చితమైన లెక్కే. అయితే, ఇక్కడ కీలకమైన మరో అంశం ఏమిటంటే, ఈ మార్గం ద్వారా ప్రపంచంలోని మొత్తం ఎరువులలో దాదాపు మూడింట ఒక వంతు (33 శాతం) కూడా రవాణా అవుతుంది. ఈ గొడవ వల్ల పెట్రోల్ ధరలు మాత్రమే కాదు, ఆహార ధరలు కూడా ఆకాశాన్నంటే అవకాశం ఉంది. యుద్ధం వల్ల ప్రపంచంలోని ప్రతి రైతు ఎదుర్కొనే ఖర్చు పెరుగుతుంది. ఇప్పటికే ఈ యుద్ధం వల్ల మార్చి 2026 నాటికి క్రూడ్ ఆయిల్ ధర ఏ100 దాటి, అమెరికాలో పెట్రోల్ ధరలు గ్యాలన్ కు ఏ4.12 దాటాయి.

**4. "డాలర్ ఆధిపత్యం" :**

ఇది ఆయిల్ కోసం యుద్ధం కాదు, ప్రపంచ ఆధిపత్యం కోసం. ఇక్కడ డాలర్లకు ప్రత్యామ్నాయం ఉద్యమం మొదలైంది. డాయిచ్ బ్యాంక్ నివేదిక ప్రకారం, ఇరాన్ హోర్ముజ్ గుండా వెళ్లే ట్యాంకర్లకు యువాన్లో (చైనా కరెన్సీ) లో చెల్లింపులు తీసుకుంటూ, డాలర్ ను బైపాస్ చేస్తోంది. అంటె అమెరికా డాలర్ ను ఆయుధంగా ఉపయోగించుకుంటూ ఆంక్షలు విధిస్తే, చైనా, రష్యా, ఇరాన్ కలిసి "బ్రిక్స్ కరెన్సీ" లేదా యువాన్ లావాదేవీల వైపు కదులుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక ఆధిపత్యానికి పెద్ద దెబ్బ.

**5. నేటి వాస్తవ పరిస్థితి ఏమిటి?**

ప్రస్తుత వార్తల ప్రకారం, మొదటి రెండు ఆప్షన్లు (సైలెంట్ వార్ ఛ ప్రాక్సీ వార్) ఇప్పటికే జరుగుతున్నాయి. ఈ సైలెంట్ వార్: అమెరికా నౌకాదళం దిగ్బంధం (Blockade) చేస్తుండగా, చైనా–రష్యాలు తమ నౌకలను పంపి ప్రతిఘటిస్తున్నాయి . ప్రాక్సీ వార్: అమెరికా ఇజ్రాయెల్కు మద్దతు ఇస్తుండగా, ఇరాన్ యెమెన్ లోని హౌతీల ద్వారా బాబ్ ఎల్–మండేబ్ జలసంధిలో ఒత్తిడి పెంచే అవకాశం ఉంది .డైరెక్ట్ వార్: ప్రస్తుతానికి ఇది జరగలేదు, కానీ ఒక చిన్న ప్రమాదం కూడా పరిస్థితిని మార్చేస్తుంది.

**సమగ్ర విశ్లేషణ: ఇది ప్రపంచాన్ని ఎలా మారుస్తుంది?**

ఈ సంక్షోభం మనల్ని నిలువునా మార్చివేస్తోంది. ఇప్పటివరకు మనం చూసిన "అమెరికా సింగిల్ సూపర్ పవర్" సిద్ధాంతం క్షీణిస్తోంది. మార్చి 2026 లోనే ఖూ ఇంటెలిజెన్స్ తన నివేదికలో చైనాను "ప్రధాన భౌగోళిక ప్రత్యర్థిగా", రష్యాను "ప్రధాన సైనిక ముప్పుగా" పేర్కొంది . ఇప్పుడు ఈ ముగ్గురూ (చైనా, రష్యా, ఇరాన్) కలిసి అమెరికాకు వ్యతిరేకంగా ఒక అనధికారిక "యాక్సిస్" ఏర్పరుస్తున్నాయి.

**భారత్పై ఈ యుద్ధ ప్రభావం ఎంత మేరకు ఉండే అవకాశం ఉంది?**

భారత్ కూడా తన చమురు అవసరాలకు ఈ ప్రాంతంపై ఆధారపడి ఉంది. డాలర్ క్షీణించి, యువాన్ పెరిగితే, భారత్ తన వాణిజ్యం కోసం కొత్త మార్గాలు వెతుక్కోవాల్సి వస్తుంది. ఆర్థికంగా, ఇది భారత్ కు ఒక సవాల్, ఎందుకంటే చైనా ప్రభావం పెరగడం భారత జియో–పొలిటికల్ లెక్కలను మారుస్తుంది. హోర్ముజ్ ఇప్పుడు ప్రపంచ రాజకీయాల కేంద్ర బిందువు. ఇక్కడ నిలిచేది అమెరికా పాత "బాస్" స్థానమా, లేక కొత్త "బహుళధ్రువ" ప్రపంచ ప్రారంభమా అనే దానిపై ఆధారపడి ఉంది. నిజమైన యుద్ధం ప్రస్తుతానికి జరగకపోవచ్చు, కానీ డాలర్ పతనం, చైనా ఆధిపత్యం, సముద్ర మార్గాల నియంత్రణ కోసం "సైలెంట్ వార్" మాత్రం జోరుగా సాగుతోంది. ఇది చరిత్రలో ఒక కొత్త అధ్యాయం – "ది ఎండ్ ఆఫ్ ది యునిపోలార్ వరల్డ్."



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



**వినుకో**

ఓటుకు నోటును సీటును
పోటీపడెవారునాటి పూతనకొడుకుల్
కూటికి గుడ్డకు నీడకు
ఘాటుగ పోరాడె వారుకర్తవ్యఘనుల్

**రేడియమ్, 9291527757**

# సుమాంజలి పరిమళం
## హృదయ స్పర్శి కవిత్వం



అనుభవాల పరిమళాలు
వెదజల్లే తొలి ప్రయాణం
"పుస్తకాలతో
సేదదీరుతున్న కాలంలో
నేనిపుడు జీవిస్తున్నాను.."

- రత్నాకర్ రావు

"మానవుడు సృష్టించిన అద్భుతాల్లో అగ్రగణ్యమైనది ఏదైనా ఉందంటే అది పుస్తకం." ఈ మాటలు నిజమని మనస్సుకు తాకినప్పుడు, సోమవారం రాత్రి ఒక కొత్త పుస్తకం చేతుల్లోకి వచ్చినప్పుడు ఆప్యాయత ఎంతగా పొంగిపొంగి వస్తుందో అనుభవించినవారు మాత్రమే అర్థం చేసుకోగలరు. ఒక మంచి పుస్తకం మంచి మిత్రుడితో సమానం. అయితే, అవ్యాజమైన కవితానుబంధం తోడైనప్పుడు ఆ మిత్రత్వం మరింత లోతుగా, హృదయాన్ని తాకేలా మారుతుంది.

"సుమాంజలి పరిమళం" – ప్రతికంఠం మహేందర్ రాజు గారు రచించిన కవితా సంపుటి. ఈ సంపుటిలో 70 కవితలు ఉన్నాయి. అన్నీ శుద్ధ వచన కవితలు. ఎక్కడా కామా, పూర్తి స్టాప్ లేకుండా, భావ ప్రవాహం లాగా సాగిపోతాయి. ప్రేమ, బాధ, వైరాగ్యం, జ్ఞాపకాలు, త్యాతికత, ప్రశ్నలు – ఒక్క సంపుటిలోనే జీవితం యొక్క అనేక పార్శ్వాలు సృజించబడ్డాయి. కవి చాలా మంది కవుల్లా సాంప్రదాయిక వస్తువులను ఎంచుకోలేదు. విభిన్నమైన అనుభవాలను, సున్నితమైన భావాలను తన అక్షరాలతో "నా అక్షరాలతో.. సుమాంజలి" అని అందించారు.

కవిత్వం ఏమి చేస్తుంది? మనుషులను కదిలిస్తుంది. ఊహల రెక్కలు విచ్చుకుని విహరించే విహంగంలా, తన్మయత్వంలో వశం చేసుకునే గాంధర్వమైనది. ఈ సంపుటిలోని కవితలు అలాగే చేస్తాయి. అవి ఊహించి రాసినవి కావు – అనుభవాల గుచ్చం. అందుకే మనస్సును హత్తుకుంటాయి. కొన్ని సున్నితత్వాన్ని చూపిస్తే, మరికొన్ని పరిణితిని, జీవిత పరిపక్వతను ప్రతిబింబిస్తాయి. స్పష్టత, సూటిదనం, భావ గాఢత – ఈ మూడూ ప్రతి కవితలోనూ కనిపిస్తాయి. పద సౌలభ్యం కూడా చదువరులను సులభంగా ఆకట్టుకుంటుంది.

ఇది సాహిత్య ప్రియులకు చేరువ కావాలనుకునే ఔత్సాహిక కవి తొలి ప్రయాణం. అయినప్పటికీ, ఈ తొలి అడుగు చాలా దృఢంగా, భావపూర్వకంగా ఉంది. కవితలు చదువుతున్నప్పుడు మనం ఒక్కసారి మన స్వంత ఊరి, తల్లి, తండ్రి, బాల్యం, బడి జ్ఞాపకాలలోకి ప్రయాణించాల్సి వస్తుంది. ఆ ప్రయాణంలో కవి మనతోపాటు నడుస్తాడు.

కవితల్లోని హృదయస్పర్శి క్షణాలు

"మా ఊరు" (పుట 100)

'మా ఊరి పేరు వింటేనే మాతృమూర్తి రూపమే మనసు నిండి పోతుంది వయస్సు తగ్గిపోతుంది'

ఊరి పట్ల ఉన్న అపారమైన ప్రేమ, ఆ ఊరు పేరు వినగానే హృదయం నిండిపోయి బాల్యం తిరిగి వచ్చినట్లు అనిపించడం – ఇది కేవలం కవిత కాదు, ఒక భావన. ప్రతి ఒక్కరి ఊరి పట్ల ఉండే ఆ అనుబంధాన్ని ఈ పంక్తులు స్పష్టంగా చిత్రీకరిస్తాయి.

తర్వాత తల్లిని గుర్తు చేసుకున్నప్పుడు "అమ్మ" (పుట 97)

'కష్టాల కొలిమిలో కాలుతున్నా



వెన్నెల చల్లదనాన్ని అందిస్తూ కరుణ కురిపిస్తూ సంతోష గీతాలు వినిపించేదే కదా అమ్మ'

తల్లి ప్రేమ ఎంత గొప్పదో, ఆమె కష్టాల మధ్య కూడా పిల్లలకు చల్లదనం అందించే త్యాగం ఎంత లోతైనదో ఈ కవిత హృదయాన్ని తాకుతుంది.

ఆ వెంటనే తండ్రి జ్ఞాపకం వస్తుంది. "నాన్న" (పుట 20)

'నాన్నతో నా రోజులు మినుకుమనే చుక్కలాయె ఏడేళ్లకే నాన్న నన్ను ఏడిపించి దూరమాయె'

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన బాధ, ఆ దుఃఖం ఎంత లోతుగా ఉంటుందో ఈ పంక్తులు చెబుతాయి. తండ్రి మరణం తర్వాత బాల్యపు చేష్టలు, ఆనందాలు తిరిగి రావని ప్రశ్నించే "బంగారు బాల్యం" (పుట 39) కవిత కూడా హృదయవిదారకం.

"మా బడి" (పుట 73)

'పాఠశాల జ్ఞాపకాలు ప్రాణానికి ప్రాణము మరి ప్రాథమిక తరగతులే ప్రాణవాయువు అందరికి'

ప్రాథమిక విద్య భవిష్యత్తుకు సోపానమని, బడి జ్ఞాపకాలు ఎంత ముఖ్యమో ఈ కవిత గుర్తు చేస్తుంది.

ఇలాంటి అనేక కవితలు ఈ సంపుటిలో వెదజల్లుతాయి. ప్రేమ, వియోగం, జ్ఞాపకాలు, జీవిత ప్రశ్నలు – అన్నీ సరళమైన పదాల్లో, గాఢమైన భావంతో వ్యక్తమవుతాయి. కవి తన అనుభవాలను ఎంతో సహజంగా, హృదయపూర్వకంగా అందించారు.

"సుమాంజలి పరిమళం" ఒక తొలి సంపుటి అయినప్పటికీ, దాని భావ స్పష్టత, అనుభవ లోతు, పద సౌలభ్యం చాలా మంది అనుభవజ్ఞుల కవితలకు సమానంగా నిలుస్తుంది. ఇది కేవలం కవితల సంకలనం కాదు – ఒక జీవిత ప్రయాణం. ప్రేమికులు, బాధితులు, జ్ఞాపకాలలో జీవించేవారు, ప్రశ్నలు లేవనెత్తేవారు – అందరికీ ఈ సంపుటి ఒక మంచి సహచరుడిగా మారుతుంది.

పాలడుగు రత్నాకర్ రావు గారు రాసిన సమీక్షలోని ఆప్యాయత, హృదయస్పర్శి నిజంగా మెచ్చుకోవాల్సిందే. ఆయన సమీక్ష ద్వారా కవితల సారాంశం మరింత స్పష్టంగా మన ముందుకు వస్తుంది. "సుమాంజలి పరిమళం" ఒక చిన్న సంపుటి కావచ్చు, కానీ దాని భావ పరిమళం చాలా విస్తృతం. ఇది కవి హృదయం నుంచి వచ్చిన అక్షరాల సుమాంజలి. సాహిత్య ప్రియులందరూ ఒకసారి చదవాల్సిన, ఆస్వాదించాల్సిన మంచి రచన. కవిత్వం ద్వారా జీవితాన్ని మరింత అందంగా చూడాలనుకునేవారికి ఇది ఒక మంచి మార్గం.

ప్రతికంఠం మహేందర్ రాజు గారికి ఈ తొలి ప్రయాణం మరింత దూరం వరకు సాగాలని, మరిన్ని అనుభవాలు, భావాలు అక్షరాల్లోకి వచ్చి పాఠకుల హృదయాలను తాకాలని ఆశిస్తున్నాం. "నా అక్షరాలతో.. సుమాంజలి" – ఈ మాటలు ఇక్కడే ఆగకుండా, మరిన్ని సంపుటుల్లో కొనసాగాలి.

# భారత ప్రజాస్వామ్యంలో నారీ శక్తి వందనం

భారతదేశం స్వాతంత్ర్యం పొంది 79 ఏళ్లు గడిచినా, రాజకీయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం ఇప్పటికీ అసమానంగానే ఉంది. జనాభాలో దాదాపు 48–49% మహిళలు ఉన్నప్పటికీ, 18వ లోక్‌సభలో (2024) మహిళల సంఖ్య కేవలం 74 (సుమారు 13.6–14%) మాత్రమే. ఇది దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యవస్థాత్మక అసమానతకు స్పష్టమైన సాక్ష్యం. ఈ అసమానతను సవరించే దిశగా 106వ రాజ్యాంగ సవరణ (నారీ శక్తి వందన అధినియమ్, 2023) ఒక మైలురాయి. ఇప్పుడు 2026 ఏప్రిల్‌లో ఈ చట్టం అమలులోకి వచ్చిన నేపథ్యంలో, మూడు కీలక బిల్లులు (131వ సవరణ, డీలిమిటేషన్ బిల్లు, యూటీల బిల్లు) ద్వారా 2029 ఎన్నికల నుంచి 33% రిజర్వేషన్ అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. లోక్‌సభ సీట్లు 850కి పెంచడం ద్వారా మహిళల సంఖ్య సుమారు 280 వరకు చేరుకునే అవకాశం ఏర్పడింది.



**చరిత్రలో మహిళల ప్రాతినిధ్యం – నెమ్మది ప్రయాణం**

1952లో తొలి లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ప్రాతినిధ్యం 4.4% (22 మంది) మాత్రమే. ఆ తర్వాతి దశాబ్దాల్లో కూడా ఈ శాతం గణనీయంగా పెరగలేదు. 1962లో 5.6%, 1977లో 3.5%కి కూడా పడిపోయింది. 1984లో 8%, 2009లో 10.9% మార్కు దాటింది. 2019లో 14.3% (78 మంది) వరకు చేరుకున్నా, 2024లో 74 మందికి (13.6%) పడిపోయింది. ఇది భారత రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న అడ్డంకులను – సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక – స్పష్టం చేస్తుంది.

1992లో 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా పంచాయతీ రాజ్ సంస్థలు, పట్టణ స్థానిక సంస్థల్లో 33% రిజర్వేషన్ అమలు చేయడం ఒక చిన్న విప్లవం. అనేక రాష్ట్రాలు దీనిని 50% వరకు పెంచాయి. ఫలితంగా లక్షలాది మహిళలు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో నాయకత్వం చేపట్టారు. అధ్యయనాలు చెబుతున్నట్లు, మహిళా ప్రతినిధులు ఆరోగ్యం, విద్య, శిశు పోషణ, నీటి వనరులు, పోషణ, స్వచ్ఛత వంటి అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టారు. గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసం పెరిగింది, నిర్ణయ ప్రక్రియల్లో వారి స్వరం బలపడింది. ఇది ఒక ముఖ్యమైన పాఠం – అవకాశం ఇస్తే మహిళలు సమర్థవంతమైన నాయకత్వం చూపగలరు.

**106వ సవరణ – చారిత్రక అడుగు**

1996 నుంచి 27 ఏళ్ల పాటు మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబడినా, రాజకీయ విభేదాలు, సామాజిక వర్గాల మధ్య వివాదాలు, పార్టీల అంతర్గత భేదాల వల్ల ఆమోదం కాలేదు. 2023 సెప్టెంబర్‌లో 106వ సవరణ ఆమోదం పొంది, సెప్టెంబర్ 28న రాష్ట్రపతి ఆమోదం పొందింది. ఇది లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33% సీట్లు మహిళలకు కేటాయించడంతో పాటు, SC/ST రిజర్వేషన్ సీట్లలో కూడా 33% మహిళలకు హామీ ఇస్తుంది. రొటేషన్ విధానంలో అమలు కావడం వల్ల ప్రతి ఎన్నికలో వేర్వేరు నియోజకవర్గాలు రిజర్వ్ అవుతాయి. ఈ రిజర్వేషన్ కనీసం 15 ఏళ్లు కొనసాగుతుంది.

అయితే ఈ సవరణ అమలు జనగణన మరియు డీలిమిటేషన్ తర్వాతనే జరుగుతుందని షరతు విధించబడింది. 2026 ఏప్రిల్ 16న ఈ చట్టం అధికారికంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం పార్లమెంట్‌లో మూడు బిల్లులు చర్చలో ఉన్నాయి – లోక్‌సభ సీట్లను 850కి పెంచడం, డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, యూటీలకు విస్తరణ. ఇది 2029 ఎన్నికల నుంచి అమలు సాధ్యం చేస్తుంది.

**డీలిమిటేషన్‌తో కలిపిన మార్పు – అవకాశాలు, సవాళ్లు**

2002లో చివరి డీలిమిటేషన్ జరిగి 2008 నుంచి అమలులో ఉంది. 1976 నుంచి 2026 వరకు డీలిమిటేషన్ నిలిపివేయబడిన నేపథ్యంలో జనాభా నిర్మాణంలో భారీ మార్పులు వచ్చాయి. కొత్త డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ సీట్లు 750 నుంచి 850 వరకు పెరగవచ్చని అంచనాలు. 850 సీట్లలో 33% రిజర్వేషన్ అమలైతే మహిళల సంఖ్య సుమారు 280కి చేరుకుంటుంది – ప్రస్తుత 74తో పోలిస్తే దాదాపు 4 రెట్లు పెరుగుదల.

ఇది కేవలం సంఖ్యాపరమైన మార్పు కాదు. నిర్ణయాల్లో మహిళల స్వరం బలపడుతుంది. స్థానిక సంస్థల అనుభవం చూస్తే, మహిళా నాయకత్వం గ్రామీణ అభివృద్ధి, మహిళల భద్రత, పోషణ, విద్యా సేవల్లో సానుకూల ఫలితాలు ఇచ్చింది. ఇదే ధోరణి జాతీయ స్థాయికి విస్తరిస్తే భారత అభివృద్ధి మరింత సమగ్రంగా, సమానత్వపూర్వకంగా మారుతుంది.

సవాళ్లు – వాస్తవాలు ఎదుర్కోవాలి

**ఈ సంస్కరణకు సవాళ్లు తక్కువ కావు.**

డీలిమిటేషన్‌తో లింక్: ఉత్తర –దక్షిణ రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీపై వివాదాలు రావచ్చు. జనాభా ఎక్కువగా పెరిగిన రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు దక్కితే ఫెడరల్ సమతౌల్యం దెబ్బతినే అవకాశం ఉంది.

రొటేషన్ విధానం: ప్రతి ఎన్నికలో నియోజకవర్గాలు మారడం వల్ల నాయకత్వ స్థిరత్వం తగ్గవచ్చు. అభివృద్ధి పనుల నిరంతరతపై ప్రభావం పడవచ్చు.

**కుటుంబ రాజకీయాలు:** అభ్యర్థుల ఎంపిక పార్టీల చేతుల్లో ఉండటం వల్ల కుటుంబాలకు చెందిన మహిళలకు ఎక్కువ అవకాశాలు దక్కే ప్రమాదం ఉంది. విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు, వృత్తిపరంగా ఎదిగిన మహిళలు రాజకీయాల్లోకి రావాలంటే పార్టీల అంతర్గత ప్రజాస్వామ్యం, పారదర్శకత అవసరం.

OBC మహిళలకు కోటా లోటు: SC/ST మహిళలకు రిజర్వేషన్ ఉన్నా, ఇతర వెనుకబడిన వర్గాల మహిళలకు ప్రత్యేక కోటా లేదు. ఇది ద్వంద్వ అణచివేతను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

**సమానత్వం వైపు ఒక దృఢమైన అడుగు**

మహిళలకు 33% రిజర్వేషన్ కేవలం ఒక చట్టపరమైన మార్పు కాదు – ఇది భారత ప్రజాస్వామ్యాన్ని మరింత సమగ్రంగా, సమానత్వపూర్వకంగా, సమాజ సమ్మతితో నింపే సామాజిక–రాజకీయ సంస్కరణ. 4.4% నుంచి 14% వరకు వచ్చిన నెమ్మది ప్రయాణం ఇక వేగవంతం కావాలి. 2029 ఎన్నికలు ఈ సంస్కరణ యొక్క నిజమైన పరీక్షగా నిలుస్తాయి.

రాజకీయ పార్టీలు, సమాజం, ప్రభుత్వం --- అందరి సంకల్పం ఉంటే ఈ మార్పు భారతదేశాన్ని ప్రపంచానికి ఒక ఆదర్శంగా నిలబెట్టగలదు. నారీ శక్తి బలపడితేనే రాష్ట్ర శక్తి బలపడుతుంది. సమానత్వం కోసం సాగిన ఈ దీర్ఘ పోరాట గాథలో తదుపరి అధ్యాయం విజయవంతంగా ముగియాలి. మహిళల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా భారత ప్రజాస్వామ్యం మరింత బలమైనది, సమగ్రమైనది, సమానత్వపూర్వకమైనది అవుతుంది. ఈ చారిత్రక అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సమాన భారతాన్ని నిర్మించాల్సిన బాధ్యత మన అందరిది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## తప్పుడు ఆరోపణలు చేసి బ్లాక్ మెయిల్ చేస్తే ఊరుకునేది లేదు



**తాండూరు, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** సర్వేనెంబర్ 130 భూమి ప్రభుత్వానదని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని తాండూర్ చెందిన అబ్దుల్ ఆహాద్ పేర్కొన్నారు. ఈ భూమి తనదే అని అన్ని ఆధారాలు సర్వే రిపోర్టు సంబంధించిన పత్రాలను ఆయన చూపించారు. శుక్రవారం ఆయన నిర్మాణంలో ఉన్న స్థలం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు కొన్ని రోజులగా ఈ విషయమై లేనిపోని ఆరోపణలు చేస్తూ తనను బద్నాం చేస్తున్నారని సూచించారు. ఈ భూమి ప్రభుత్వానిదని వారు ఆధారాలు చూపిస్తే దేనికైనా సిద్ధమని తెలిపారు. వారి వద్ద ఏమైనా ఆధారాలుంటే ప్రభుత్వానికి , మున్సిపాలిటీకి సమర్పించాలని అన్నారు. తప్పుడు ఆరోపణలు, చేసి బ్లాక్ మెయిల్ చేస్తే ఊరుకునేది లేదని, ఈ విషయమై కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని అన్నారు. 1983 నుండి తన వద్ద అన్ని ఆధారాలు, పేపర్లు ఉన్నాయని తెలిపారు. అధికారికంగా రెవెన్యూ, సర్వేయర్ సంయుక్తంగా సర్వే చేసి వచ్చిన మ్యాప్ ప్రకారం తాను నిర్మాణాలు చేస్తున్నానని అన్నారు. మున్సిపాలిటీలో ఈ స్థలానికి సంబంధించి పన్నులు సైతం చెల్లించానని చెప్పారు. పట్టణ ప్రజలు నాయకులు సహకారం అందిస్తే బ్లాక్మెయిల్ చేసే వారిని పట్టణం నుంచి తరిమేస్తామని హెచ్చరించారు. అవసరమైతే తాండూర్లో ఉన్న అందరిని జమచేసి వారు ఎవరెవరు వద్ద ఎంత డబ్బులు వసూలు చేశారు అనేది బయటపెడతానని తెలిపారు. పేదలు నిర్మించుకునే ఇళ్ల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్న చరిత్ర వారిదని, అన్నారు. మేము అవసరమైతే పేదలకు ప్రజలకు సహకారం అందిస్తామని తెలిపారు. మాపై ఆరోపణలు చేస్తున్నవారి చరిత్ర తాండూర్ ప్రజలందరికీ తెలుసు అని వెల్లడించారు.

## ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

- జిపిఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



**చౌటకూర్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** చౌటకూర్ మండలంలోని న్యాయబద్ధమైన డిమాండ్లను త్వరగా పరిష్కరించాలని కోరుతూ చౌటకూర్ మండల ఇంచార్జి తహసీల్దార్ అనుదీప్‌కు తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ టీజీఈ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకై మండల కేంద్రాల్లో నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉద్యోగులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను, టీజీఈ జేఏసీ ప్రధాన డిమాండ్లలో జూన్ 2వ తేదీ నాటికి పీఆర్సీ అమలు, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్, హెల్త్ కార్డుల తక్షణ అమలు, సీపీఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ఓపీఎస్ పునరుద్ధరణ, 2004 సెప్టెంబర్ 1కు ముందు నియమితులకు ఓపీఎస్ అమలు, పెండింగ్ బిల్లులు, డీఏల విడుదల, 61 సంవత్సరాల వీఆర్ఏల సమస్యల పరిష్కారం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, సాధారణ బదిలీలు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రధానమైనవి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిపిఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయ ఆర్ఐ ప్రమోద్ కుమార్,బద్రి రికార్డ్ అసిస్టెంట్, నర్సింలు జూనియర్ అసిస్టెంట్, లావణ్య, కిష్టయ్య, వీఆర్ఏలు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా



**బెజ్జంకి, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో శుక్రవారం రెడ్డి సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం రెడ్డి కార్పొరేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు రెడ్డి జె.ఏ.సి నాయకులు తెలిపారు. సమాజంలోని ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ అవసరమని పేర్కొంటూ,ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఈ ధర్నా చేస్తున్నామని అన్నారు. సమస్యను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన న్యాయం జరగడంలేదని అందుకోసం సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 21 మంగళవారం రోజున కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించి మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిలేని మల్లికార్జున్ రెడ్డి,ముక్కిస తిరుపతి రెడ్డి హనుమండ్ల లక్ష్మారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఐలేని నరసింహారెడ్డి,దుంబాల రాజమహేందర్ రెడ్డి,ఐలేని శ్రీనివాస్ రెడ్డి,మల్లారెడ్డి,తాడూరి రామిరెడ్డి,మందపల్లి వెంకటరెడ్డి,ఐలేని గాల్ రెడ్డి,రామచంద్ర రెడ్డి,రాజిరెడ్డి,పద్మా రెడ్డి,గుర్రాల ప్రతివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బకాయిపడ్డ రూ.13 వేలకోట్లు ఒకే విడతలో చెల్లించాలి

**సంగారెడ్డి, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను, పెండింగ్ బిల్లుల రూపంలో బకాయి పడ్డ రూ. 13 వేలకోట్లు ఒకే విడతలో చెల్లించాలని, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టీజీఈజెఏసి జిల్లా కో కన్వీనర్ ఎం సోమశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీజీఈజెఏసి భాగస్వామ్య సంఘాలు సంయుక్త ఆధ్వర్యంలో కంది మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ



ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టీజీఈజెఏసి జిల్లా కో కన్వీనర్ ఎం. సోమశేఖర్ మాట్లాడుతూ... బకాయి పడ్డ రూ. 13 వేలకోట్లు ఒకే విడతలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు పీఆర్సీ రిపోర్టు తెప్పించుకొని అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు కంది మండల అధ్యక్షుడు కే. రాజు , మదన్ మోహన్, కిషన్, రాజశేఖర్, టిపిటిఎఫ్ కంది మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్దేశ్వర్, చంద్రమోహన్ యుటిఎఫ్ అధ్యక్షులు చందర్ అరుణశ్రీ ,టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కమ్రుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షులు విజయభాస్కర్, మామయ్య, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీఆర్‌సీ నివేదిక తక్షణమే అమలు చేయాలి

**నారాయణపేట, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జే ఏ సి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం నారాయణ పేటజిల్లా లోని అన్ని మండల కేంద్రాలలో ఎమ్మార్వో ఆఫీస్ ల వద్ద ,జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో మొదటి దశ పోరాటంలో భాగంగా భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సమా వేశంలో టి జి ఇ జెఏసి చైర్మన్ ఎం.నర్సింహారెడ్డి, సెక్రటరీ జనరల్ మొగుళప్ప, అడిషనల్ సెక్రటరీ జనరల్, కోచేర్మన్లు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండవ పిఆర్సి కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పిఆర్సి గడువును పొడిగించకుండా వెంటనే నివేదిక తెప్పించు కొని సంఘాలతో చర్చించి 51శాతం ఫిట్మెంట్ తో అమ లు చేయాలని, పెండింగ్ బిల్లు లు ఒకేసారి చెల్లించా లని,ఈ ఎచ్ ఎస్ అమలు చేయాలనీ,సి పి ఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12000 మంది ఉద్యోగులు,ఉపాధ్యాయు లకు చెల్లించాల్సిన బకాయి లు వెంటనే విడుదల చేయా లని, ఏక మొత్తంగా రూ 10,000 కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్ని క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. జి పి ఎఫ్,పి పి ఎస్ ఉపాధ్యాయుల డిఏ బకాయిలు విడుదల చేయాలని, బకాయి ఉన్న నాలుగు వాయిదాల డీఏలను ప్రకటించాలని, హెల్త్ కార్డుల పై నగదురహిత వైద్యం అందించాలని, ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తు న్నదని,ఆర్థిక భారం లేని సమస్యలను కూడా పరిష్క రించే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. సి పి ఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ను పునరుద్ధరించాలని, 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో జేఏసీ చైర్మన్ టి ఎం జి ఓ జిల్లా అధ్యక్షులు ఏం.నర సింహారెడ్డి సెక్రటరీ జనరల్ టి జి ఓ జిల్లా అధ్యక్షులు ముగులప్ప అడిషనల్ సెక్రటరీ జనరల్ పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి కో చైర్మన్లు యు టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు శివరాములు, టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప పెన్షనర్ ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ,సంతోష్ కుమార్, ప్రభుత్వ లెక్చరర్ ల సంఘం,నర్సింహా రెడ్డి,రామ్ రెడ్డి, రెవిన్యూ సంఘం మధు, ట్రెసా రామ కృష్ణ ట్రెసారీ సంఘం తిరుమలేష్,జి టి ఏ భీమయ్య,పంచాయతి కార్యదర్శులు సంఘం బాలరాజు,డి టి ఎఫ్ సూర్య చంద్ర,డి పి ఆర్ ఓ రషీద్,అలివేలమ్మ,తహశీల్దార్ లు అమరేందర్ కృష్ణ రాణి ,సురేందర్, బాటు టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్ పి ఆర్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, టి పి టి ఎఫ్ అధ్యక్షులు



దేవేంద్రప్ప,రఘువీర్, బాలాజీ,బసప్ప, శ్రీనివాస్, ఉదయభాను, జనార్దన్, మహాదేవ్,శ్రీధర్,రాణి, జయసుధ, ఎంఎస్ కుమార్, వాణిశ్రీ, శశికళ, పర్వీన్, శ్రీదేవి, శ్రీకాంత్, నర్సింలు, కాలేబ్,అధిక సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరము జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ ప్రతికు జైన్ కు వినతి పత్రంసమర్పించారు .ఈరోజు నారాయణపేట జిల్లాలోని అన్ని తాసిల్దార్ కార్యాలయా ల వద్ద,కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగ ఉపాధ్యాయుల పెన్షనర్ల నిరసనను రాష్ట్ర ప్రభుత్వము దృష్టికి తీసు కుని వెళ్లి వెంటనే సమస్యలు పరిష్కారం విధంగా సహక రించాలని జేఏసీ నాయకులు కలెక్టర్ ను కోరారు.

## ఉన్నత విద్య సాంకేతిక రంగంలో విద్యార్థులు అభివృద్ధి చెందాలి



**మొయినాబాద్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** దేశంలో ప్రస్తుతం సాంకేతికత ఆవిష్కరణలతో ఎంతో అభివృద్ధి చెందుతున్న కారుణంలో విద్యార్థులు కొత్త ధోరణిలను ఎంచుకొని అన్వేషించేందుకు లక్ష్యంగా ముందుకెళ్లాలని హైదరాబాద్ ఐఎల్ఈ సెక్షన్ వైస్ చైర్మన్ బాల ప్రసాద్ అన్నారు శుక్రవారం మొయినాబాద్ లోని విద్యార్థి ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి అవగాహన సదస్సునువిద్యార్థులకు నిర్వహించారు విద్యార్థి కళాశాల చైర్మన్ పళ్ళ రాజేశ్వర్రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే వేడుకలను ఏర్పాటు చేయడంలో ఆయన ఎంతో ముఖ్య పాత్ర పోషిస్తూ సమస్త నాయకత్వ బృందం ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సృజన .డీన్ పద్మజ. అకాడమిక్ జి శ్రీలత డైరెక్టర్ ప్లేస్మెంట్ వెంకటాచలం కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి జాతీయస్థాయి ఏకతాన్ 2026 నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న హైదరాబాద్ సెక్షన్ ఐఈఈ ఈ వాయిస చైర్మన్ బాల ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని కొత్తవారని ముందుకెళ్లాలని సూచించారు. విద్యార్థులు నూతన నైపుణ్యంతో ఉన్నత విద్యలో మంచి భవిష్యత్తును సంపాదించుకోవాలని పేర్కొన్నారు ఉన్నత విద్యతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**బొంరాస్‌పేట, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ ఎంప్లాయిస్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు మండల పరిధి లోని ఉద్యోగులు బొంరాస్ పేట తహసిల్దార్ పద్మావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, జనరల్ సెక్రెటరీ వి.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లిన అనేక సమస్యల్లో కొన్ని సమస్యలు పరిష్కారమైనప్పటికీ ఇంకా అనేక సమస్యలు పెండింగ్లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో




తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బాకారం మల్లయ్య, మండల అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్, టీచర్స్ ఫోరం కన్వీనర్ ఆదర్శ్, తపస్ మండల ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, రెవిన్యూ అసోసియేషన్ జేఏసీ నాయకులు శ్రీకాంత్, ఆర్ఐ శిరీష, జిపివోల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మండల జీపీఓలు సాయిలు, పుష్పలత, వెంకట్ రాములు, వెంకటయ్య,ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది వెంకట్ రాములు, కృష్ణమూర్తి, చందర్, ఇమ్రాన్ ,సత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు మంజూరు

- త్వరలోనే సుందరీకరణ పనులకు శ్రీకారం



**కాప్రా, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ఉప్పల్ నియోజకవర్గంలో కాప్రా చెరువు అభివృద్ధి పనులకు రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సర్వ శివమణి, బొంతు శ్రీదేవి యాదవ్ తో పాటు అధికారులతో కలిసి చెరువును సందర్శించి ప్రస్తుత పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, త్వరలోనే చెరువులో సుందరీకరణ పనులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులు రూ.20 కోట్లతో తుదిదశలో ఉన్నాయని, నాచారం హెచ్ఎంటీ నగర్ చెరువు (రూ.30 కోట్లు), రామంతాపూర్ పెద్ద చెరువు (రూ.17 కోట్లు) అభివృద్ధి పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయని వివరించారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు,ఇరిగేషన్ అధికారులు,మాజీ ,సింగిరెడ్డి ధన్పల్ రెడ్డి , పావని రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ ,మాజీ కౌన్సిలర్ రాజేందర్ ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతా రామ్ రెడ్డి , పోచయ్య గౌడ్,డివిజన్ అధ్యక్షులు నాగశశు, కాశట్టి ప్రసాద్,అంజయ్య, సింగిరెడ్డి వెంకట్ రెడ్డి,కాప్రా సాయి, డీసీసీ కార్యదర్శి మారుళి, సురేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పూర్ణ యాదవ్,సీనియర్ కాంగ్రెస్ అజీజ్, బాబు రావు, శ్రీహరి, సత్యనారాయణ, టిల్లు యాదవ్,రాకేష్ యాదవ్, నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

మెదక్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు 10వ రోజైన శుక్రవారం రోజు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఆర్టిజన్ల సమ్మెకు మెదక్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జీ కంటారెడ్డి తిరుపతి రెడ్డి హాజరై సంఘీభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ ల డిమాండ్లు న్యాయపరమైనవేనని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



యూనియన్ నాయకులతో చర్చలు జరిపి మీకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ మీకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎండనక, వాననక, రాత్రింబవళ్ళు కష్ట పడి పనిచేసేది మీరైతే, ఉన్నతాధికారులు ఏసిలలో పడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రూ.30వేలతో బతుకులు నెట్టుకు రావటం చాలా చాలా బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్ రెడ్డి,మెదక్ పట్టణ అధ్యక్షులు మామూళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్ గౌస్ ఖురేషి,కల్వకుంట్ల సర్పంచ్ కొండలు రెడ్డి, మాజీ ఎంపీపీ అంజన్న,సతీష్ రావు,చందుగౌడ్,సాంగు స్వామీ,చిన్నశంకరంపేట మండల వైస్ ప్రెసిడెంట్ బాగా రెడ్డి,మెదక్ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్,మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు లాలు నాయక్,మందాపూర్ మాజీ సర్పంచ్ సుధాకర్,మాజీ కౌన్సిలర్ జయరాజు, గోపనీ సాయి,మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి ప్రణీత,నాగమణి,జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్,ప్రదీప్ గౌడ్, శ్రీశైలం శ్రీనివాస్, బి.చంద్ర భానప్ప,బి.సంపత్ కుమార్, పాపయ్యోల రమేష్, వై.సంగమేశ్వరరెడ్డి, నాగరాజు, వెంకటచారీ రాజుగౌడ్, మొగులయ్యా,బుస్ససత్యం గుప్తా,పోలశ్రీనివాస్,రమావత్ ఉపేంద్ర, నాయక్, మావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్,వై.జైపాల్ రెడ్డి, యూసుఫ్, కిషన్, అశోక్, మోహన్, పరశురామ్, నర్సింలు, సుధాకర్, సాయిలు, యాదగిరి, సూర్య రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, గంగారం ప్రవీణ్ మఠం సంగమేశ్వర తదితరులు పాల్గొన్నారు. నిరవధిక సమ్మెలో భాగంగా మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.

# కుల రహిత సమాజం కోసం పోరాడుదాం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు పోస్టర్ ఆవిష్కరణ

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ఈ నెల 19న సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని శుక్రవారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్లో పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న సంగారెడ్డి లోని అంబేద్కర్ భవనం ఆవరణంలో కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలు (ఆట పాట మాట) కార్యక్రమం జరుగుతుందని జయప్రదం చేయాలని అన్నారు 78 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల మధ్య కులమత వైశమ్యాలు కొనసాగడం విచారకరమని, సాటి మనుషులంతా నాతో సమానమనే సమానత్వ భావనను పెంపొందించడానికి కులరహిత సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని కుల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు ప్రపంచంలో ఎక్కడా లేని కులం మన దేశంలో కులపరమైన గౌరవాలు అవమానాలు కొనసాగిస్తుందని సాటి మనిషిని మనిషిగా చూడలేని నీచపు సంస్కృతి కులంలో దాగి ఉందని అన్నారు అనేక దేశాలు అనేక ఆధునిక పద్ధతులలో జీవనం కొనసాగిస్తుంటే మనదేశంలో మాత్రం నేటికీ కులం మతం పేరిట సాటి మనుషులను మనిషిగా గౌరవించని పరిస్థితి నెలకొందన్నారు కుల రహిత సమాజం ద్వారా మాత్రమే భారతీయ సమాజం పురోభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రంలో వీడీసీల పేరిట అట్టడుగు తరగతులపై దౌర్జన్యాల కొనసాగుతున్నాయని తక్షణమే ప్రభుత్వం విడిసి లను నిషేదించాలని డిమాండ్ చేశారు గత పదేండ్ల కాలంలో 143 కుల దురహంకార హత్యలు జరిగాయని దళితులు పేదలపైన రోజురోజుకి దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని చెప్పారు దళితులపై దాడులు అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు కులరహిత సాంస్కృతిక ఉద్యమాలలో కుల వివక్ష అంటరానితనాన్ని వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కవులు కళాకారులు మేధావులు భాగస్వాములు కావాలని ఈనెల 19న సంగారెడ్డిలో జరిగే కుల రహిత సమానత్వ సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం




చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం శివకుమార్, పి .అశోక్ ,రైతు సంగం జిల్లా అధ్యక్షులు రాజయ్య, వృత్తి సంఘాల జిల్లా నాయకులు ఎస్ రమేష్ గౌడ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ మైపాల్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రవీణ్ జయరామ్, ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్, నరేష్, శ్రీహరి దత్తు, తదితరులు పాల్గొన్నారు

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 ఏప్రిల్ 2026

# గోల్డెన్ అవర్ స్పందనతో ప్రాణాల రక్షణ సాధ్యం

- ఐజీపీ డా. గజరావు భూపాల్



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ప్రమాదం జరిగిన వెంటనే, గోల్డెన్ అవర్‌లో సరైన సహాయం అందిస్తే మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్స, అత్యవసర స్పందనపై కనీస అవగాహన కలిగి ఉండాలని ఐజిపి డా. గజరావు భూపాల్ అన్నారు.వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ పరిధిలోని ఏ టి ఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన-- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐజీపీ డా. గజరావు భూపాల్ , వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి,వనపర్తి ఇంచార్జి ఎస్పీ డా. వినీత హాజరై వారితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, అంబులెన్స్ డ్రైవర్లు, ఆటో, లారీ, డీసీఎం డ్రైవర్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, యువత, విద్యార్థులకు 1000 మందికి నిపుణులచే గోల్డెన్ అవర్ సమయంలో ఎలా స్పందించాలి, ప్రాథమిక చికిత్స ఎలా అందించాలి, బాధితులను ఎలా తరలించాలి వంటి అంశాలపై నిపుణులైన డాక్టర్లచే సమగ్ర శిక్షణ అందించారు. అనంతరం డ్రైవర్లకువాహన డ్రైవర్లకు సీపీఆర్ శిక్షణ, కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని నిర్వహించి, వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేయించారు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన నియమాలను వివరించారు.ఈ సందర్భంగా ఐజీపీ డా, గజరావు భూపాల్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే తొలి గంటను 'గోల్డెన్ అవర్' అంటారు. ఈ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడటం సాధ్యం అవుతుంది. ప్రతి పౌరుడు ప్రాథమిక సహాయం, బాధితులను సురక్షితంగా తరలించే విధానంపై అవగాహన కలిగి ఉండాలి. ప్రజల సహకారం లేకుండా రోడ్డు భద్రత లక్ష్యాలు సాధ్యం కావు. ఈ శిక్షణలు ప్రాణాలను రక్షించే శక్తిని సమాజానికి అందిస్తాయి. దేశవ్యాప్తంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో సుమారు 50 శాతం మృతి చెందిన వారు ద్విచక్ర వాహనదారులేనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్ ధరించడం ప్రాణాలను కాపాడే అత్యంత సరళమైన కానీ కీలకమైన భద్రతా చర్య అని పేర్కొన్నారు. అలాగే, కారులో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించుకోవచ్చని వివరించారు.ఇటీవల జరిగిన ప్రమాదాల్లో అధికంగా 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తు అయిన యువతను రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. దీర్ఘదూర ప్రయాణాల కోసం ద్విచక్ర వాహనాల కంటే సురక్షితమైన ఇతర రవాణా మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. గోల్డెన్ అవర్ సమయంలో సమయానికి స్పందిస్తే ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చు. ఈ తరహా శిక్షణా కార్యక్రమాలు గ్రామ స్థాయి వరకు విస్తరించి, అవగాహనను పెంపొందించడం అత్యంత అవసరం. ఈ సందర్భంగా ఇంచార్జి ఎస్పీ డా. వినీత్ మాట్లాడుతూ డ్రైవర్లు, యువత, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చు. భద్రతా నియమాలు పాటించడం, అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలను ముందుగానే నివారించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ సంస్కృతి పెంపొందించడమే లక్ష్యమని ఈ గోల్డెన్ అవర్ స్పందన శిక్షణ కార్యక్రమం ప్రజల్లో బాధ్యతను పెంపొందిస్తూ, రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను రక్షించే దిశగా ఒక కీలక ముందడుగు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు వనపర్తి డిసిఆర్బి డిఎస్పి, బాలాజీ నాయక్, వనపర్తి డిఎంహెచ్వో కొత్తకోట మున్సిపల్ చైర్మన్,పోతులపల్లి అరుణ, మున్సిపల్ వైస్ చైర్మన్,పల్లవి,మదనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రశాంత్, కొత్తకోట సీఐ, రాంబాబు, వనపర్తి సిఐ రత్నం ఆత్మకూరు, శివకుమార్, కొత్తకోట ఎస్సై, శివానందం, వనపర్తి జిల్లాలోని ఎస్సైలు, ప్రజా ప్రతినిధులు యువకులు, విద్యార్థులు, డ్రైవర్లు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ నివేదిక తక్షణమే అమలు చేయాలి



**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తెలంగాణ రెండో పీఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం పీఆర్సీ గడువు పొడిగించకుండా, వెంటనే నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సిద్దిపేట జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపులో భాగంగా ఈరోజు మధ్యాహ్నం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట టీజీ జేఏసీ సిద్దిపేట ఆధ్వర్యంలో భారీ "నిరసన ప్రదర్శన" నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీజెఏసి సిద్దిపేట జిల్లా నాయకులు గ్యాదరి పరమేశ్వర్ , విక్రం రెడ్డి, తప్పెట్ల యాదగిరి , ఇంద్రసేనారెడ్డి మరియు తిరుపతిరెడ్డి, లు మాట్లాడుతూ 2024 మార్చి నుండి రిటైర్ అయిన 12 వేలమంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రిటైర్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఏక మొత్తంగా రూ 13000 కోట్లు కేటాయించి పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేయాలి డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రధానమైన పై నాలుగు సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే మే 5వ తేదీన రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నేటి నిరసన ప్రదర్శనలో సుమారు 400 ఉంది ఉద్యోగ ఉపాధ్యాయులు మరియు పెన్షనర్ పాల్గొన్నారు. నిరసన ప్రదర్శన అనంతరం జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగరాజు, రంగారావు, తిరుపతి రెడ్డి, కిష్టయ్య, కాజా, శశిధర్ శర్మ, నరేందర్, సుశాంత్, దేవరాజ్, పొన్నమల్ల రాములు, రాజు రెడ్డి, జయశ్రీ పాల్గొని ప్రసంగించారు.

## ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



**కృష్ణ, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ టి జి ఈ జే ఏ సి నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు శుక్రవారం క్రిష్ణ మండల సభ్యులు తమ వివిధ డిమాండ్ల సాధన కోసం క్రిష్ణ మండల తహసీ ల్దార్ కు మెమొరాండం సమర్పించారు.ఈ సంద ర్భంగా జే ఏ సి సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా కొత్త పే రివిజన్ కమిషన్ ప్రకటన, పెండింగ్ డీఏలు విడుదల, పాత పెన్షన్ విధానం పున రుద్ధరణ, ఉద్యోగుల ఆరోగ్య కార్డుల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించా లని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వివిధ శాఖల ఉద్యోగులు, పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలి

- అదనపు కలెక్టర్ మాధురి

**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలుకు మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీలు, వ్యవసాయ అధికారులు, పీపీసీ, ఐకేపీ సెంటర్ల ఇన్‌చార్జిలు, తూనికలు కొలతల శాఖ అధికారులు, రవాణా శాఖ అధికారులు, సహకార శాఖ అధికారులు,ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు,ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ..... జిల్లాలో 2025-26 రబీ సీజన్‌లో మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినట్లు తెలిపారు. ఇందులో దొడ్డురకం ధాన్యం 2 లక్షల మెట్రిక్ టన్నులు, సన్నరకం ధాన్యం 20 వేల మెట్రిక్ టన్నులు ఉండనున్నాయని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, కామన్



రకానికి రూ.2,369 నిర్ణయించినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, అదనంగా రూ.500 బోనస్‌తో రూ. 2,889లు, అందించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం మొత్తం 226 కొనుగోలు కేంద్రాలు ప్రతిపాదించినట్లు వెల్లడించారు. వీటిలో ఐకేపీ ఆధ్వర్యంలో 97, ప్యాక్స్ ఆధ్వర్యంలో 97, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో ఒక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో తార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, తేమ కొలిచే మీటర్లు వంటి మౌలిక సదుపాయాలు సరిపడా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సెంటర్ నిర్వాహకులు ప్రతిపాదించిన రైస్ మిల్లర్లకు మాత్రమే ధాన్యాన్ని లారీల ద్వారా తరలించాలని, సొంత రవాణా వాహనాలు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. గతంలో తలెత్తిన లోటుపాట్లను సరిచేసుకుని ఈసారి పారదర్శకంగా కొనుగోళ్లు నిర్వహించాలని అన్నారు. ఆన్లైన్ ట్యాబ్ నమోదు ప్రక్రియలో ఆలస్యం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు సీరియల్ నంబర్లు కేటాయించాలని పేర్కొన్నారు . అకాల వర్షాల సమయంలో ధాన్యాన్ని రక్షించే బాధ్యత సెంటర్ ఇన్‌చార్జిలదేనని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లర్లతో సమన్వయం చేసుకుని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు, తేమ పరీక్షలు, గన్ని బ్యాగుల సరఫరా వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అంబాదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా సహకార శాఖ కిరణ్ కుమార్, ఏ సి ఎస్ ఓ రాజేశ్వర్ , డిపిఎం లు, ఏపీఎంలు, ప్యాక్స్ సెక్రటరీ లు ,వ్యవసాయ అధికారులు , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఉస్మానియా పీజీ విద్యార్థి సురేష్ మృతి బాధాకరం

- మాజీ మంత్రి డా. లక్ష్మారెడ్డి
- బాధిత కుటుంబాన్ని పరామర్శించి నివాళలర్పించిన మాజీ మంత్రి
- సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**జడ్చర్ల, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ఉస్మానియా మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థి సురేష్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం అత్యంత బాధాకరమని మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జడ్చర్ల మండలం పలుగుగడ్డ తండాలో సురేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా డా. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాల్సిన ఒక యువ వైద్యుడు ఇలా



అర్ధాంతరంగా తనువు చాలించడం ఆ కుటుంబానికే కాక సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. గతంలో సురేష్‌కు ఎస్వీఎస్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు వచ్చిన సమయంలో తాను స్వయంగా అభినందించిన తీపి జ్ఞాపకాలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి ఉస్మానియాలో పీజీ సీటు సాధించి ఇలా మృత్యువాత పడటం వెనుక ఉన్న కారణాలను వెలికితీయాలని, పేద గిరిజన విద్యార్థి మరణిస్తే మెడికల్ కాలేజీ సిబ్బంది గానీ, ప్రభుత్వం గానీ కనీసం స్పందించకపోవడం వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రభుత్వానికి సామాన్యుల ప్రాణాలంటే లెక్కలేకుండా పోయిందని విమర్శించారు. సురేష్ మృతిపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సురేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, తండా వాసులు, సురేష్ స్నేహితులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఆధ్వర్యంలో ఈరోజు మండల కేంద్రంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతూ, ఎమ్మార్వోకు మెమోరాండం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి కర్రె పోచయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శివప్రసాద్, మండల అధ్యక్షులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సతీష్, విశ్రాంత ఉద్యోగ అధ్యక్షులు విశ్వనాధం,ప్రతాప్, శ్రీరాములు వివిధ సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, మరియు మండల రెవెన్యూ ఆఫీసులో పనిచేస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

## లే అవుట్ల విషయంలో అధికారులు జాగ్రత్తలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** లే ఆవుట్ల అనుమతుల విషయంలో అధికారులు జాగ్రత్తలు పాటించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే - అవుట్ లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..లేఅవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.అనుమతుల కోసం కమిటీకి వచ్చిన జిల్లా కేంద్రానికి సంబంధించి నాలుగు లేఅవుట్ల దరఖాస్తుల పై అన్ని శాఖల అధికారుల క్లియరెన్స్ ను కలెక్టర్ అడిగారు. అయితే లే అవుట్ కమిటీ కి వచ్చిన నాలుగు లే అవుట్ లలో రెండు లే అవుట్ లకు కలెక్టర్ అధ్యక్షతన కమిటీ అనుమతులు జారీ చేసింది. మిగతా రెండు లే అవుట్ల అనుమతులను కమిటీ నిరాకరించింది. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, పంచాయతీరాజ్ ఈ ఈ బ్రహ్మానందరెడ్డి, డిటిసిపిఓ కిరణ్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ,ఆర్ అండ్ బి, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యగుల డిమాండ్లును ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలన్నీ సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా ఉద్యోగ ఐక్య కార్యచరణ సమితి చైర్మన్ దొంత నరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారంరోజున మెదక్ జిల్లా కలెక్టరేట్ కాంప్లెక్స్ లోనే తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భోజన విరామ సమయంలో భాగస్వామ్య సంఘాలతో కలసి నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ నిరసన కార్యక్రమం నికి ఉపాధ్యాయ సంఘాలు ఇతర సంఘాలు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న మూడు విడతల కరువుభత్యాలు మాత్రమే విడుదల చేశారని నూతన ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న ఐదు విడతల కరువు భత్యంతో పాటు గత ప్రభుత్వం 5% మధ్యంతర భృతి తో పిఆర్సి కమిషన్ వేసిందని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు పె రివిసన్ కమిషన్ పై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే కమిటీ నివేదిక తెప్పించుకొని వెంటనే 51 శాతం ఫిట్మెంట్ ప్రకటించాలని తెలియజేశారు. ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న 13వేల కోట్ల బకాయిలు యుద్ధ ప్రతిపాదకన విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగులు ప్రభుత్వం నుండి తమ సొంత డబ్బులు విడుదల కాక మనోవేదన చెంది అనారోగ్యంతో మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల విశ్రాంత ఉద్యోగుల వేతనం నుండి 1.5% ప్రభుత్వం నుండి 1.5% భాగస్వామ్యంతో మూల నిధి ఏర్పాటు చేసి ఉద్యోగుల ట్రస్టు ద్వారా నగదు రహిత ఆరోగ్య కార్డులు జారీ చేస్తామని అనేక సమావేశాలు నిర్వహించి కాలయాపన చేయడం తగదన్నారు. నూతన ప్రభుత్వం సాధారణ ఎన్నికల ముందు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెడతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ఉద్యోగులపై చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ఉద్యోగుల నిరసన నినాదాలతో కలెక్టరేట్ కార్యాలయం దద్దరిల్లిపోయింది. అనంతరం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను కలసి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విట్టల్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్, ట్రేస, పి ఆర్ టి యు, ఎస్ టి యు, యుటిఎఫ్, టి పిటిఎఫ్,టిటీయు (టీటీయూ)క్లాస్ ఫోర్త్, విశ్రాంత ఉద్యోగులు, డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్ గౌడ్, సతీష్ రావు, రాజగోపాల్ గౌడ్, పద్మారావు, యాదగిరి, శివయ్య, ప్రసాద్, శ్యాంసుందర్, చరణ్ సింగ్, సౌమ్య నాయక్, నరేష్ కుమార్, వెంకట్రామిరెడ్డి, రిజ్వానలీ, గోలి కుమార్, సాంసన్ జయకర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కిషన్, తంస రాష్ట్ర అధ్యక్షులు శ్రీహరి, టీఎన్జీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అనురాధ, జిల్లాసహా అధ్యక్షులు ఇక్బాల్ పాషా, ఉపాధ్యక్షులు



పజిలుద్దీన్, రఘునాథరావు, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, క్రీడల కార్యదర్శి గోపాల్, కార్యవర్గ సభ్యులు సతీష్, రామాయంపేట యూనిట్ అధ్యక్షులు ప్రభాకర్, ఏడుపాయల వనదుర్గ కార్యదర్శి ప్రశాంత్, సేర్ఫ్ బాధ్యులు శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా కార్యదర్శి చంద్రహాస్, సహా అధ్యక్షుడు శ్రీకాంత్ కోశాధికారి లింగప్ప, ఉద్యోగ సంఘ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్, విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ సాయిబాబా, రమేష్ బాబు, నరేందర్, సునీల్, మధుసూదన్, తదితర భారీ ఎత్తున ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# సీఎం సభను సక్సెస్ చేయాలి

- అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం నస్తూరిపల్లిలో ఈ నెల 20న నిర్వహించే సీఎం సభను సక్సెస్ చేయాలని, అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ నెల 20న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు సాయంత్రం 4 గంటలకు మేడిగడ్డ, కాళేశ్వరం సందర్శించనున్నారు. అనంతరం కాటారం మండలం నస్తూరిపల్లిలో రైతు సోదరుల కోసం నిర్వహించే కార్యక్రమంలో రైతు భరోసా రెండో విడత నిధులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి కలెక్టరేట్ లోని ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులతో కలిసి జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆ దిశగా రైతు భరోసా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మన జిల్లా నుంచి ప్రారంభించడం గర్వకారణమని తెలిపారు. ఇదే సందర్భంలో నస్తూరిపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున రైతులు, మహిళలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగం సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, కౌన్సిలర్లు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గోల్డెన్ అవర్‌లో ప్రాణాలను కాపాడొచ్చు

- ఆ సమయంలో సరైన చికిత్స అందించాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ ప్రతినిధి,ఏప్రిల్ 17(జనంసాక్షి): రోడ్ ప్రమాదాల సమయంలో డ్రైవర్లు 'గోల్డెన్ అవర్' మీద పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షతగాత్రులకు అవసరమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'అరైవ్ - అలైవ్' కార్యక్రమం నేపథ్యంలో శుక్రవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో "గోల్డెన్ అవర్" అంశంపై డ్రైవర్ లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్‌లి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు భయపడి అక్కడి నుంచి వెళ్లిపోకుండా, బాధితులను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, దగ్గరలోని ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో 'గోల్డెన్ అవర్' ఎంతో కీలకమని, ఆ సమయంలో సరైన చికిత్స అందితే ప్రాణాలను కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అలాగే ఏదైనా ప్రమాదాన్ని చూసిన వ్యక్తులు వెంటనే స్పందించి, ప్రాథమిక చికిత్స అందించడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ప్రమాదం చేసి పారిపోవడం తీవ్రమైన నేరమని, భారతీయ న్యాయ సంహిత ప్రకారం కఠిన శిక్షలు అమల్లో ఉన్నాయన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని, ప్రమాదం గమనించిన వారు అక్కడే ఉండి పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించే వారికి ప్రభుత్వం అమలు చేస్తోన్న 'రాహవీర్', 'పీఎం రాహత్' పథకాల ద్వారా ప్రోత్సాహకాలను అందిస్తోందని, ప్రజలు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులను రక్షించడం ఒక మానవతా ధర్మమని, ఆ సమయంలో సహాయం చేయడం వల్ల మన ద్వారా దేవుడే ఆ పని చేయిస్తున్నాడని భావించాలన్నారు. అంబులెన్స్ సేవలను నిర్వహిస్తోన్న ఈఎంఆర్ఐ మార్గదర్శకాలను పాటిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించటం ద్వారా ప్రాణాలను కాపాడాలని కలెక్టర్ కోరారు. అనంతరం లిడీసీపీలి మాట్లాడుతూ.. ప్రజలు సురక్షితంగా ప్రయాణించి తమ గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవాలన్న లక్ష్యంతో "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం జరిగే రోడ్డు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో ప్రాణ నష్టం చోటు చేసుకుంటోందని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యం వహించడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. తదనంతరం ఏసిపి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్' అత్యంత ప్రాముఖ్యత కలిగిన సమయమని తెలిపారు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఒక ప్రాణాన్ని కాపాడవచ్చని అన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు తక్షణమే సహాయం అందించి, అవసరమైతే సీపీఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలను నిలబెట్టవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక చికిత్స గురించి అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల బస్సుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అంతకుముందు రోడ్ ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న క్షతగాత్రులను గోల్డెన్ అవర్ లో సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యాధికారులు రవి కృష్ణ, సరిత, అలాగే 108 సేవలపై 108 ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రాము, అదే విధంగా రాహవీర్ పథకం, పీఎం రాహత్ పథకాలపై ఐఆర్ఏడీ డీఎం (ఎన్ఐసి) టీ. శివ ప్రసాద్ డ్రైవర్లకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చి, పూర్తి అవగాహన కల్పించారు. అనంతరం లారీ, ఆటో అసోసియేషన్ సభ్యులు, పాఠశాల బస్, ఆటో, లారీ డ్రైవర్లకు లైసెన్స్ లను అందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ పండరి చేతన్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మల్లికార్జున రావు, ఆర్టీఏ మెంబర్ అభి గౌడ్, వైద్యాధికారులు, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, ఆటో, లారీ, బస్ డ్రైవర్ లు, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా డబ్బాలకు నోటీసులు



**మొగుళ్లపల్లి ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో రహదారిపై నిర్మించిన డబ్బాలను వెంటనే తొలగించాలని మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ నోటీసులు జారీ చేశారు. మొగుళ్ళపల్లి మెయిన్ రహదారిపై నిర్మించిన డబ్బాల వలన ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్ చాట్ల విజయ స్పందించారు. రహదారిపై నిర్మించిన డబ్బాలను వెంటనే తొలగించి ట్రాఫిక్ జామ్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఆమె తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డబ్బాలు నిర్మించిన యజమానులకు గ్రామపంచాయతీ పాలకవర్గం నోటీసులు జారీ చేశారు. వెంటనే రోడ్లపై నిర్మించిన డబ్బాలను తొలగించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎర్రబెల్లి హిమబిందు, వార్డ్ మెంబర్లు మల్సాని రాజేశ్వర్ రావు, చిలుకమారి శ్రీనివాస్, అర్షం మహేష్, బండారి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హార్వెస్టర్ అప్పు తీర్చలేక రైతు ఆత్మహత్య



కుబీర్, ఏప్రిల్ 17, (జనంసాక్షి): అప్పులు తీర్చే దారి కనిపించక, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన కుబీర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ధార్ కుబీర్ గ్రామానికి చెందిన జరుగు లక్ష్మణ్ (46) వృత్తిరీత్యా రైతు. గతేడాది వ్యవసాయ పనుల నిమిత్తం ఒక హార్వెస్టర్ వాహనాన్ని కొనుగోలు చేశాడు. అయితే, గత నెల రోజులుగా ఆ వాహనం వరుస రిపేర్లకు గురై సరిగా పనిచేయకపోవడంతో లక్ష్మణ్ తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. వాహనం కోసం తీసుకున్న అప్పులో ఇంకా రెండు లక్షల రూపాయలు బకాయి ఉండటం, ఆదాయం నిలిచిపోవడంతో ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన సొంత చేను వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి భార్యకు విషయం తెలపడంతో, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే భైంసాలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదే రోజు రాత్రి 10 గంటల ప్రాంతంలో లక్ష్మణ్ మృతి చెందాడు. మృతుడి భార్య జరుగు కమలా బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట దగ్ధం



**కుబీర్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** కుబీర్ మండలంలోని చాత గ్రామ శివారులో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో స్థానిక రైతు తోట గంగారం సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిగా అగ్నికి ఆహుతై బూడిదయ్యింది. కష్టపడి పండించిన పంట కళ్లముందే కాలిపోవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న మండల రెవెన్యూ అధికారి ఆర్ఐ శ్రీనివాస్ ప్రమాద స్థలాన్ని సందర్శించి, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. ఈ అగ్నిప్రమాదంలో రైతుకు సుమారు రూ. 50 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆయన ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సందర్భంగా ఆర్ఐ మాట్లాడుతూ.. బాధిత రైతుకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూస్తామన్నారు. అగ్నిప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, తద్వారా రైతుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# మహిళల భద్రతకు మార్గదర్శకంగా 'పోలీస్ అక్క'

- జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు ఘన సన్మానం



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు, విద్యార్థినుల భద్రతతో పాటు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ప్రారంభించిన పోలీస్ అక్క కార్యక్రమం విశేష ఫలితాలను అందిస్తోంది. ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించి సమాజంలో మంచి మార్పుకు దోహదపడిన నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుం టున్నారు. ఈ కార్యక్రమం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడంతో, ఎస్పీ జానకి షర్మిల ప్రతిష్టాత్మకమైన (స్కాచ్ అవార్డు) ను అందుకున్నారు. ఈ అవార్డు ఆమె సేవలకు, ముఖ్యంగా మహిళల రక్షణ, సామాజిక చైతన్యానికి చేసిన కృషికి ప్రతీకగా నిలిచింది. శుక్రవారం ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్పీ మేడమ్ ని ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యా, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. ఈ సత్కార కార్యక్రమంలో అయ్యన్నగారి శ్రీధర్ , శ్యామ్ ప్రకాష్ , షబ్బీర్, జీషాన్ అలీ , సియసత్ రిపోర్టర్ అజర్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్17 (జనంసాక్షి) :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్దేశిత గడువుల్లోనే కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి, సమయానికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాల వద్ద టెంట్లు, త్రాగునీరు, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అంతరాయాలు లేకుండా తగినన్ని గన్నీ సంచులు, తూకపు యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం అందించిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని సామాగ్రి సమగ్రంగా ఉందో లేదో పరిశీలించి, పరికరాలు సక్రమంగా పనిచేసేలా ముందస్తు తనిఖీలు చేయాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో నిబంధనలకు అనుగుణంగా రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని, ధాన్యం స్వీకరణలో పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, మార్క్‌ఫెడ్ ప్రతినిధులు మహేష్, మిలర్స్ అసోసియేషన్ సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- బోథ్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నెరడిగొండ ఏప్రిల్17 (జనంసాక్షి):** జొన్నల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతిపత్రాన్ని అందజేశారు. శుక్రవారం రోజున తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ హైదరాబాద్ లోని తన కార్యాలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ముధోల్ ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బోథ్ నియోజకవర్గంలోని ధన్నూర్, బోథ్ నెరడిగొండ, ఇచ్చొడ, తాంసి, భీంపూర్, బజార్ హత్నూర్ లలో వెంటనే జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు అన్ని సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

# మాణిక్‌గూడ గ్రామ సంరక్షణకు చర్యలు

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె .హరిత
- ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి పనులకు శంకుస్థాపన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 17(జనంసాక్షి) :** మండలంలోని కొమరం భీమ్ ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా మాణిక్ గూడ గ్రామానికి పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె .హరిత అన్నారు. ఫిబ్రవరి నెలలో మాణిక్ గుడా గ్రామ సందర్శన సమయంలో జిల్లా కలెక్టర్ దృష్టికి గిరిజనులు పలు సమస్యలను తీసుకువెళ్లడంతో పాటు ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా తమ గ్రామానికి ముప్పు ఉందని వివరించారు. స్పందించిన కలెక్టర్ నివేదికలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించడంతో రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దాదాపు 46 లక్షల రూపాయలతో రక్షణ గోడకు శుక్రవారం కలెక్టర్,ఎమ్మెల్యే కోవలక్ష్మితో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ ద్వారా గ్రామానికి ఎలాంటి నష్టం జరగకుండా శాశ్వత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముప్పు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ గోడ పునర్నిర్మాణ పనుల ద్వారా గ్రామానికి తలెత్తుతున్న భూమి కోత సమస్య తీరడమే కాకుండా, భవిష్యత్తులో ప్రాజెక్ట్ కు ముప్పు నుండి గ్రామస్తులకు పూర్తి రక్షణ లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ గుణవంతురావ్ అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- నల్ల బ్యాడ్జీలతో నిరసన



**పాలకుర్తి, ఏప్రిల్ 17(జనంసాక్షి)** ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ, తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ జాక్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ సరస్వతికి వినతి ప్రతం అందచేశారు. ఈ సం దర్భంగా మండల బాధ్యులు వీరమల్ల బాబయ్య, చిదురాల శ్రీనివాస్. దేవగిరి సూర్యప్రకాష్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెన్షనర్ల ఆరోగ్య కార్డులు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ. 13 వేల కోట్లను బిల్లులను ఏక మొత్తంలో విడుదల చేసి పెన్షనర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటయ్య, ఇమ్మడి ప్రకాష్, రమేష్, ఎండి. శరీఫ్, వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

- భూమి పట్టాను రద్దు చేయాలి
- ఓ బాధితుడి వేడుకోలు
- భూపాలపల్లి ఆర్డీఓ కు ఫిర్యాదు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నా భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆ భూమి పట్టాను రద్దు చేయాలని మూసిక సదయ్య అనే బాధితుడి వేడుకుంటున్నాడు. ఈ మేరకు శుక్రవారం బాధితుడు సదయ్య కుటుంబంతో సహా భూపాలపల్లి ఆర్డీఓను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుడు సదయ్య తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన కుసుంబ రాజయ్య దగ్గర నుండి మూసిక కొమురయ్య నాలుగు గంటల 17 పైసల భూమిని 20 సంవత్సరాల క్రితం కొనుగోలు చేశాడు. కాగా కొమురయ్య కొడుకు సదయ్య అవసర నిమిత్తం భూమిని గోపు కవితకు గుంటకు 60 వేల చొప్పున భూమిని అమ్మేందుకు మొత్తం ధర రూ. 2లక్షల 60 వేలు పెద్ద మనుషుల సమక్షంలో నిర్ణయించడం జరిగింది. 50 వేల రూపాయలను గోపు కవిత బయాన ఇచ్చింది. ఆ తర్వాత కుసుంబ రాజయ్య కుమారుడైన తిరుపతి, సదయ్యకు తెలియకుండా భూమిని గోపు కవితకు రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనితో ఆందోళన చెందిన బాధితులు గత సంవత్సరం స్థానిక టేకుమట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆరేపల్లి గ్రామపంచాయతీ నుండి కూడా పంచాయతీ కార్యదర్శి గత సంవత్సరం ఇంటి అడుగు స్థలాన్ని సర్వే చేసి ఈ భూమి సదయ్యకు చెందిందని ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చినప్పటికీ కూడా, తిరుపతి భూమిని వేరే వాళ్లకు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వారికి న్యాయం జరగపోవడంతో తహసిల్దార్, ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చారు. కానీ ఇప్పటివరకు బాధితులకు న్యాయం జరగలేదు. మా భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారు. అక్రమంగా చేసుకున్న వారి పట్టాను క్యాన్సల్ చేసి, తమకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా బాధిత మూసిక సదయ్య కుటుంబసభ్యులు అధికారులను వేడుకుంటున్నారు.

# చిన్నారుల భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 17(జనంసాక్షి);** చిన్నారుల భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ జిల్లాలోని శంభునిపేట, గుంటూరుపల్లి ప్రాంతాల్లోని అంగన్వాడి కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు అంది స్తున్న పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలపై. కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గుంటూరుపల్లి అంగన్వాడి భవన నిర్మాణాన్ని తుది మెరుగులతో త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని, అలాగే కాంపౌండ్ గోడ నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శంభునిపేట అంగన్వాడి కేంద్రంలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో మౌలిక వసతులు, శుభ్రత, హాజరు నమోదులను కూడా పరిశీలించి, అవసరమైన మెరుగుదల చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాల్యవివాహాల నియంత్రణలో మహిళలు ముందుండి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఆడపిల్ల డిగ్రీ వరకు తప్పనిసరిగా చదువుకోవాలని, విద్య ద్వారా వారి ఆలోచనా శక్తి పెరిగి భవిష్యత్తును మెరుగ్గా నిర్మించుకునే సామర్థ్యం ఏర్పడుతుందని తెలిపారు. ఈ అంశంపై అంగన్వాడి కార్యకర్తలు గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, సంబంధిత శాఖల అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
18 ఏప్రిల్ 2026

# రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజి సౌమ్య మిశ్రా




**సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** అజాగ్రత్త ప్రయాణంతో ప్రాణాలకు ముప్పు అని,రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్యమిశ్రా పిలుపునిచ్చారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా పాల్గొన్నారు.ముందుగా జిల్లా కేంద్రంలో కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా నుండి రోడ్డు భద్రతపై నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పిల్లలమర్రి వద్ద బ్లాక్ స్పాట్స్ లను పరిశీలించారు.రుద్రంగి కన్వెన్షన్ హాల్ నందు పోలీస్ శాఖ ఆద్వర్యంలో విద్యార్ధులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ కె.నరసింహతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదలతో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారని,ఈ నేపథ్యంలో రోడ్డు భద్రతను గుర్తించి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కొరకై అవగాహన కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు.రోడ్డు మీద అజాగ్రత్తగా ప్రయాణం చేస్తే ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని, ఓవర్ స్పీడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేయడం, సిట్ బెల్ట్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలను నడపడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలో 2023లో రోడ్డు ప్రమాదలలో 4.5లక్షల మంది మృత్యువాత పడ్డారని వివరించారు.ముఖ్యంగా యువత ఓవర్ స్పీడ్ తో వాహనాలను నడుపుతూ ప్రమాదలకు గురవుతున్నారని, ఓవర్ స్పీడ్ వెళ్లకుండా జాగ్రత్తగా వాహనం నడిపితే దాదాపు 50శాతం రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.సెల్ ఫోన్ నడుపుతూ వాహనాలను డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ ధరిస్తే ఆక్సిడెంట్ సమయంలో ప్రాణాలను నిలిచే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు వీటిని ఆచరణ చేస్తే చాలని, వీటితోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.ప్రయాణ సమయంలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ జాగ్రత్తగా ప్రమాద నివారణ చర్యలు తీసుకుంటే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉంటూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రాణాలను నిలుపుకోవాలని, ముఖ్యంగా డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ప్రాణాలకు కాపాడాలని సంకల్పం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ రోడ్డు ప్రయాణ సమయంలో భద్రతగా గమ్య స్థానాలకు చేరుకోవడమే అరైవ్ అలైవ్ లక్ష్యమని అన్నారు.జిల్లాలో దాదాపు 200కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు, 3600కిలో మీటర్ల మేరకు గ్రామీణ రోడ్లు విస్తరించి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా సూర్యాపేట జిల్లాలో రోడ్డు భద్రతపై వివిధ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం రోడ్డు ప్రమాదాలతో అనేక మంది చనిపోతున్నారని, 2023 సంవత్సరంలో 257 మంది, 2024 లో 278 మంది, 2025లో 230మంది, 2026 ఏప్రిల్ వరకు 78 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించినట్లు తెలిపారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రోడ్ సేఫ్టీ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి కోల్పోతే కుటుంబం అంత రోడ్డు మీద పడుతుందని కావున రోడ్డు ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ రోడ్డు సేఫ్టీ కమిటీ, మండల స్థాయిలో మండల రోడ్ స్టేఫ్టీ కమిటీ ఏర్పాటు చేసుకొని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 45 బ్లాక్ స్పాట్ లను గుర్తించి ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాలలోని రోడ్ల పై లోపాలను గుర్తిస్తే ప్రతి ఒక్కరూ భాధ్యతగా వాటి సమాచారం అందించాలని కోరారు. సిట్ బెల్ట్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయకూడదని గ్రామాలలో తీర్మానం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అరైవ్ అలైవ్ అద్భుతమైన కార్యక్రమం అని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి అన్నారు.జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద గణాంకాలు పరిశీలిస్తే ఆవేదన కలుగుతుందని అన్నారు.ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర పోలీస్ శాఖకు అభినందనలు తెలిపారు. అరైవ్ అలైవ్ అనేది ఒక పదం కాదు ఇది ఒక మహా ఉద్యమం అన్నారు.ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు రోడ్డు భద్రత నియమాల పట్ల విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.పోలీసు కళాబృందం నాటకం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ డిఐజి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్టీసీ డిఎం సునీత, ఆర్డీవో జయప్రకాశ్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు,మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు మున్సిపల్ కమిషనర్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా శ్యామ సుందర్



**హుజూర్‌నగర్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** భువనగిరి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎస్. శ్యామ సుందర్ ను హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమస్తూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు మునుపు సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన రాధాకృష్ణ చౌహాన్ పదోన్నతి పై బదిలీ కాగా అప్పటినుండి హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు పోస్టు ఖాళీగా ఉండగా కోదాడ సీనియర్ సివిల్ జడ్జి సురేష్ ఇన్చార్జి జడ్జిగా పనిచేస్తున్నారు. ఖాళీగా ఉన్న సీనియర్ సివిల్ జడ్జి పోస్టును నూతన జడ్జి నియామకముతో హైకోర్టు భర్తీ చేసింది. ఈనెల 25 వ తేదీ లోగా నూతన న్యాయమూర్తి తన బాధ్యతలను స్వీకరించాలని ఆ ఉత్తర్వులలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 14 మంది సీనియర్ సివిల్ జడ్జిల ను వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ. 9 కోట్లు మంజూరు



**మధిర, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** మధిర పట్టణ అభివృద్ధి దిశగా మరో ముఖ్యమైన అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క కృషితో మధిర రివర్ ఫ్రంట్ అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం 9 కోట్లు మంజూరు చేయడం జరిగింది. వైరా నది కరకట్ట పక్కన ఈ ప్రాజెక్టు అమలు ద్వారా మధిర పట్టణానికి కొత్త అందం రావడంతో పాటు ప్రజలకు విశ్రాంతి, వినోదం కోసం ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతూ, పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.మధిర అభివృద్ధి పట్ల నిరంతరం కృషి చేస్తున్న భట్టి విక్రమార్కకి మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాదం కృతజ్ఞతలు తెలిపారు.

## అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన మల్టీ జోన్-1 ఐజీ



**అశ్వారావుపేట, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట లో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన ఎరైవ్ – ఎలైవ్ అవగాహనా సదస్సు కు ఆయన హాజరై తిరుగు ప్రయాణం లో అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లోని సిబ్బంది పనితీరును, కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలపై వివరాలు తెలుసుకుని, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణను కట్టుదిట్టం చేయాలని, ప్రమాదాల తగ్గింపు కు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పోలీస్ సిబ్బంది ప్రజలకు సానుకూల సేవలు అందిస్తూ, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయన వెంట ఎస్పీ రోహిత్ రాజు, డీఎస్పీ సతీష్ కుమార్,సీఐ నాగరాజు రెడ్డి, అశ్వారావుపేట, దమ్మపేట ఎస్ హెచ్ ఓ లు,ఎస్ఐ లు యయాతి రాజు,సాయి కిశోర్ రెడ్డి, అఖిల లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాల పనులపై కలెక్టర్ పరిశీలన



**దమ్మపేట, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** దమ్మపేట మండలం పార్కలగండి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలను జిల్లా కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు.గృహాల నిర్మాణ పనుల పురోగతి,నాణ్యత,లబ్ధిదారులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్,వారి సమస్యలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు.గృహాల నిర్మాణ పనులు ఎటువంటి ఆలస్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర రెడ్డి,ఎంఆర్ఓ రామ్ నరేశ్, పార్కలగండి గ్రామ పంచాయతీ సెక్రటరీ సుజాత మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీని ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపీడీవో



**తుర్కపల్లి, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** తుర్కపల్లి మండలం మల్కాపురం గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీవో లెంకల గీతారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు .గ్రామంలో మంచినీళ్ల ట్యాంకులను పరిశీలించారు. వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సోన్నాయిల రఘు మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి ట్యాంకు మరమ్మత్తులు చేయించాలని కోరడంతో ఎంపీడీవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయి, గ్రామపంచాయతీ సిబ్బంది, పాల్గొన్నారు.

## కమ్మేటలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు



**చేవెళ్ల, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** కమ్మెట గ్రామం పరిధిలో చేవెళ్ల మున్సిపాలిటీకి కోసం డంపింగ్ యార్డుకు ప్రభుత్వం కేటాయించిన స్థలంను రద్దు చేయాలని, అక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కమ్మెట గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కమ్మెట గ్రామం వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కోరుతు చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామం గేట్ వద్ద గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు రిలే నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముంద్రిక పద్మమ్మ కృష్ణగౌడ్, మాజీ సర్పంచ్లు పట్లోళ్ల హన్మంత్ రెడ్డి, పెంటయ్య, మాజీ ఎంపిటీసీ జంగయ్య, పెంటయ్యలు మాట్లాడుతూ.. చేవెళ్ల మున్సిపాలిటీకి 18 వార్డులకు సంబంధించిన గ్రామాల చెత్తను చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామం పరిధిలో ఉన్న సర్వేనెంబర్ 222లో గల ప్రభుత్వ భూమి 3 ఎకరాల్లో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించుటకు చేవెళ్ల ఆర్డీవో, చేవెళ్ల తహసీల్దార్, ఉత్తర్వులు జారీ చేసి స్థలం కేటాయించారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని చెత్తను కమ్మెట గ్రామంలో డంపింగ్ యార్డు రూపంలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని డంపింగ్ యార్డు వద్దు అంటూ ముక్తకంఠంతో నినాదాలు చేశారు. గ్రామానికి సమీపంలో క్రీడా ప్రాంగణం, పల్లె ప్రకృతి వనం ఉన్న నేపథ్యంలో ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామ చెత్త నిర్వహణకు వేరే స్థలం ఉన్నప్పటికీ, మున్సిపల్ చెత్తను ఇక్కడికి తరలించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమలు అయితే దుర్వాసన, కాలుష్యం, వ్యాధుల వ్యాప్తి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి డంపింగ్ యార్డు ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ నెరవేర్చే వరకు నిరసనలు కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ దీక్షలో కమ్మెట ఉప సర్పంచ్ విష్ణు గౌడ్, వార్డు సభ్యులు బాలకృష్ణ, వెంకటేష్, దశరథ, సాయి, గ్రామస్తులు సురేందర్ గౌడ్, రామకృష్ణ అంజన్ గౌడ్, గోపాల్, వెంకటేష్, శ్రీశైలం, శ్రీను, పాండు, శేఖర్, నవాజ్‌రెడ్డి, మహేందర్, హన్మంతు, మన్మోహన్, గొల్లగూడ సర్పంచ్ చెవుల నిర్మలనర్సింలు, గొల్లగూడ ఉప సర్పంచ్ రాజేందర్ గౌడ్, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.శుక్రవారం మణుగూరు తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి పథకం ద్వారా వచ్చే ఆర్థిక లబ్దిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసిల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ టి. ప్రసాదరావు, సిఐ నాగబాబు, ఎస్సై శ్రావణ్ కుమార్, సిడిపిఓ జయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి తాతారావు, డీటి రామారావు ఆర్ ఐ గోపి, రమేష్, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు శివ సైదులు, పంచాయతీ సర్పంచులు ఉప సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద బాధితులను ఆస్పత్రికి తరలించిన వారికి రహవీర్ బహుమతులు

- ఎస్పీ శరత్ చంద్ర పవార్

**మిర్యాలగూడ, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ప్రమాద బాధితులను సరైన సమయంలో ఆసుపత్రికి తరలించిన వారికి రహవీర్ పథకం కింద నగదు బహుమతులు అందించనున్నట్టు జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. శుక్రవారం నాడు మిర్యాలగూడ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకి నిర్వహించిన అరైవ్ –అలైవ్ రోడ్డు భద్రత అవగాహన సదస్సులో స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి తో కలిసి పాల్గొనడం జరిగింది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లారీ డ్రైవర్లు,ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వాహనాలను నడపాలని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహవీర్ పథకం కింద నగదు బహుమతులను అందించనున్నట్లు తెలియజేశారు మొదటిసారి సహాయం చేసిన వారికి 25వేలు,రెండవసారి సాహాయం చేసిన వారికి 50 వేలు, 3 వ సారి చేసిన వారికీ లక్ష రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంట గోల్డెన్ అవర్ అని ఆ సమయం లో బాధితున్ని ఆసుపత్రికి తరలించినచో ప్రాణాలు కాపాడవచ్చు అని తెలియజేశారు. శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరుగుతుందని దానిని నియంత్రించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్ఏర్పాటు చేయడానికి సహకరిస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేఆధ్వర్యంలో మున్సిపల్ కాంప్లెక్స్ నందు నిర్వహిస్తున్నటువంటి ఉచిత పెరుగు అన్నం పంపిణి కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ పలువురికి పెరుగన్నం పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో డిఎస్పి రాజశేఖర్ రాజు, సిఐలు నాగభూషణరావు, సోమనరసయ్య, పి ఎన్ డి ప్రసాద్,డివిజన్ పరిధిలోని ఎస్సైలు, మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషా నవీన్,రైస్ మిల్లర్స్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## త్రివేణి విద్యార్థులను అభినందించిన కలెక్టర్



**ఖమ్మం, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, రోడ్డు భద్రత వారోత్సవాల కి సంబంధించి నిర్వహించిన వ్యాసరచన పోటీలలో త్రివేణి విద్యార్థులు వనీషా రెడ్డి, మెహక్ ముస్కాన్, సాకేత్ రామ్, లాస్య, చంద్ర సిద్దార్థ్ అత్యుత్తమ ప్రతిభ కనబరచి ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు, ఈ సందర్భంగా స్థానిక ఆర్టీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, మరియు నగర మేయర్ పునుకొల్లు నీరజ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసి వారిని అభినందించారు.విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు ఇటువంటి కార్యక్రమాల్లో ఎప్పుడు అత్యుత్తమ ప్రతిభ ని కనబరుస్తారనీ తెలియజేశారు. విజేతలైన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, తదితరులు అభినందించారు.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం




**పెన్‌పహాడ్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** సూర్యాపేట జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు భాగస్వాములు కావాలని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ ఎయిడ్ సంస్థ బాధ్యులు వగ్గు సోమన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మసీదు – ఏ – బిలాల్ లో అక్షయ తృతీయ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 పై ఖాజాలకు ,ముస్లిం పెద్దలకు అవగాహన కల్పించి బాల్య వివాహాలు వ్యతిరేకిద్దాం బాలికల హక్కులను కాపాడుదాం అని ముస్లిం మత పెద్దలతో సోమన్న ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఇమామ్ మౌలానా సాదత్ హుస్సేన్ కాస్మి, మత పెద్దలు షేక్ లతీఫ్, చాంద్ , షేక్ సైదులు, షేక్ గులాం,రహీమ్, అల్లి సాబ్, షేక్ సయ్యద్ , జానీ, బికం,ఖాదర్, జమాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఐడీఓసీలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని టీజీఈజేఏసీ డిమాండ్




**ఖమ్మం, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** జిల్లాలోని ఐడీఓసీ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం ఉద్యోగుల నిరసనతో కిక్కిరిసింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సంయుక్త వేదిక టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వంపై తమ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రం అందజేసినప్పటికీ స్పందన లేకపోవడంతో ఈ నిరసన చేపట్టినట్లు నాయకులు తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమం లేకుండా పరిపాలన సమర్థవంతంగా సాగదని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని, న్యాయమైన హక్కుల సాధన వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ ప్రకటించి అమలు చేయాలని, డీఏ బకాయిలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, ఈహెచ్‌ఎస్ మరియు ఆరోగ్య కార్డుల సమస్యలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ కుమారి శ్రీజకు టీజీఈజేఏసీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కొణిదెన శ్రీనివాస్, జెడ్.ఎస్. జైపాల్, సునీల్ రెడ్డి, మోదుగు వేలాద్రి, పారుపల్లి నాగేశ్వరరావు, ఎస్.కె. రంజాన్, కట్ట శేఖర్, రంగారావు, ఎలమద్ది వెంకటేశ్వర్లు, మేదరమట్ల సుబ్బయ్య, వేణు, వెంగళరావు, అలీ, పరిష పుల్లయ్య, యర్రా రమేష్, తాళ్లూరి శ్రీకాంత్, డాక్టర్ విజయ్ కుమార్, కోణార్, పెద్దినేని రాధాకృష్ణ, ప్రసాద్, గోపి, బిక్కు, రాజేష్, వెంకటేశ్వర్లు, కొమరగిరి దుర్గాప్రసాద్, వల్లపు ఎంకన్న, అస్లాం ఖాన్, వెంకటరమణ, కోడి లింగయ్య, రమణ యాదవ్, కృష్ణార్జున రావు, లలిత కుమారి, విజయ, మృదుల, రాధికా రెడ్డి, కోటపాటి రుక్మారావు, దిలీప్ కుమార్, శంకర్, విక్కిరాల శ్రీనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.




# అంబానీని దాటేసిన అదానీ..
# ఆసియాలో నం.1

**న్యూఢిల్లీ:**అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ ఆసియాలో అత్యంత సంపన్నుడిగా అవతరించారు. గత కొన్నేళ్లుగా ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీని గౌతమ్ అదానీ దాటేశారు. వీరిద్దరూ ప్రపంచ టాప్-20 అత్యంత సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకున్నట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్ ఇండెక్స్ పేర్కొంది.గౌతమ్ అదానీ సంపద 92.6 బిలియన్ డాలర్లు కాగా.. ముకేశ్ అబానీ సంపద 90.8 బిలియన్ డాలర్లుగా ఉంది. అదానీ గ్రూప్ స్టాక్స్ ఇటీవల పెరగడంతో అదానీ అత్యంత సంపన్న వ్యక్తిగా నిలిచారు. అదానీ పవర్ 1 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2 శాతం, అదానీ ఎనర్జీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌తో పాటు ఇతర కంపెనీల స్టాక్స్ నేటి ట్రేడింగ్‌లో లాభాల్లో కొనసాగుతున్నాయి. స్టాక్ ధరలు, వ్యాపార పనితీరు ఆధారంగా ఈ ర్యాంకులు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

మళ్లీ ఎలాన్ మస్క్

ఇక అంతర్జాతీయంగా చూసినప్పుడు.. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 656 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా నంబర్ 1 స్థానం దక్కించుకున్నారు. ల్యారీ పేజ్ (286 బిలియన్ డాలర్లు), జెఫ్ బెజోస్ (269 బి.డా), సెర్గే బ్రిన్ (266 బి.డా), మార్గ్ జుకర్‌బర్గ్ (239 బి.డా), ల్యారీ ఎల్లిసన్ (230 బి.డా), మిచెల్ డెల్ (170 బి.డా), జెన్‌సెన్ హువాంగ్ (164 బి.డా), బెర్నార్డ్ ఆర్నాల్ట్ (164 బి.డా), జిమ్ వాల్టన్ (150 బి.డా) టాప్-10 జాబితాలో ఉన్నారు. గౌతమ్ అదానీ 19, ముకేశ్ అంబానీ 20వ స్థానంలో కొనసాగుతున్నారు.భారత్ నుంచి లక్ష్మీ మిత్తల్, శివ్ నాడార్, షాపూర్ మిస్త్రీడ కుటుంబం, సావిత్రి జిందాల్, సునీల్ మిత్తల్‌డ కుటుంబం, అజీమ్ ప్రేమ్‌జీ, కుమార మంగళం బిర్లా, రాధాకృష్ణ ధమానీ బిలియనీర్ ఇండెక్స్‌లో కొనసాగుతున్నారు.





## భారత్‌లో నెలవారీ సంపాదన..
# ఆస్ట్రేలియాలో ఒక్క రోజులో

### భారతీయుడి వీడియో వైరల్

**న్యూఢిల్లీ:**మెరుగైన జీవనశైలి, ఉద్యోగం, ఎక్కువ జీతం కోసం అనేకమంది భారతీయులు విదేశాలకు తరలిపోతూ ఉంటారు. అలా ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ భారతీయుడు పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఆస్ట్రేలియాలో తన ఒక రోజు జీతం.. భారత్‌లో నెలవారీ సంపాదనకు సమానమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుదీర్ఘ పని గంటల గురించి మాట్లాడారు. ప్రస్తుతం ఇవి నెట్టింట తీవ్ర చర్చకు దారితీశాయి. భారతీయ మూలాలున్న రవీందర్ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఇటీవల ఓ పోస్టు పెట్టారు. అందులో ఆయన మాట్లాడుతూ.. ఉదయం 7 గంటలకు తాను వర్క్ మొదలుపెడితే.. పూర్తయ్యేసరికి అర్ధరాత్రి అవుతుందన్నారు. అయినా, తన శరీరం అలసి పోదన్నారు.



రోజుకు 650- 700 ఆస్ట్రేలియా డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.46వేలు) సంపాదిస్తానని వివరించారు. భారత్‌లో ఒక నెలంతా పనిచేసి తాను ఒకప్పుడు సంపాదించే మొత్తాన్ని.. ఇప్పుడు ఒక్క రోజులోనే సంపాదిస్తున్నానని తెలిపారు. ఈ ఒక్కరోజు జీతంతో తన ఇంటి కోసం నెల రోజులకు సరిపడా నిత్యావసర సరకులు కొనగలనని వివరించారు. ఈ సందర్భంగా భారత్ నుంచి బయటకు వచ్చి.. అవకాశాలు అన్వేషించాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. విదేశాల్లో కష్టపడి పనిచేసి.. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని కోరారు. రవీందర్ వ్యాఖ్యలపై నెటిజన్లు విభిన్నంగా స్పందిస్తున్నారు. కొందరు ఆయన్ను సమర్థిస్తూ కామెంట్‌లు పెడుతుండగా.. మరికొందరు విదేశాల్లోని సవాళ్లను ప్రస్తావిస్తున్నారు. 'విదేశాల్లో ఆదాయం ఎక్కువే కన్పిస్తుంది. కానీ, ఖర్చులు, పన్నులు కూడా అధికంగానే ఉంటాయి' అని ఓ నెటిజన్ కామెంట్ చేశారు. 'ప్రతిఒక్కరి ప్రయాణం భిన్నంగా ఉంటుంది. అందరూ ఈ జీవనశైలిని అలవాటు చేసుకోలేరు' అని మరో నెటిజన్ రాసుకొచ్చారు.

## బంగారం, వెండి దిగుమతుల కోసం
# 15 బ్యాంకులకు కేంద్రం అనుమతి

దిల్లీ: ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ వంటి 15 బ్యాంకులకు బంగారం, వెండి దిగుమతులు చేసుకోవడానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2029 మార్చి 31 వరకు మూడేళ్ల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయి. యూనియన్ బ్యాంక్, స్బెర్ బ్యాంకులకు కేవలం బంగారం మాత్రమే దిగుమతి చేసుకోవడానికి అనుమతించింది. యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, డాయిష్ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్ట్రియల్ అండ్ కమర్షియల్ బ్యాంక్ ఆఫ్ చైనా లిమిటెడ్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యెస్ బ్యాంక్ లిమిటెడ్ ఈ జాబితాలో ఉన్నాయి.అంతకుముందు భారతీయ బ్యాంకులు బంగారం, వెండి దిగుమతులను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. బులియన్ దిగుమతులకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో టన్నుల కొద్దీ లోహాలకు కస్టమ్స్ క్లియరెన్స్ లభించలేదని పలు మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2025 ఏప్రిల్‌లో చివరగా ప్రభుత్వం ఈ దిగుమతులకు అధికారిక అనుమతులు ఇవ్వగా.. మార్చి 31తో వీటికి గడువు పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వుల కోసం బ్యాంకులు ఎదురుచూస్తున్న వేళ మూడేళ్ల పాటు దిగుమతులకు అనుమతిస్తూ కేంద్రం నుంచి నోటిఫికేషన్ రావడం గమనార్హం.

# జియో ఐపీఓ..
## మే నెలలో సెబీకి ముసాయిదా పత్రాలు!

ముంబయి: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన డిజిటల్ సేవల సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన ముసాయిదా పత్రాలను మే నెలలో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మార్చి నెలతో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన గణాంకాలతో ఈ ముసాయిదా పత్రాలను సమర్పించే అవకాశం ఉందని సమాచారం.వాస్తవానికి, జియో ఐపీఓకు సంబంధించిన పత్రాలను మార్చి నెలాఖరుకల్లా సమర్పించాలని తొలుత భావించారు. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి సంబంధించిన గణాంకాలతో ఐపీఓ పత్రాలు దాఖలు చేయాలనుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఇరాన్-అమెరికా యుద్ధం రూపంలో ఐపీఓ సన్నాహాలకు బ్రేక్ పడింది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో పబ్లిక్ ఇష్యూ ప్రయత్నాలు వాయిదా పడ్డాయి.రిలయన్స్ ఇండస్ట్రీస్ గ్రూపు నుంచి సుమారు 20 ఏళ్ల తర్వాత జియో ప్లాట్‌ఫామ్స్ రూపంలో ఒక సంస్థ ఐపీఓకు వస్తోంది. ఇది దేశంలోని మెగా ఐపీఓల్లో ఒకటిగా నిలిచే అవకాశం ఉంది. కంపెనీ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.78 లక్షల కోట్లు)గా ప్రతిపాదించారు. ఐపీఓ ద్వారా జియోలో 2.5% వాటా విక్రయించినా సుమారు రూ.40,000 కోట్లు సమీకరించొచ్చని అంచనా వేస్తున్నారు.

## ప్రపంచంలోనే తొలి ఏయిర్ ట్యాక్సీ స్టేషన్ సిద్ధం

ప్రపంచవ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న రద్దీ దృష్ట్యా ఎయిర్‌టాక్సీలు అందుబాటులోకి తీసుకురావడానికి అనేక దేశాలు కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయి. త్వరలో తమ పౌరులకు ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు దుబాయ్ ప్రకటించింది. ఇందు కోసం ప్రత్యేకంగా ప్రపంచంలోనే తొలి ఎయిర్‌ట్యాక్సీ స్టేషన్‌ను నిర్మించింది. ఈ విషయాన్ని దుబాయ్ యువరాజు హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రకటించారు. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయ సమీపంలో నిర్మించిన స్టేషన్ ఈ ఏడాది చివరికి ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది.3,100 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఎయిర్‌ట్యాక్సీ స్టేషన్ నిర్మాణం ఏటా 1,70,000 మంది ప్రయాణించడానికి వీలుగా సౌకర్యాల కల్పన కార్లలో సుమారు 45 నిమిషాలు పట్టే సమయంతో పోలిస్తే ఎయిర్ ట్యాక్సీల్లో కేవలం 10 నిమిషాల్లోనే గమ్యస్థానానికి చేరే అవకాశం.రెండు ల్యాండింగ్ ప్యాడ్‌లు, ఎలక్ట్రిక్ విమానాల కోసం ఛార్జింగ్ పాయింట్లు, రెండు-స్థాయుల కార్ పార్కింగ్‌వంటి సౌకర్యాలు అందుబాటులో అర్బన్ ఎయిర్ ట్యాక్సీ సేవలతో పాటు కార్గో, లాజిస్టిక్స్, మెడికల్, ఎమర్జెన్సీ సేవల కల్పనకు అవకాశం నాలుగు స్టేషన్ల నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ఎయిర్ స్టేషన్‌ను నిర్మించినట్లు అధికారులు వెల్లడించారు. 2026 చివరికి డౌన్‌టౌన్ దుబాయ్, పామ్ జుమేరా, దుబాయ్ మెరీనాలలోనూ ఎయిర్ స్టేషన్ల నిర్మాణం పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నూతన, సుస్థిరమైన రవాణా విధానాలను అవలంబించడంలో భాగంగా ఈ చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్టును స్కైపోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దుబాయ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నగరాల మధ్య ప్రయాణ సమయాలను



గణనీయంగా తగ్గించడానికి ఎయిర్ టాక్సీ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

ఎయిర్ ట్యాక్సీలు అంటే..

ప్రస్తుతం సరకు రవాణాకు ఉపయోగపడుతున్న డ్రోన్ల కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉండే క్వాడ్ కాప్టర్ల వంటి వాటిని ఎయిర్ టాక్సీలు అంటారు. ఇవి ఆకాశమార్గంలో ఇద్దరి నుంచి ఆరుగురిని స్వల్ప దూరాలకు తీసుకెళ్లగలవు. తక్కువ సమయంలో గమ్యాన్ని చేరుకోవటానికి ఈ సేవలు ఉపయోగపడతాయి.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.37 | ₹ 4.32 |

### బంగారం ధరలు (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 1,40,100 (22 క్యారెట్లు) | ₹ 1,52,840 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్

₹ 2,65,000

# ఫారెక్స్ నిల్వలే మనకు రక్ష

### ప్రపంచంలోనే ఆరో స్థానంలో భారత్
### సంక్షోభాల్లో కవచం అవే

**న్యూఢిల్లీ:**ప్రస్తుత ఇరాన్ యుద్ధ సమయంలోనూ దన్ను ఏ దేశానికైనా అంతర్జాతీయ అనిశ్చితుల నుంచి ప్రథమ రక్షణ కల్పించేవి విదేశీ మారకపు (ఫారెక్స్) నిల్వలే. గతంలో అంతర్జాతీయ సంక్షోభ సమయంలోనైనా, ప్రస్తుతం పశ్చిమాసియా ఉద్రిక్తతల్లోనైనా భారత్‌కు, అనిశ్చితులకు మధ్య గోడలా నిలిచినవి అవే. పెరుగుతున్న ముడి చమురు ధరలు కాస్తా దిగుమతి బిల్లును భారం చేస్తుంటే ఫారెక్స్ నిల్వలు దన్నుగా నిలిచాయి. ఇవి ఒక ఆర్థిక బఫర్‌లా పనిచేశాయి. కరెన్సీ స్థిరత్వాన్ని అందిస్తూనే, విదేశీ రుణ వాయిదాల చెల్లింపునకు మద్దతుగా నిలిచాయి. ఫారెక్స్ నిల్వల పరిమాణాన్ని బట్టే మదుపర్ల విశ్వాసమూ ఉంటుంది. అంటే ఎంత ఎక్కువ ఫారెక్స్ నిల్వలుంటే ఆర్థిక బలంలో ఆ దేశ స్థానం అంత బలంగా ఉన్నట్లు లెక్క.

11 నెలల దిగుమతులకు సరిపడా..

ప్రపంచ స్వర్ణ మండలి(డబ్ల్యూజీసీ) గణాంకాల ప్రకారం.. 2025 మూడో త్రైమాసికం చివరకు ప్రపంచంలోనే అత్యధిక ఫారెక్స్ నిల్వలున్న ఆరో దేశంగా భారత్ ఉంది. మన దేశానికి ఫారెక్స్ నిల్వల దన్ను ఉందని ఈ ఏడాది ఆర్థిక సర్వే సైతం ఉద్ఘాటించింది. జనవరి 2026 నాటికి 11 నెలల పాటు దిగుమతులకు సరిపడా ఫారెక్స్ నిల్వలు మనదగ్గర ఉన్నాయని సర్వే తెలిపింది. పలు దశాబ్దాలుగా పెంచుకుంటూ వస్తున్న ఫారెక్స్ నిల్వల వల్ల భారత్ ఎప్పుడూ బలంగానే నిలుస్తూ వచ్చింది.

చెల్లింపుల సంక్షోభం నేర్పిన పాఠంతోనే..

స్వాతంత్ర్యం వచ్చాక ఎన్నో ఏళ్ల తర్వాత కానీ ఫారెక్స్ నిల్వలను భారత్ పెంచుకోలేదు. 1991-92 నాటికి మన దగ్గర ఉన్నది 9 బి.డాలర్ల నిల్వలే. ఆ సమయంలో కేవలం రెండు వారాల దిగుమతులకు సరిపడా నిల్వలే ఉన్నాయి. చెల్లింపుల సంక్షోభాన్ని ఎదుర్కొందీ అపుడే. ఈ సంక్షోభమే మనల్ని విధానాల మార్పు దిశగా అడుగులు వేసేలా చేసింది. ఆర్థిక సరళీకరణల వల్ల 2000 ప్రారంభంలో మూలధన



నిధులను భారత్ ఆకర్షించడం ప్రారంభించింది. దీంతో 2000-01లో 42 బి.డాలర్లుగా ఉన్న నిల్వలు కాస్తా మూడేళ్లలోనే మూడింతలై 113 బి.డాలర్లకు చేరాయి. పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు పెరగడంతో 2005-06 నాటికి 152 బి.డాలర్లకు చేరి, 2007-08 కల్లా 300 బి.డాలర్లను అధిగమించాయి. చాలా తక్కువ సమయంలో రెట్టింపయ్యాయి. 2008 అంతర్జాతీయ సంక్షోభ సమయంలో వాటిని ఉపయోగించుకునే నిలబడ్డాం. దీంతో అవి 252 బి.డాలర్లకు తగ్గినా, 2010-11 కల్లా 305 బి.డాలర్లకు పెంచగలిగాం. అన్నిటికంటే మించి కరోనా సమయంలో భారీ స్థాయిలో ఫారెక్స్ నిల్వలను పెంచుకున్నాం. 2019-20లో 478 బి.డాలర్ల నుంచి 2020-21 కల్లా 577 బి.డాలర్లకు, 2021-22 కల్లా 607 బి.డాలర్లకు చేర్చాం. ఫిబ్రవరి 2026లో 728.49 బిలియన్ డాలర్ల గరిష్ఠ స్థాయికి చేరాయి. అవే ఇపుడు ఊగిసలాటల నుంచి కాపాడాయి.

**ఇవి సరిపోతాయా?**

ప్రస్తుతం 700 బి.డాలర్ల (సుమారు రూ.65 లక్షల కోట్లు)కు అటూ ఇటూగా ఫారెక్స్ నిల్వలున్నాయి. ఇవి 'సరిపోతాయా' అని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌బీఐ భావిస్తోంది. ఊగిసలాటలను అరికట్టేందుకు ఆర్‌బీఐ జోక్యం కొనసాగుతుందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా అంటున్నారు. మూడు దశాబ్దాల కిందటైతే ఈ హామీ లభించేది కాదు. 10-11 నెలల పాటు సరిపోయే విదేశీ మారకపు నిల్వలుండడం భారత్‌ను బలంగా మారుస్తోందని పీడబ్ల్యూసీ ఇండియా బలంగా మారుస్తోందని పీడబ్ల్యూసీ ఇండియా పార్టనర్-లీడర్ రణేన్ బెనర్జీ అంటున్నారు. ఇటీవల కొంత ఒత్తిడి అయితే కనిపిస్తోంది. ఒక వారం వ్యవధిలోనే 11.4 బి.డాలర్ల మేర నిల్వలు తగ్గాయి. బలహీన రూపాయికి తోడు, విదేశీ మదుపర్ల అమ్మకాలు ఇందుకు కారణం. చమురు ధరలు పెరగడం, రవాణా వ్యయాలు పైకెళుతుండడంతో భారత దిగుమతి బిల్లు భారంగా మారింది. ఈ నేపథ్యంలో ఫారెక్స్ నిల్వలను కనీసం 12 నెలలకు సరిపడా పెంచుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

## ట్రంప్ గాల్లో మేడలు కడుతున్నారు: ఇరాన్

టెహ్రాన్:అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గాల్లో మేడలు కడుతున్నారని ఇరాన్ మీడియా వెక్కిరించింది. ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలపై సెటైర్లు వేసింది. ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌తో త్వరలో ఓ ఒప్పందం కుదరనుందని తెలిపారు. దీంతో వారు మాకు ఉచితంగా చమురు, హర్మూజ్ జలసంధిని అందించనున్నారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వ మీడియా ఎగతాళి చేసింది. ట్రంప్ మాట్లాడుతున్న వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసింది. దీనికి 'అమెరికా అధ్యక్షుడు గాల్లో మేడలు కడుతున్నారు' అని పేర్కొంది. ఈ సందర్భంగా ట్రంప్ ఎక్కువగా ఊహించుకుని, తప్పులకు పాల్పడుతున్నారనే ఉద్దేశం వచ్చేలా ఒక సామెతను కూడా అది ప్రస్తావించింది.శుద్ధి చేసిన యురేనియం (ఇనితీతిఇఞ్రవట జతీజీనితిబీఎ) నిల్వలను తమకు అప్పగించేందుకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఇరాన్ ఈ వాదనలను కొట్టిపారేసింది. ఇప్పటివరకు అలాంటి ఒప్పందం ఏదీ జరగలేదని ఇరాన్ పార్లమెంటరీ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబఫ్ సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ట్రంప్ మరో అబద్ధపు ప్రకటన చేశారని తెలిపాయి. అలాంటి పెద్ద పురోగతి ఏదీ సాధించలేదని.. ఇరాన్ షరతులన్నింటికీ అమెరికా అంగీకరిస్తేనే చర్చలు కొనసాగుతాయని స్పష్టంచేశాయి.



## ఇది ముమ్మాటికీ మహిళాబిల్లు కాదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):మహిళా రిజర్వేషన్ల అమలుకు ఉద్దేశించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన అనంతరం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తాము వ్యతిరేకం కాదన్నారు. మహిళా బిల్లుతో డీలిమిటేషన్‌ను ముడిపెట్టారని, ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లు ముమ్మాటికి మహిళా బిల్లు కాదని తెలిపారు. "ఇది రాజ్యాంగంపై జరిగిన దాడి. దీనిని మేం ఓడించాం. ఇది చాలా సంతోషించదగ్గ విషయం. మేం చాలా స్పష్టంగా చెప్పాం ఇది మహిళా బిల్లు కాదు. ఇది భారతదేశ రాజకీయ నిర్మాణాన్ని, ఎలక్టోరల్ స్ట్రక్చర్‌ను మార్చేందుకు చేస్తున్న ప్రయత్నం. దీనిని మేం అడ్డుకున్నాం. నేను ప్రధానమంత్రికి ఇప్పుడే చెబుతున్నా మీకు నిజంగా మహిళా బిల్లు కావాలంటే, 2023 నాటి మహిళా బిల్లును బయటకు తీయండి. దానిని ఈరోజు నుంచే అమలు చేయండి. ప్రతిపక్షం అంతా మీకు వంద శాతం మద్దతు ఇస్తుంది. ఆ మహిళా బిల్లును మేం వెంటనే అమలయ్యేలా చూస్తాం." అని రాహుల్ గాంధీ అన్నారు.అంతకుముందు చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు.

## కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్లమెంటులో ఎన్‌డీఏ నేతల సమావేశం ముగిసింది. అయితే, బిల్లుల విషయంలో విపక్షాల తీరుపై ఎన్‌డీఏ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. తృణమూల్, డీఎంకే, సమాజ్‌వాదీ తీరును ప్రజల్లో ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు.లోక్‌సభలో అత్యంత విచిత్రమైన దృశ్యం ఆవిష్కృతమైందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బిల్లును కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ అడ్డుకున్నాయని చెప్పారు. అయితే, మహిళా బిల్లును అడ్డుకుని ప్రతిపక్షాలు సంబరాలు చేసుకుంటున్నాయని షా విమర్శించారు. బిల్లును అడ్డుకుని గెలిచామని నినాదాలు చేయడం అత్యంత హేయమైన చర్య అన్నారు. మహిళలకు దక్కాల్సిన 33 శాతం రిజర్వేషన్లు అడ్డుకున్నారని, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఇలా చేయడం ఇదే తొలిసారి కాదని ఆయన గుర్తు చేశారు.మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం అత్యంత దారుణమని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇదొక చీకటి రోజని, బిల్లును వ్యతిరేకించిన వారికి చీకటి రోజులు దగ్గర పడ్డట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో మహిళా ఎంపిలు ఆందోళనకు దిగారు.



## ఇరాన్ షాహెద్ డ్రోన్లకు పోటీగా అమెరికా
# 'తేనెపిట్టలు'..!

**వాషింగ్టన్:**ఇరాన్‌తో యుద్ధం తొలినాళ్లలో భారీగా సైనిక నష్టాన్ని చవిచూసిన అమెరికా.. కాస్త ఆలస్యంగానైనా దాన్నుంచి తేరుకుంది. ఇరాన్ షాహెద్ డ్రోన్లకు విరుగుడుగా 'మెరోప్స్' ఇంటర్‌సెప్టర్ డ్రోన్లను రంగంలోకి దించింది. ఈ విషయాన్ని తాజాగా అమెరికా సైనిక కార్యదర్శి డేనియల్ డ్రిస్కాల్ తమ దేశ కాంగ్రెస్ ఎదుట వెల్లడించారు. ఇతర ఇంటర్‌సెప్టర్ వ్యవస్థలతో పోలిస్తే చాలా చౌకగా లభించే ఈ 'తేనెపిట్టలు'.. అగ్రరాజ్యంపై యుద్ధ భారాన్ని భారీగానే తగ్గించాయట..!ఇరాన్ తో యుద్ధం మొదలైన దాదాపు వారం రోజుల్లో తాము 13వేల 'మెరోప్స్'ను తయారీ కంపెనీల నుంచి కొనుగోలు చేసినట్లు కాంగ్రెస్ విచారణలో డేనియల్ వెల్లడించారు. "ఇవి చాలా అద్భుతంగా పని చేస్తున్నాయి. ప్రస్తుతం వీటి ధర 15వేల డాలర్ల వరకు ఉంది. ఎక్కువ మొత్తంలో కొంటే ఇంకా తక్కువ ధరకే లభిస్తాయి. దాంతో షాహెద్ డ్రోన్లను కూల్చేందుకు మాకు 30వేల డాలర్ల నుంచి 50వేల డాలర్ల లోపే ఖర్చవుతుంది. దీనివల్ల వ్యయాన్ని చాలావరకు తగ్గించుకుంటున్నాం" అని అమెరికా సైనిక కార్యదర్శి తెలిపారు. తొలుత వీటిని ఉక్రెయిన్‌లో వినియోగించగా.. మంచి ఫలితాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. దాదాపు నెల క్రితమే 10,000 'మెరోప్స్' డ్రోన్లను పశ్చిమాసియాకు తరలించినట్లు తెలిపారు.వాస్తవానికి ఇరాన్ షాహెద్ డ్రోన్లను అడ్డుకునేందుకు తొలుత అమెరికా 'పేట్రియాట్' వంటి ఖరీదైన క్షిపణులను వినియోగించాల్సి వచ్చింది. వీటి ధర రూ.కోట్లల్లో ఉండటంతో ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఇక, 'కోయోట్' లాంటి డ్రోన్ ఇంటర్‌సెప్టర్లు అమెరికా వద్ద ఉన్నా.. 'మెరోప్స్'తో పోలిస్తే వాటి ధర దాదాపు 10 రెట్లు ఎక్కువగా ఉంది. దీంతో ఖర్చు భారాన్ని దృష్టిలోఉంచుకొని అగ్రరాజ్యం 'మెరోప్స్'ను కొనుగోలు చేసింది.

అయితే, వీటిలో ఎన్నింటిని పశ్చిమాసియాలో ఉపయోగించారు? ఇవి ఎన్ని షాహెద్ డ్రోన్లను కూల్చేశాయన్న వివరాలను మాత్రం డేనియల్ వెల్లడించలేదు.'మెరోప్స్' అనేది ఏఐ ఆధారిత యాంటీ డ్రోన్ వ్యవస్థ. యూఎస్ 'ప్రాజెక్ట్ ఈగల్'లో భాగంగా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చిన్న సైజులో ఉండటంతో పికప్ ట్రక్కు వెనకాల సులువుగా వీటిని అమర్చుకోవచ్చు. షాహెద్ లాంటి వన్‌వే అటాక్ డ్రోన్లను ఇవి సమర్థవంతంగా అడ్డుకోగలవు. వీటిల్లోని ప్రొపెల్లర్ ఆధారిత సర్వేయర్లు మూడు అడుగుల పొడవు ఉంటాయి. ఇవి గంటకు 175 మైళ్ల వేగంతో ప్రయాణించగలవు. ఈ సర్వేయర్లు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి.. ప్రత్యర్థి డ్రోన్లను నేరుగా ఢీకొట్టి పేల్చేస్తాయి. లేదా ఆ డ్రోన్లపై బాంబులను ప్రయోగించి వాటిని కూల్చేస్తాయి. శాటిలైట్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ వ్యవస్థలు అందుబాటులో లేని సమయంలో కృత్రిమ మేధ సాయంతో మెరోప్స్ ప్రయాణించి లక్ష్యాన్ని ఛేదిస్తాయి. ఇవి ఆటోమేటెడ్ విధానంలోనూ పనిచేయగలవు.

# 19వ వార్డులో 20 రోజులుగా మంచినీటి ఎద్దడి

- మున్సిపల్ అధికారులు కబుర్లు చెబుతున్నారే తప్ప సమస్య పరిష్కరించడం లేదు
- సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు
- కౌన్సిలర్ సుగూరు మురళి సాగర్ హెచ్చరిక



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 17 జనంసాక్షి :** వనపర్తి పట్టణంలోని 19వ వార్డులో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గత 20 రోజులుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ సుగూరు మురళి సాగర్ ఆరోపించారు. ఈ విషయాన్ని గత 20 రోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు సమస్య పరిష్కరించకపోవడం అత్యంత ఖండనీయమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, వార్డులోని వన్ హెచ్‌పి మోటారు పాడైపోయిందని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ఒకవైపు వేసవి దాహంతో ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతుంటే, మున్సిపల్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు సమస్య పరిష్కరించకపోతే వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.
మున్సిపల్ తీరుతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాలకవర్గానికి చీమైనా కొట్టినట్లు లేదని తీవ్రంగా విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్నది అలంకార ప్రాయం కోసం కాదని, ప్రజల సమస్యలు తీర్చేందుకే అని గుర్తు చేశారు. ఇప్పటికైనా తక్షణమే మున్సిపల్ శాఖ స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### అనాథ చిన్నారుల విద్య, వైద్య బాధ్యతలు
# స్వీకరించిన డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి

- తల్లిదండ్రులను కోల్పోయిన సోదరులను ఆదుకున్న మానవతా దృక్పథం
- పూర్తి విద్యా, వైద్య ఖర్చులు భరిస్తానని హామీ



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన ఇద్దరు అనాథ చిన్నారులను ఆదుకునేందుకు కరీంనగర్ వన్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ మర్రి మహేష్ రెడ్డి ముందుకొచ్చారు. తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆదిత్య, శ్రీనివాస్ అనే ఇద్దరు సోదరుల దైన్య స్థితిని తెలుసుకుని ఆయన మానవత్వాన్ని చాటుకున్నారు. బాధితుల ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని సమీక్షించిన డాక్టర్, ఆ పిల్లల పూర్తి విద్యా, వైద్య ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న చిన్నారులను అక్కున చేర్చుకున్న డాక్టర్ మహేష్ రెడ్డి ఉదారతపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల పట్ల చూపిన ఈ మానవతా దృక్పథం సమాజంలో సానుకూల సందేశాన్ని పంపుతోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మర్రి మహేష్ రెడ్డితో పాటు చిన్నారులు ఆదిత్య, శ్రీనివాస్, సర్పంచ్ పురం రాజేశం మాధవి, ఉపసర్పంచ్ చంద్రశేఖర్, సురేష్, పొద్దుపొడుపు శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత – సామాజిక బాధ్యత

### ప్రతి ప్రాణం విలువైందే.. 'అరైవ్ అలైవ్' లక్ష్యంగా ముందుకు సాగాలి

- రోడ్డు ప్రమాదాలు హత్యల కంటే ఎక్కువ మరణాలు
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం అలవాటు చేసుకోవాలి



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** వాహనం పై ప్రయాణించే ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ ఇళ్లకు చేరుకోవాలనే ప్రధాన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఒక సామాజిక ఉద్యమంగా చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య కంటే రోడ్డు ప్రమాదాలే అతిపెద్ద సవాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది రాష్ట్రంలో హత్యల వల్ల 800 మంది ప్రాణాలు కోల్పోగా, రోడ్డు ప్రమాదాల వల్ల ఏకంగా 7500 మంది మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు.
డీజీపీ మాట్లాడుతూ, సామాజిక ఉద్యమంగా రోడ్డు భద్రత అనేది కేవలం పోలీస్, రవాణా శాఖల బాధ్యత మాత్రమే కాదని, వార్డు మెంబర్ నుండి ముఖ్యమంత్రి వరకు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారని తెలిపారు. అందుకే మొదటిసారిగా పోలీస్ శాఖ కార్యక్రమాన్ని 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో చేర్చడం జరిగిందన్నారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాల్లో 70% మరణాలు ద్విచక్ర వాహనదారులవే ఉంటున్నాయని, బైక్ నడిపే వారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, తప్పనిసరిగా స్ట్రాప్ పెట్టుకోవాలని సూచించారు. స్ట్రాప్ లేకపోతే ప్రమాద సమయంలో హెల్మెట్ ఎగిరిపోయి ప్రాణాపాయం సంభవిస్తుందని హెచ్చరించారు. హెల్మెట్ పెట్టుకుంటే వెంట్రుకలు ఊడిపోతాయనేది కేవలం అపోహ మాత్రమేనని, తన వ్యక్తిగత ఉదాహరణతో వివరిస్తూ నవ్వులు పూయించారు. హెల్మెట్ ధరించడం అనేది ప్యాంటుకు బెల్టు పెట్టుకున్నంత సహజంగా అలవరచుకోవాలని కోరారు. ఫోర్ వీలర్ వాహనాల్లో ప్రయాణించే అందరూ సీట్‌బెల్ట్ ధరించాలి. సీట్‌బెల్ట్ పెట్టుకుంటేనే ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగులు తెరుచుకుంటాయని, ప్రయాణికులు వాహనం వెలుపల పడకుండా రక్షణ లభిస్తుందని వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ఓవర్ కాన్ఫిడెన్స్‌తో డ్రైవింగ్ చేయడం వంటి కారణాల వల్ల ఎన్నో కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయి వీధిన పడుతున్నాయని ఉదాహరణలతో వివరించారు.
వాహనదారులు ఎల్లప్పుడూ పరిసరాలను గమనిస్తూ 'డిఫెన్సివ్ డ్రైవింగ్' చేయాలని, ముఖ్యంగా స్కూళ్లు, గ్రామాల జంక్షన్ల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. పాదాచారులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, వారు ఎల్లప్పుడూ వాహనాలు వచ్చే ఎదురు దిశలో నడవాలని తెలిపారు. చివరగా, మైనర్లకు వాహనాలు ఇచ్చి వారి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. లైసెన్స్ వచ్చిన తర్వాతే పిల్లలకు వాహనాలు ఇవ్వాలని, విద్యార్థులు బైకుల కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తేవద్దని కోరారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, అరైవ్ అలైవ్ కార్యక్రమం అనేది తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి మానసపుత్రిక అన్నారు. గత డిసెంబర్ నెలలో ప్రారంభమైన ఈ కార్యక్రమం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో మూడు దశల్లో విజయవంతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కేవలం కరీంనగర్‌లో ఇప్పటివరకు 600 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు అశ్విని, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎంవీఐ చక్రవర్తి, ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకట రమణతో పాటు ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో కుళ్ళిన స్థితిలో శవం

**మల్కాజిగిరి ఏప్రిల్ 17(జనంసాక్షి) :**
నేరెడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జెకె కాలనీలో తాళం వేసి ఉన్న ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయిన స్థితిలో ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానికులు, సిఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం జేకే కాలనీలో ఉన్న ఒక ఇంట్లో గత కొంతకాలంగా ఓ వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు.గత మూడు నెలలుగా ఆ ఇంటికి తాళం వేసి ఉంది. అటు అద్దె రాకపోవడం, ఇటు అద్దెదారుడు అందుబాటులో లేకపోవడంతో ఇంటి యజమానికి అనుమానం కలిగింది. దీంతో శుక్రవారం ఇంటి యజమాని వచ్చి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా, వంటగదిలోని సింక్ బండ కింద గుర్తు తెలియని మృతదేహం కనిపించింది.
మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండటంతో అది పురుషుడిదా లేక మహిళదా అన్నది ప్రాథమికంగా గుర్తించలేకపోయారు. ఇంటి యజమాని ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసుకొని లోతుగా దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీజీఈ జేఏసీ వినతి

**సిరికొండ:** రాష్ట్ర ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీజీఈజేఏసీ) ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ రవీందర్ రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ జూన్ 2 నాటికి పిఆర్సీ అమలు చేయాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలు చేసి హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఉద్యోగుల హక్కుల కోసం గర్జించిన కరీంనగర్ జేఏసీ



**కరీంనగర్ బ్యూరో/ టౌన్ ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవ్, మెడికల్ బిల్లులు, ఇన్సూరెన్స్, జీపీఎఫ్ వంటి హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 01-07-2023 నుండి అమలు కావాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాకపోవడం, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండటం వల్ల ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.
ఓపీఎస్ పునరుద్ధరణ, హెల్త్ కార్డు అమలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు వినతిపత్రం సమర్పించగా, దాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళిచరణ్, కటకం రమేష్, పేంద్యల కేశవ రెడ్డి, పిఆర్టియు కరుణాకర్ రెడ్డి, తిరుపతిరావు, జావిద్, రామ్మోహన్, ఆడేపు శ్రీనివాస్, కోట శ్యాం కుమార్, రేకం శంకర్, జయపాల్ రెడ్డి, సుంకిశాల ప్రభాకర్ రావు, చకినాల రామ్మోహన్, జాలి మహేందర్ రెడ్డి, చంద్రమౌళి, చింతపల్లి అశోకరావు, గోనె శ్రీనివాస్, ఎండి సలీం, దోనికేన సునీల్ కుమార్, చంద్రశేఖర్, ఆంజనేయరావు, సత్యనారాయణ రెడ్డి, గడ్డం సుధాకర్, డా. అరవింద్ రెడ్డి, సర్దార్ హర్మీందర్ సింగ్, కిరణ్ కుమార్, శారద, సునీత, సబిత సరిత, కోట రామస్వామి, శంకర్, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, జలాలోద్దీన్ అక్బర్, శైలజ, వీణ, సుస్మిత, మారుపాక రాజేష్, భరద్వాజ్, పూలు కిషన్, వాస్తవి గౌడ్, కోమ్మెర శ్రీనివాసరెడ్డి, విజయ్ కుమార్, వెలిచాల సుమంతరావు, అజ్గర్ అలి, లవ కుమార్, కమలాకర్, కరుణాకర్, నగేష్ గౌడ్ పాల్గొన్నారు

# మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

- రైతుల నష్టాలు తగ్గించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్
- ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి



**కోరుట్ల, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** భూ సమస్యలు పరిష్కరించాలని, వెంటనే మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
కోరుట్ల స్థానిక బీట్ మార్కెట్‌లో తెలంగాణ రైతు సంఘం జగిత్యాల జిల్లా ముఖ్య బాధ్యుల సమావేశం లకావత్ మహిపాల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా 1.85 లక్షల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. నియోజక వర్గ వ్యాప్తంగా 73 వేల ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. అదేవిధంగా అనేక వేల ఎకరాలలో వరి పంటను సాగు చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా మొక్కజొన్న పంట చేతికొచ్చిందన్నారు. ఇప్పటికి కొన్ని గ్రామాలకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు ప్రైవేట్ వ్యాపారులకు గత్యంతరం లేక అమ్ముకొని నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 రూపాయలు ప్రకటించిందని, కానీ మార్కెట్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు రూ.1600 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనివలన రైతు క్వింటాల్‌కు ఎనిమిది వందల రూపాయలు నష్టపోతున్నారన్నారు. మొక్కజొన్న కొనుగోలుపై ప్రభుత్వం పరిమితి విధించడం సరైంది కాదన్నారు. రైతు వద్ద ఉన్న మొక్కజొన్న మొత్తం ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కొక్క రైతు నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని విధించిన పరిమితిని వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కొక్క ఎకరం నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని, మిగిలిన పంట రైతులు ఎవరికి అమ్ముకోవాలని ఆయన ప్రశ్నించారు. భూ సమస్యలు పరిష్కరించకుండా రైతు సమస్యలు పరిష్కారం కావన్నారు. తెలంగాణ రైతు సంఘం భూ భారతి చట్టం తీసుకొచ్చి ప్రజలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని కానీ నేటి వరకు దాని అమలు ఊసే లేదన్నారు. సాదా బైనామాలో వచ్చిన అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనియెడల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో బాధిత రైతులతో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు లకావత్ మహిపాల్, బెజ్జంకి కర్ణాకర్, గుగులవత్ తిరుపతి నాయక్, లింగంపల్లి కొండయ్య, కె. జనార్ధన్, కారేపల్లి లింగారెడ్డి, ఏ. గంగారెడ్డి పాల్గొన్నారు.

**తెలంగాణ రైతు సంఘం నూతన జిల్లా కమిటీ ఎన్నిక**
జిల్లా అధ్యక్షునిగా సూధవేణి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా లకావత్ మహిపాల్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులుగా బెజ్జంకి కరుణాకర్ రావు, గుగులాత్ తిరుపతి నాయక్, లింగంపల్లి కొండయ్య, జిల్లా సహాయ కార్యదర్శులుగా కే. జనార్ధన్, కారేపల్లి లింగారెడ్డి, ఏ. గంగారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ కిరణ్మయి



**బాన్సువాడ ఏప్రిల్ 15 (జనం సాక్షి) :**
కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ చెల్లాపురం శ్రీకాంత్ చేస్తున్న కృషి గొప్పదని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ స్కిల్ ఉంటేనే జాబ్ లో ఏదైనా సాధించవచ్చునని ఉద్యోగాలలో మంచి స్థాయిలో ఎదగవచ్చునని తెలిపారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళా విజయవంతం అయిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ వారి సహకారంతో నిర్వహించిన జాబ్ మేళాలో నిరుద్యోగులకు (41)మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. అక్షయ్ హెచ్ ఆర్ సర్వీసెస్ హైదరాబాద్ ఏం ఎస్ ఆర్ ఫార్మా కంపెనీ, డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ (టెక్ జాబ్) ద్వారా టెన్త్ ఇంటర్ డిగ్రీ ఎంబీఏ బి.టెక్, బీఎస్సీ అగ్రికల్చర్ హోటల్ మేనేజ్ మెంట్ పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని తెలిపారు. వయస్సు 18 నుండి 30 సంవత్సరాలు కలిగిన యువతి, యువకులకు ఐటీ కంపెనీలలో (ఏ1/ఎంఎల్ )రంగంలో 7, ఎంఎస్ఎన్ ఫార్మా లో 8 విజయ బయో అగ్రికల్చర్ 22, బ్యాంకింగ్ 4 వంటి తదితర విభాగాల్లో భాగంగా అన్ని రకాల సౌకర్యాలతో కూడిన ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ సెక్రెటరీ మహమ్మద్ ఎజాస్, సభ్యులు పిట్ల శ్రీధర్, దాసరి శ్రీనివాస్, ముదిరెడ్డి విఠల్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకుడు యండి. దావూద్, వివిధ కంపెనీల హెచ్ఆర్ మేనేజర్లు బ్రహ్మానందరెడ్డి, శర్మ, కమలాకర్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఆత్మగౌరవాన్ని
# కించపరిస్తే ఊరుకునేది లేదు
### తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

**హయత్ నగర్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంట్‌లో తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, పాకిస్తాన్‌తో పోల్చడం తెలంగాణ ప్రజలకు నచ్చక పోవడంతో నిరసనగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో హయత్ నగర్ మండల ఆఫీస్ ముందు తేజస్వి సూర్య దిష్టిబొమ్మను తగులబెట్టారు. తెలంగాణ గురించి మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే తెలంగాణ ప్రజలు ఊరుకునేది లేదని, ఖబర్దార్ తెలంగాణ జోలికి వస్తే అని, తెలంగాణ బిడ్డలు పెద్ద ఎత్తున తేజస్వి సూర్యని హెచ్చరించారు. పార్లమెంట్ ఎంపీ తేజస్వి సూర్య పై హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ హెచ్ ఓ నాగరాజు గౌడ్‌కు కంప్లైంట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షురాలు తండ ఉపేంద్ర యాదవ్, చిత్రం కృష్ణ బలరాం, ప్రమీల వరాలు, ప్రకాష్ నాయక్, ఇంద్ర, కిషోర్ లాల్, దుబ్బాక సురేష్, ఉద్యమకారులు, తదితరు పాల్గొన్నారు.

# ఘనంగా లీడ్ గ్రూప్ శిక్షా అవార్డ్స్ 2025-26 మూడో ఎడిషన్ ఫినాలే




**ఖైరతాబాద్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** లీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో దేశంలోని అగ్రగామి స్కూల్ లెర్నింగ్ సిస్టమ్స్ సంస్థగా పేరుగాంచిన ఈ సంస్థ, తన భాగస్వామ్య పాఠశాలల కోసం నిర్వహిస్తున్న దేశంలోనే అతిపెద్ద స్కూల్ రివార్డ్ కార్యక్రమం అయిన శిక్షా అవార్డ్స్ 2025-26 మూడో ఎడిషన్ ఫినాలే సందర్భంగా జాతీయ అవార్డులు, దక్షిణ జోనల్ సత్కార వేడుకలను హైదరాబాద్‌లో విజయవంతంగా నిర్వ హించినట్లు ఆ సంస్థ ప్రతినిధి సుమీత్ మెహతా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.వారు మాట్లాడుడు తూ శిక్షా అవార్డ్స్ అనేది ప్రతి సంవ త్సరం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం అన్నారు. ఉన్నతమైన విద్యను అందించడంలో విశిష్ట కృషి చేసి, విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచడంలో ముందుండే పాఠశాలలు, ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం దీని ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రాండ్ ఫినాలే కార్యక్ర మంలో దక్షిణ భారతదేశం నలుమూలల నుంచి ప్రముఖ పాఠశాల యజమా నులు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు చెప్పారు. ఈ అవార్డుల్లో భాగంగా దక్షిణ జోన్‌లో సుమారు 63 పాఠశాలలు, 1,200 మంది ఉపా ధ్యాయులను సంస్థ సత్కరించినట్లు చెప్పారు. దేశ వ్యాప్తంగా 3 వేలకు పైగా పాఠశాలలు, 22 వేల మంది ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొ నడం ద్వారా దీని విస్తృతి, ప్రాధాన్యత స్పష్టమైం దని తెలిపారు. జాతీయ గ్రాండ్ ఫినాలేతో ముగి సిన ఈ కార్యక్రమంలో 80 పాఠశాలలు, 1,600 మంది ఉపాధ్యాయులు జాతీయ విజేతలుగా స త్కరించబడ్డారని తెలిపారు. విద్యార్థుల విజయానికి చేసిన విశిష్ట కృషిని గుర్తిస్తూ ఈ గౌరవాలు అందజేశామన్నారు. ప్రతి చిన్నారికి ఉత్తమ విద్యా ఫలితాలు అందించడమే లీడ్ గ్రూప్ లక్ష్యం అన్నారు. ఆ దిశగా నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యా యులు, పాఠశాలలను శిక్షా అవార్డ్స్ ద్వారా గౌరవించడం జరుగుతోందన్నారు.

### ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అధ్యాపకుల నిరసన

**హయత్ నగర్, ఏప్రిల్ 17 (జనం సాక్షి) :**
టిజిఇజెఎసి ఇచ్చిన పిలుపు మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్‌నగర్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కళాశాల ప్రవేశ ద్వారం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. జీతాలు, బకాయిలు, ఇతర అలవెన్సులతో సహా పెండింగ్ బిల్లుల చెల్లింపులో జరుగుతున్న అసాధారణ జాప్యంపై, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జాప్యం ఉద్యోగులకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు కలిగిస్తోందని, ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలన్నీ విడుదల చేయాలని కోరారు. విద్యా కార్యకలాపాలకు ఎటువంటి ఆటంకం కలగకుండా మధ్యాహ్న భోజన విరామంలో ఈ నిరసన శాంతియుతంగా నిర్వహించారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి

### అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :**
డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ భారత దేశంలో విశిష్టమైన పాత్ర పోషించారని వారు చేసిన సేవలు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్ రెడ్డి వారి వర్ధంతిని పురస్కరించు కొని ఏర్పాటు చేసినటువంటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ రాష్ట్రపతిగా, భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతిగా అనేక సేవలు అందించారని వారి పరిజ్ఞానంతో ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రజల శ్రేయస్సు కోరిన గొప్ప రాజనీతిజ్ఞుడని కొనియాడారు. వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని, ఉపాధ్యాయ వృత్తిని నమ్ముకొని విద్యార్థులకు ఎన్నో విధాలుగా సేవలను అందించి ఉత్తమమైన స్థానాలలో స్థిరపరచి వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. వారు చేసిన సేవలకు రూపొందించిన పథకాలకు భారతదేశ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన భారతరత్నతో సత్కరించి వారి జన్మదిన ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని వారు చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇతర దేశాలకు రాయబారిగా పనిచేసి భారతదేశం ఔన్నత్యాన్ని స్వస్తిరపరచి ఎన్నో సేవలు చేశారని వారు గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని వారి శ్రమించిన తీరు చాలా ప్రేరేపించదగినదని అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రావుస్ కళాశాల లెక్చరర్ల కీర్తిని శిఖరాగ్రహానికి తీసుకెళ్లిన విద్యార్థులు

- తెలంగాణ రాష్ట్ర మొదటి ర్యాంకులు సాధించిన రావుస్ విద్యార్థులు
- ముస్లిం మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు లెక్చరర్లకు ఘన సన్మానం



**వనపర్తి బ్యూరో ఏప్రిల్ 17 జనంసాక్షి :**
ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో, రావుస్ కళాశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకులు సాధించి, విద్య చెప్పిన లెక్చరర్ల కీర్తిని మరొక్కసారి చాటిచెప్పారు. వనపర్తి జిల్లాకు విద్యలో రాష్ట్రంలోనే మంచి గుర్తింపు ఉంది. అందుకు కారణం, గ్రామీణ విద్యార్థులచే రాష్ట్రస్థాయి ర్యాంకులను తెప్పించే లెక్చరర్‌లు ఉండటం, క్రమశిక్షణ పట్టుదలతో కష్టపడి ఉన్నత చదువులు చదివిన, ఈ ప్రాంత గ్రామీణ లెక్చరర్లు, మన ప్రాంత విద్యార్థులు కార్పొరేట్ స్థాయి ర్యాంకులు ఎందుకు సాధించలేరు...? అనే సంకల్పంతో విద్యార్థులకు క్రమశిక్షణ విలువలతో కూడిన పాఠ్యాంశాలను బోధిస్తూ, వారి తల్లిదండ్రుల జీవనస్థితి గతులను, విద్యార్థులకు తెలియజేస్తూ, వారిలో ఉన్నత లక్ష్యాలను సాధించే దిశగా, ఎప్పటికప్పుడు మోటివేషన్ చేస్తూ, వారు సాధించాలనుకున్న కలలను, విద్యార్థులచే ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి ర్యాంకులు, సాధింపచేస్తూ వారిలో ఈ ఆనందాన్ని చూసుకుంటున్నారు. ఇలాంటి లెక్చరర్లు వనపర్తి లో ఉండడం గర్వించదగ్గ అంశంగా ప్రతి ఒక్క తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటున్నారు. లక్షల్లో ఖర్చుపెట్టి కార్పొరేట్ స్థాయి విద్యను అందించలేని తల్లిదండ్రులకు రావుస్ కళాశాల ఒక మార్గదర్శకంగా నిలిచిందని,వనపర్తి ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు, విద్యార్థులు తల్లిదండ్రులు అన్నారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ఎంపీసీ ద్వితీయ సంవత్సరం అసిత శ్రీ 996/1000 మార్కులతో స్టేట్ ఫస్ట్, ఎంఈసి 975/1000 ఆయిషా బేగం, జూనియర్ ఇంటర్ ఎంపీసీ 443/440 ఆశ్ర విద్యార్థులతో పాటు కళాశాల ప్రిన్సిపాల్, యజమాన్య సభ్యులు, కళాశాల లెక్చరర్లు అయిన రాంకుమార్,ఏ శ్రీనివాస్, కొండ శ్రీనివాస్, పి అమరేందర్ రెడ్డి బి రమేష్ రెడ్డిలను, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ వారిస్, రిటైర్డ్ టీచర్ సత్తార్, వాజిద్, సయ్యద్ పాషా, ఓమర్, రియాజ్ మహమ్మద్, మోయినుద్దీన్‌లు ఘనంగా సన్మానించారు.

# మల్కాజిగిరి జోన్ పరిధిలో జోరుగా అక్రమ నిర్మాణాలు

- జోనల్ కమీషనర్‌కి పిర్యాదు చేసిన ఫలితం శూన్యం
- అనుమతులు రెసిడెన్షియల్ నిర్మాణము కమర్షియల్
- టౌన్ ప్లానింగ్ అధికారుల అంతర్గత ఒప్పందాలే కారణమా?




**మల్కాజిగిరి ఏప్రిల్ 17(జనంసాక్షి) :** నిబంధనలు పాటించాల్సిన చోట అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. సామాన్యుడు చిన్న ఇల్లు కట్టుకుంటే వంద నిబంధనలు చెప్పే టౌన్ ప్లానింగ్ అధికారులు, కళ్ళముందే భారీ ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయక నగర్ లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. వినాయక నగర్ పరిధిలో ని లోని మూడు గుళ్ళ పక్కన ఉన్న 100 ఫీట్ల ప్రధాన రహదారిపై ఒక భారీ భవన నిర్మాణం జరుగుతోంది.

నిబంధనల ప్రకారం ఇక్కడ నివాస గృహ అవసరాల కోసం అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది.కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం సదరు యజమాని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు కటింగ్ ఉన్న ఏలాంటి సెట్ బ్యాక్ లు లేకుండా పూర్తిస్థాయి వాణిజ్య భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రధాన రహదారిపై ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నార.ఈ అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని గత మూడు నెలలు గా స్థానిక ప్రజలు పలుమార్లు టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి సంగీత, డిప్యూటీ సిటీ ప్లానర్ బాల శ్రీనివాస్ కు ఫిర్యాదు చేసిన చూసి చూడనట్లు వాహరిస్తున్నారని మండి పడ్తున్నారు. భవనం పునాది దశలో ఉన్నప్పుడే ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో ప్రస్తుతము బిల్డింగ్ పూర్తి కావస్తుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రధాన రహదారిపై ఇంత భారీ నిర్మాణం జరుగుతుంటే అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.భవనం పూర్తయ్యే వరకు వేచి చూసి, ఆ తర్వాత తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటారా అని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత చూస్తుంటే నిర్మాణదారులకు, అధికారులకు మధ్య భారీ స్థాయిలో అంతర్గత ఒప్పందాలు కుదిరాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మామూళ్ల మత్తులో పడి అధికారులు నిబంధనలను పక్కన పెట్టేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వినాయక నగర్ 100 ఫీట్ల రోడ్డులో జరుగుతున్న ఈ అక్రమ నిర్మాణాన్ని పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత

- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోతే ప్రాణాలు పోతాయి
- మద్యం, మత్తుపదార్థాలు సేవించి డ్రైవ్ చేయొద్దు
- యువత జీవితాలు రక్షించడం మనందరి బాధ్యత



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని అదనపు డీజీపీ స్వాతి లక్రా తెలిపారు. 99 రోజుల పాటు నిర్వహించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీసాయి దంత వైద్య కళాశాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత, అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేయడంపై లారీ, ఆటో డ్రైవర్లు, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు డీజీపీ స్వాతి లక్రా, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా ఎస్పీ స్నేహమేహర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అదనపు డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ, రాష్ట్రంలో మద్యపానం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించని కారణంగా అదేవిధంగా నిబంధనలు పాటించకుండా డ్రైవింగ్ చేసే క్రమంలో రోడ్డు ప్రమాదాల్లో తమ విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆమె అన్నారు. ఎదుటివారి తప్పిదాల వల్ల కూడా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని దీన్ని దృష్టిలో పెట్టుకుని వాహనాలను వేగంగా నడపకూడదని సూచించారు.

జిల్లాలో రోడ్డు భద్రత కమిటీలను వేయడం జరిగిందని, ప్రతి నెల రోడ్డు భద్రతపై సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం పాలనపరంగా తమ సహకారాలు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్తు నాశనం కాకుండా మంచి సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరమని అందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్పీ స్నేహమేహర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ప్రతి వాహనదారుడి బాధ్యత అన్నారు. సంపాదించే వ్యక్తి చనిపోతే కుటుంబం పూర్తిగా ఇబ్బందికి గురవుతుందని ఆమె తెలిపారు.

ముందుగా దంత వైద్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన శాస్త్రీయ నృత్యాలు, డ్రగ్స్ తీసుకుంటే కలిగే అనర్థాలపై చేసిన నాటక ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై తీసిన లఘు చిత్రం ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా అత్యవసర సమయాల్లో సేవలందించిన 108 సిబ్బంది పవన్ కుమార్, వైద్య రంగంలో ఉత్తమ సేవలందిస్తున్న డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోహిత్, పోలీస్ కళాజాత బృందం అశోక్‌లను అతిథులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి, జిల్లా వివిధ శాఖల అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా...యువరైతు మృతి

- కాటం కిషన్ రెడ్డి మృతితో లంబాడిపల్లెలో విషాదం
- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని గ్రామస్తుల విజ్ఞప్తి




**చిగురుమామిడి ఏప్రిల్ 17(జనంసాక్షి):** తన వ్యవసాయ పొలం వద్ద వరి కోత ముగించుకొని ట్రాక్టర్లో వడ్లు తీసుకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా కొట్టి యువరైతు మృతి చెందిన విషాద సంఘటన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే కుటుంబ సభ్యులు,పోలీసులు,గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... లంబాడిపల్లి గ్రామానికి చెందిన కాటం కిషన్ రెడ్డి(28) అనే యువరైతు కొంత పొలం కోసుకొని కుంటకట్ట ఎక్కే సమయంలో ఒకసారి గా ట్రాక్టర్ వెనక్కి వస్తూ బోల్తా కొట్టిందని అక్కడికక్కడే కిషన్ రెడ్డి ట్రాక్టర్ ఇంజన్ పెద్ద టైరు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు,సర్పంచ్ కాటం సంపత్ రెడ్డితోపాటు గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకి తీశారు. మృతుడి తండ్రి లింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పృథ్వీదర్ గౌడ్ తెలిపారు.మృతుడికి భార్య శృతి,తల్లిదండ్రులు ఉన్నారు. అందరితో కలిసిమెలిసి ఉండే కిషన్ రెడ్డి,హఠాత్తుగా జరిగిన ప్రమాదంలో మృతి చెందడంతో ఘటన స్థలానికి వచ్చిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు.మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి,సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,సిపిఐ జిల్లా నాయకురాలు గూడెం లక్ష్మిలు కోరరుతూ భాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.వరి కోతలు కోస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వెళ్లాలని,ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని ఎస్సై పృథ్వీధర్ గౌడ్ కోరారు.

# ఎండాకాలం జాగ్రత్తలు తెలియజేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 17 (జనం సాక్షి);** ఎండాకాలం నేపథ్యంలో ఆసుపత్రికి వచ్చే జాగ్రత్తలు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్ అర్బన్ ఆరోగ్య వైద్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్, వ్యాక్సిన్లు, ఓపీ రిజిస్టర్ పరిశీలించి సూచనలు చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు.రోజు ఎంత మంది పేషెంట్లు వస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల రిజిస్ట్రేషన్, టీకాలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. పలువురు పేషెంట్లతో మాట్లాడి,వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో ప్రజలకు జాగ్రత్తలు తెలియజేయాలని పేర్కొన్నారు. మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఇట్టి పరిశీలనలో వైద్యురాలు రేణుక, సిబ్బంది ఉన్నారు.

### మండుటెండల్లో జాగ్రత్తలు పాటించాలి: ఆర్టీసీ వైద్యాధికారి హెచ్చరిక

**కరీంనగర్ టౌన్ : మండుటెండల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ జోనల్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా. ఎ.వి. గిరిసింహారావు సూచించారు. ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లు, సిబ్బంది, కండక్టర్లకు వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వేసవి జాగ్రత్తలు కరపత్రాలను విడుదల చేస్తూ, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు, పిల్లలు, గర్భిణులు, బీపీ, షుగర్ రోగులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.**

# దళిత రత్న అవార్డు అందుకున్న కనక పుడి వీరస్వామి



**ఖమ్మం టౌన్, ఏప్రిల్ 16 (జనం సాక్షి) :** హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన నా కు ప్రతిష్టాత్మక "దళిత రత్న" అవార్డు ప్రధానం చేశారు . హైదరాబాదులోని రవీంద్ర భారతి జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రభుత్వ ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ కో కన్వీనర్ శివకుమార్ అధ్యక్షతన జరిగిన అవార్డుల ప్రధాన చౌక కార్యక్రమానికి కమిటీ సభ్యులు తెలంగాణ మాదిగ హక్కుల వ్యవస్థాపకులు మాదిగ తెలంగాణ మాదిగ హక్కుల దండోరా టీఎంహెచ్డీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పాల్గొని అవార్డు అందజేశారు. సమాజంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో సేవలందిస్తున్నందుకు కనకపుడి వీరస్వామి ఈ అవార్డు కు ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాలకు అనగా నిలిస్తే సేవా కార్యక్రమం కొనసాగిస్తున్న కనకపుడి వీరస్వామి సేవలో అభినందనీయమన్నారు భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు

కనకపుడి వీరస్వామి అనంతరం తనపై ఇచ్చిన నమ్మకాన్నికి కృతజ్ఞతలు తెలిపారు ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మరింత కృషి చేస్తానని స్పష్టం చేశారు అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని తెలిపారు



# ఆర్టీసీ కార్మికుల గేటు ధర్నా

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఈనెల 22 నుండి సమ్మెకు సిద్ధమవుతున్న క్రమంలో రాష్ట్ర ఆర్టీసీ జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం వేములవాడ ఆర్టీసీ డిపో ముందు కార్మికులు గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల క్రమం లో ఇచ్చిన హామీలో భాగంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, రెండు పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆర్టిసి కార్మికులకు అన్ని వసతి సదుపాయాలు కల్పించాలని ఆర్టీసీ యూనియన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అన్నారు.ఈ గేటు ధర్నా కార్యక్రమంలో వేములవాడ జేఏసీ ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి

### గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**గోదావరిఖని, జనంసాక్షి :** జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష (రామగుండం)గోదావరిఖని జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రి లోని మెడికల్ ఓపీ, న్యూ బ్లాక్, ఐసీయూ బ్లాక్, ఎమర్జెన్సీ విభాగం, డ్యూటీ డాక్టర్స్ గదులను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, అవసరమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. శానిటేషన్ పనితీరును మెరుగుపర్చాలని సంబంధిత ఏజెన్సీకి సూచిస్తూ, తక్షణమే తనను కలవాలని ఆదేశించారు. రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బెడ్ స్ట్రెంగ్త్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని, మెడిసిన్ విభాగానికి అదనంగా ఒక ఓపీ బ్లాక్ ఏర్పాటు చేయాలని సూచించారు.ల్యాబ్ యంత్రాలు, ఎసీ వంటి పరికరాల్లో ఎలాంటి లోపాలు వచ్చినా వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట డాక్టర్ లు కృపా బాయి,రాజు,సంబంధిత అధికారులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చుట్టపు పర్యటనలను ప్రజలు గమనిస్తున్నారు

### బాల్క సుమన్ వ్యాఖ్యలు సహించం : మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** వేములవాడలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా స్పందించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో బాల్క సుమన్ మాట్లాడిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో వేములవాడ నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని విమర్శించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికైన తరువాత దాదాపు రూ 700 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి రూ150 కోట్లు,రోడ్ల విస్తరణకు రూ 46 కోట్లు కేటాయించారన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేదని, మూడో బ్రిడ్జి, కలికోట సూరమ్మ ప్రాజెక్టు, మల్కాపేట రిజర్వాయర్, గుడి చెరువు వంటి పనులను పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. ప్రస్తుతం ఆ పనులను వేగంగా పూర్తి చేస్తున్నామన్నారు.మీరు అప్పట్లో వేములవాడకు వచ్చి ప్రజల సమస్యలు చూసినా పరిష్కరించలేదని, ఇప్పుడు వచ్చి విమర్శలు చేయడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్,కౌన్సిలర్లు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

**బోయినపల్లి, (జనం సాక్షి) :** అష్టకష్టాలు పడి కలల సౌధాన్ని నిర్మించుకున్నాడనే సంతోషం ఆ ఇంట్లో ఎంతోకాలం నిలవలేదు. కొత్త ఇల్లు తెచ్చిన అప్పుల భారం ఆ యజమాని ప్రాణాలనే బలి తీసుకుంది. బోయినపల్లి మండల పరిధిలోని వరదవెల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.వివరాల్లోకి వెళ్తే. గ్రామానికి చెందిన వల్లంపట్ల ఎల్లయ్య (71) ఇటీవలే కొత్త ఇంటిని నిర్మించుకున్నాడు. అయితే, నిర్మాణ వ్యయం అంచనా దాటి పోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. ఆ అప్పులు తీర్చే మార్గం కనిపించక, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో గత కొంతకాలంగా ఎల్లయ్య తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు.జీవితంపై విరక్తి చెందిన ఆయన, శుక్రవారం తెల్లవారుజామున తాను ఎంతో ఇష్టంగా కట్టుకున్న కొత్త ఇంటి మెట్ల వద్దే లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు.మృతుడి కుమారుడు వల్లంపట్ల దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయినపల్లి ఎస్ఐ రమాకాంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటిస్తేనే ప్రమాదాలు నివారించవచ్చు

- వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోతే ప్రాణాలు పోతాయి
- మద్యం, మత్తుపదార్థాలు సేవించి డ్రైవ్ చేయొద్దు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఏప్రిల్ 17 (జనంసాక్షి):** వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారోత్సవాల సందర్భంగా "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని కే కన్వెన్షన్ హాల్‌లో జిల్లాలోని ఆర్టీసీ, విద్యాసంస్థలు, ఆటో, మున్సిపల్, ఇతర వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం, సీపీఆర్ ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రైల్వే, రోడ్డు భద్రత ఐజీపీ రమేష్ నాయుడు ఐపీఎస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే హాజరయ్యారు. 'రహవీర' పథకం కింద ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను సమీప ప్రధాన రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులకు తరలిస్తే, వారికి వారం రోజులపాటు ఉచిత చికిత్స అందిస్తూ రూ. 1,50,000 వరకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తుందని వివరించారు. ప్రమాద సమయంలో భయపడకుండా బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి 'రహవీర' పథకం కింద రూ. 25,000 ప్రోత్సాహకం ఇస్తామని తెలిపారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని, ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. తెలంగాణలో రోజుకు సుమారు 70 రోడ్డు ప్రమాదాలు నమోదవుతున్నాయని, అందులో 20 వరకు మరణాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఓవర్ స్పీడ్, తప్పుగా ఓవర్ టేకింగ్ చేయడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వాహనాలు 80 కిమీ వేగ పరిమితి లోపలే నడపాలని, ముఖ్యంగా ప్రధాన రహదారులపై ఉన్న స్పీడ్ సైన్ బోర్డులను పాటించాలని సూచించారు. సీట్‌బెల్ట్ ధరించకపోవడం, హెల్మెట్ పెట్టుకోకపో వడం వలన ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు వివిధ శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాల సందర్భంగా రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన సదస్సులు చేపట్టామని వెల్లడించారు. జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ, ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్‌తోనే అవుతున్నాయని తెలిపారు. జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అలాగే జిల్లాలో రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలో రోడ్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో 08 బ్లాక్ స్పాట్స్ గుర్తించడం జరిగిందని, కొదురుపాక బ్రిడ్జ్ చౌరస్తా, నందికమాన్ చౌరస్తా, వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ చౌరస్తా, సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా, పెద్దూర్, ఎల్లారెడ్డిపేట హెచ్‌పి పెట్రోల్ బాంక్ వద్ద, తంగళ్ళపల్లి పద్మనగర్, సారంపల్లి లుగా గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపట్టడం జరిగిందని వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ కుమార్, జిల్లా వైద్యాధికారి రజిత, తహసీల్దార్ మహేష్ కుమార్, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వర రావు, వెంకటేష్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మధుకర్, ఆర్ఐలు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్, ఎస్ఐలు, పోలీస్, రవాణా శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమృత్ పథకం పేరుతో పైప్‌లైన్ దందా?

### మాజీ మేయర్ సంచలన ఆరోపణలు



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 17 (జనం సాక్షి) :** నగరంలో తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అమృత్ పథకం పేరుతో కోట్ల రూపాయల దోపిడీ జరుగుతోందని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ ఆరోపించారు.మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగర ప్రజలకు సమయానికి తాగునీరు అందించలేకపోతున్న అధికారులు ఇప్పుడు అమృత్ పథకం పేరుతో పైప్‌లైన్ పనుల ద్వారా డబ్బులు కాజేస్తున్నారని విమర్శించారు. మిషన్ భగీరథ ద్వారా ఇప్పటికే బలమైన నీటి సరఫరా వ్యవస్థ ఉన్నప్పటికీ, అదే ప్రాంతాల్లో మళ్లీ పైప్‌లైన్ పనులు చేపట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. అమృత్ పథకం కింద చేపడుతున్న రూ. 16.77 కోట్ల పనులపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై టెండర్ల ద్వారా ప్రజల డబ్బును దోచుకుంటు న్నారని ఆరోపించారు. నగరంలో రెండు రోజులకు ఒకసారి మాత్రమే, అది కూడా కొద్దిసేపు మాత్రమే నీరు సరఫరా అవుతుండటం పాలన వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మానేరు డ్యామ్‌లో నీటి మట్టం తగ్గుతున్నప్పటికీ ముందస్తు చర్యలు తీసుకోకపోవడం నిర్లక్ష్యమన్నారు.కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నగర ప్రజల దాహంతో ఆటలాడితే సహించబోమని హెచ్చరిస్తూ, అవినీతిపై నిరంతర పోరాటం కొనసాగిస్తామని సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు.



# శాస్త్రిపురం ప్లైఓవర్ ప్రారంభం

- ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ప్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ప్లై ఓవర్ జీహెచ్ఎంసీ నిర్మించింది. జీహెచ్ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. శాస్త్రిపురం ప్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ప్లైఓవర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.

# ఆనాడు కులగణను ఎందుకు వ్యతిరేకించారు?

- ఏప్రిల్ 17 కాంగ్రెస్ ఏమేం చేసిందో గుర్తు చేసుకోవాలి
- రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ నిశికాంత్ దూబె

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** పార్లమెంట్ సమావేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై జార్ఖండ్ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె విమర్శలు గుప్పించారు. కులగణనను కాంగ్రెస్ గతంలో వ్యతిరేకించిందన్నారు. కులాల ఆధారంగా జనగణన దేశాన్ని విభజిస్తుందని నాడు హస్తం పార్టీ వాదించిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నా, లేకపోయినా కులగణన నిర్వహణ ఎప్పటికీ సాధ్యం కాదని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఇక ఏప్రిల్ 17 గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శనాస్త్రాలు సంధించారు నిషికాంత్. 'ఏప్రిల్ 17 గురించి రాహుల్ గొప్పగా చెబుతున్నారు. 1987లో బోఫోర్స్ కుంభకోణం వెలుగు చూసింది ఆ రోజేగా. అదే రోజునే సీతారామ్ కేసరి నుంచి సోనియా గాంధీ పదవి లాక్కున్నారు. 1999లో వాజ్‌పేయీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పడగొట్టింది కూడా ఇదే తారీఖునే. మహిళలకు రిజర్వేషన్లు ఇస్తుంటే రాహుల్ తట్టుకోలేకపోతున్నారు. రాహుల్ ప్రసంగం పీసీ సర్కార్ మ్యాజిక్ షోలా సాగింది. మహిళా బిల్లు గురించి రాహుల్ మాట్లాడలేదు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్‌కు లేదు' అని నిషికాంత్ దూబె అన్నారు.

# రొటేషన్‌లో మహిళలకు ప్రధాని పదవి

- కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సూచన



**న్యూఢిల్లీ, ఏప్రిల్17 (జనంసాక్షి) :** మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ లోక్‌సభలో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 2002లో డీలిమిటేషన్ చేశారు. ప్రస్తుతం మనం 2026లో ఉన్నాం. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం పునర్విభజన చేస్తామంటున్నారు. 15 ఏళ్లు గడిచిపోయింది. దీనిపై ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు. మహిళా రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం కాదు. కానీ, ఈ అంశాన్ని డీలిమిటేషన్‌తో లింక్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నాం. ప్రభుత్వానికి నేను కొన్ని సూచనలు చేస్తున్నా. మంత్రిత్వ శాఖలో మహిళలకు 50 శాతం రిజర్వ్ చేయాలి. ప్రధాని పదవిని కూడా రొటేషన్ పద్ధతిలో మహిళలకు రిజర్వ్ చేయాలి. ఎందుకంటే 2029 ఎన్నికల్లో భాజపా అధికారంలోకి రాదని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# పేరు, ఫొటో వాడకుండా చూడండి

- ఢిల్లీ కోర్టులో అల్లు అర్జున్ కేసు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను ఎవరూ వాడకూడదని కోరుతూ.. ఒక పిటీషన్ దాఖలు చేశారు. తన పేరు, ఫోటోలను ఉపయోగించుకుని పలు ఉత్పత్తులను విక్రయిస్తూ డబ్బు సంపాదించుకుంటూ తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేస్తున్న వారికి ఈ కేసు వర్తిస్తుందని, తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టులో అల్లు అర్జున్ దావా వేశారు. శుక్రవారం జస్టిస్ తుషార్ రావు కమిటీ నేతృత్వంలో ఈ కేసు విచారణకు రానుంది. ఇదే అంశంలో ఇప్పటికే చిరంజీవి, మోహన్ లాల్, నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, ఐశ్వర్య రాయ్, తదితరులు తమ వ్యక్తిత్వ హక్కులను కాపాడాలంటూ కోర్టును కోరిన సంగతి విదితమే. ఈ కేసులలో సినీ ప్రముఖుల ప్రైవసీ హక్కులను రక్షించకపోతే వారికి సరిదిద్దలేని నష్టం జరుగుతుందని న్యాయస్థానం స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది.

# ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన గురుకుల బీసీ విద్యార్థులకు సన్మానం

- మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్17 (జనంసాక్షి) :** బీసీ గురుకులాల్లో ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించాలని నిర్ణయించామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీసీ సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వ్యాఖ్యానించారు. శుక్రవారం తెలంగాణ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి , బీసీ గురుకులాల సెక్రెటరీ సైదులు, ఎండీ మల్లయ్య బట్టు, అలోక్ కుమార్ హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. బీసీ సంక్షేమ శాఖలో పెండింగ్ అంశాలపై ఈ సమీక్షా సమావేశంలో చర్చించామని పేర్కొన్నారు. బీసీ విదేశీ విద్యానిధికి సంబంధించి లబ్దిదారుల ఎంపికపై సమావేశంలో మాట్లాడామని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హాస్టళ్లు, గురుకుల పాఠశాలల అద్దెలు ఎప్పటికప్పుడు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం సమయానికి విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు చేరాలా చర్యలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కాటమయ్య రక్షణ కవచాలను.. శిక్షణ ఇచ్చిన వారికి కిట్స్ అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# అడవి తల్లి ఒడిలోనే నివాసం ఉంటాం

## పులులతో మమేకం అవుతాం

- అటవీ ప్రాంతాన్ని వదిలి బతకలేం
- 'సీఎం ప్రజావాణి'లో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటీఆర్) చెంచులు
- ఆదుకుంటామని డాక్టర్ జీ. చిన్నారెడ్డి భరోసా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** 'అడవి తల్లి ఒడిలోనే నివాసం ఉంటాం. పులులతో మమేకం అవుతాం. తరతరాలుగా నివాసం ఉంటున్న అటవీ ప్రాంతాన్ని మాత్రం వదిలి బయట ప్రాంతంలో జీవించలేం. మమ్మల్ని ఇక్కడే బతుకనివ్వండి' అని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ (ఏటిఆర్) ప్రాంతం చెంచులు స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఏటీఆర్ ప్రాంత చెంచు జాతి గిరిజనులు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డిని కలిసి తమ సమస్యలను తెలిపారు. తరతరాలుగా అడవి తల్లిని నమ్ముకుని అడవుల్లోనే నివసిస్తున్న తాము టైగర్ రిజర్వ్ కోసం చెంచు పెంటలను ఖాళీ చేసి బయటి ప్రాంతానికి వెళ్లి జీవించలేమని స్పష్టం చేశారు. అడవిలో పరిస్థితులు ఎలా ఉన్నా పులులతో కలిసి జీవించేందుకు కూడా తాము సిద్ధమే కానీ చెంచు పెంటలను మాత్రం బలవంతంగా ఖాళీ చేయించవద్దని ఏ టి ఆర్ చెంచులు సార్లపల్లి పెంట చిగుర్ల మల్లికార్జున్, రాయిలేటి పెంట మండ్లి చిట్టెమ్మ, కొమ్మనపెంట చిగురుల నాగమ్మ, సార్లపల్లి పెంట కుడుముల తిరుపతయ్య కోరారు. అటవీ చట్టాలను శాఖ పరంతోపాటు చెంచుపెంటలకు కూడా వర్తింప చేయాలని వారు కోరారు. ఈ విషయంపై డాక్టర్ జి చిన్నారెడ్డి స్పందిస్తూ చెంచులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, చెంచుల అభీష్టం మేరకు ముందుకు సాగుతామని భరోసా ఇచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా అటవీ అధికారి రేవంత్ చంద్రతో చిన్నారెడ్డి ఫోన్ ద్వారా సంప్రదించగా చెంచు కుటుంబాలను అటవీ ప్రాంతం నుంచి బలవంతంగా ఖాళీ చేయించే ప్రసక్తే లేదని తెలిపారు. అటవీ అధికారులు, చెంచులతో సమావేశం కోసం చిన్నారెడ్డి షెడ్యూల్ ను ఖరారు చేయించారు. ఈరోజు భేటీలో రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి హర్ష, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

### సీఎం ప్రజావాణిలో 401 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన 214వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 401 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 110, రెవెన్యూ శాఖకు సంబంధించి 72, ఇందిరమ్మ ఇండ్ల కోసం 125, ప్రవాసి ప్రజావాణికి 02 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 92 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సూర్య ప్రకాష్, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, ప్రవాసి ప్రజావాణి సమన్వయకర్త బొజ్జా అమరేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్వోదయ తెలంగాణే నా గోల్

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సర్వోదయ తెలంగాణే తన గోల్ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు తెలిపింది. జాగృతి కార్యాలయంలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు కవితను కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ తెలంగాణ లో అన్ని వర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమన్నారు. అందరికీ అధికారం అని మాట్లాడటం ప్రారంభించాకే తనకు కష్టాలు ఎదురయ్యాయని తెలిపారు. రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. మూడు, నాలుగేళ్ల క్రితం మనం ఢిల్లీకి వెళ్లి ధర్నా చేసి మహిళ బిల్లు వచ్చేలా చేశామన్నారు. గతంలోనే ఈ బిల్లు ఆమోదం పొందిందని, కానీ మళ్లీ అదే బిల్లును పాస్ అంటూ మోసం చేస్తున్నారని తెలిపారు. ఏ వర్గాలకు రావాల్సిన ప్రయోజనాలను ఆ వర్గాలకు అందించకుండా ప్రతి దాంట్లో రాజకీయ ప్రయోజనం చూసుకుంటున్న పరిస్థితి ఉందని తెలిపారు. జయశంకర్ సార్ జాగృతి సంస్థకు మార్గదర్శకులు, నేను ఆయనకు వీరాభిమానినని తెలిపారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్లలో సామాజిక తెలంగాణ రాలేదని, ఏ వర్గానికి సంపూర్ణంగా న్యాయం జరగలేదని, ఇప్పటికీ చాలా కులాలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయని, ఈ ప్రభుత్వం తప్పుల తడకగా చేసిన సర్వేలో కూడా చాలా కులాలు రాజ్యాధికారానికి దూరంగా ఉన్నాయన్న విషయం స్పష్టంగా తెలిసిందని, గ్రామాల్లో వార్డు మెంబర్, సర్పంచ్ కూడా కాని కులాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. మారోజు వీరన్న కులాల అస్తిత్వ పోరాటాలకు విప్లవ పోరాటాలను జత చేశారని, రాష్ట్రంలో కుల సంఘాల ఏర్పాటుకు కర్త, కర్మ, క్రియ అన్ని ఆయనేనని తెలిపారు. అన్ని కులాలకు న్యాయం జరగాలంటే కుల సంఘాలు బలపడాలంటూ కుల సంఘాలను ఆయన ఏర్పాటు చేశారని, ఆయన మన ముందు పెట్టిన బాధ్యతను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందని తెలిపారు. తెలంగాణలో సామాజిక న్యాయం అన్ని వర్గాలకు జరిగే వరకు పోరాటం చేస్తానని తెలిపారు. ఈ నెల 25న తాము నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, తెలంగాణ ప్రాంతీయ తత్వాన్ని, సామాజిక కోణాన్ని రంగరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దాదాపు లక్ష మంది మాజీ మావోయిస్టులు బీఆర్ఎస్ లో చేరారని, బీఆర్ఎస్ బలోపేతం కావటానికి వాళ్లంతా ఒక చోదక శక్తిగా మారారని, కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వాళ్లెవరికీ కూడా న్యాయం జరగలేదని, తెలంగాణ ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాల కోసం ఏ విధంగా భూపోరాటం చేస్తున్నామో...మాజీ మావోయిస్టుల కోసం కూడా అదే విధంగా పోరాటం చేస్తామని తెలిపారు. తమ పోరాటానికి ఇప్పుడు మారోజు వీరన్న అనుచరులు తోడయ్యారని, ఇక మనల్ని ఆపే శక్తి ఎవరికీ లేదని, మారోజు వీరన్న ఫాలోవర్స్ అంటే ఎంతో నైతికతో ఉంటారని, తెలంగాణ ప్రజల కోసం మన మందరం కలిసి పనిచేద్దామని తెలిపారు.

### 19న అద్వయ కన్వేషన్‌ను సందర్శించనున్న కవిత

ఈనెల 25న రాజకీయ పార్టీ ప్రకటన సందర్భంగా నిర్వహించే మీటింగ్ ఏర్పాట్లను జాగృతి అధ్యక్షురాలు కవిత పరిశీలించనున్నారు. సభా ప్రాంగణం, పార్కింగ్, భోజనాలు, రాష్ట్రం నలువైపుల నుంచీ వచ్చే వాహనాల రూట్ మ్యాప్ సహా సభ ఏర్పాట్లపై కల్వకుంట్ల కవిత సమీక్షించనున్నారు.

# కులాల వారీగా లెక్కలు చెప్పారు

- అసమానతల నివారణ చర్యలు వెంటనే చేపట్టాలి
- పాలమూరు అధ్యయన వేదిక డిమాండ్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** కులాల వారీగా లెక్కలు చెప్పారని, అసమానతల నివారణ చర్యలు వెంటనే చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ వీ. రాఘవాచారి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కులాల వారీగా సామాజిక ఆర్థిక రాజకీయ గణాంకాలు సేకరణ చేసిన ఏడాది కాలానికి ఆ లెక్కలు ప్రజల ముందు పెట్టిందని, ఆ లెక్కలు తెలంగాణరాష్ట్రంలో ప్రజల మధ్య కులాల వారీగా తీవ్ర అసమానతలు ఉన్న విషయాన్ని బయట పెట్టాయని, భూములు, సహజ వనరులు కొద్ది కులాల చేతిలో బందీగా ఉన్నాయి. ఈ అసమానతల వల్ల రాష్ట్ర ప్రగతి వెనుక పట్టు పడుతున్నదని తెలిపారు. వెనుకబడిన కులాల వారికి రాజకీయ ప్రాతినిధ్యం లేదనే చెప్పాలని, విద్య, ఆరోగ్యం, నివాసం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక సహజ వనరులు అందక పోతే ఈ ప్రజలు ఎలా బాగుపడటం కుదురుతుందని, ఇది ప్రభుత్వాల వైఫల్యమని తెలిపారు. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల, వర్గాల ప్రజలు దశాబ్దాలుగా అనేక పోరాటాలు చేస్తున్నారని, ప్రతి సందర్భంలో వారిని మభ్య పెడుతున్నారని, ప్రజల కష్టాలను, నష్టాలను కర్మసిద్ధాంతంతో ముడిపెట్టే వారికి ఈ సమస్య పరిష్కారం అర్థం కాదని, అంతా బాగుంది అనే వాళ్లకు వెనుకబడిన ప్రజల దుఃఖం అర్థం కాదని, ప్రభుత్వం యథాతథ స్థితిలో సమాజాన్ని నడపడం ఇక సాధ్యం కాదని తెలిపారు. అన్ని జీవన రంగాల్లో అసమానతలు నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు, సహజ వనరులు పునః పంపిణీ చేయాలని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికేతరుల పాలు కాకుండా చట్ట పరంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

# 9 ఏళ్ల బాలికను కాపాడిన ముగ్గురు

- వారిని పిలిచి సన్మానించిన కమిషనర్
- ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న సజ్జన్నార్



**హైదరాబాద్, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయ పడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతు న్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళ్తుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ - 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

# తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 17 (జనంసాక్షి) :** తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినెట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370